# ఆ శిక్షే ఒక నేరం



కె.బాలగోపాల్

మానవహక్కుల వేదిక ప్రచురణ

# ఆ శిక్షే ఒక నేరం


## మానవహక్కుల వేదిక ప్రచురణ

**Human Rights Forum Publication**

---

ప్రచురణ సంఖ్య: 26
ప్రచురణ కాలం: ఏప్రిల్ 2012
కాపీలు: 2000, వెల: 30 రూపాయలు
కవర్: అక్బర్
డిటిపి: కె.వి.ఆర్
ముద్రణ: నవ్య ప్రింటర్స్



ప్రతులకు:
**ఎస్. జీవన్ కుమార్**
3-12-117/ఎ-2/బి, పి.ఎస్. కాలనీ,
గణేష్‌నగర్, రామంతపూర్,
హైదరాబాద్ - 500 013
ఫోన్: 040-27039519


**ప్రజాశక్తి, నవోదయ, దిశ బుక్ హౌస్‌లు**

మా వెబ్‌సైట్: www.humanrightsforum.org
బాలగోపాల్ రచనల కోసం: www.balagopal.org

# ముందుమాట

మరణశిక్షలు, క్షమాభిక్షలు మన దేశంలో ఇవ్వాళ నిత్యం వార్తల్లో ఉండే విషయాలు. చర్చనీయాంశం కాని మరణశిక్ష, వివాదాస్పదం కాని క్షమాభిక్ష ఇటీవల ఒక్కటి కూడా ఉండడం లేదు. మన సామాజిక, రాజకీయ చర్చలలో వాటి ప్రాధాన్యం ఎంత పెరిగిందో దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు. ప్రతి మరణశిక్షా నేరం, సమాజం, రాజకీయం, మానవస్వభావాల గురించి కొత్త కొత్త ప్రశ్నలు, మనస్సాక్షిని తాకే ప్రశ్నలు లేవనెత్తుతున్నందువల్ల మొత్తం సమాజం ఈ చర్చలో ప్రత్యక్షంగానో పరోక్షంగానో పాల్గొనే అవసరం ఏర్పడుతోంది.

అన్ని నేరాలకూ మరణశిక్ష ఒక్కటే పరిష్కారమని భావించే వారి నుంచి అసలు చట్టంలో మరణశిక్షే ఉండకూడదనే మాబోటి వాళ్ల వరకు ఈ అంశం మీద ప్రజలలో తీవ్రమైన భేదాభిప్రాయాలే ఉన్నాయి. ఏదైనా పెద్ద నేరం జరిగినపుడు ఎక్కువమంది నోట కసిగా ఆవేశంగా వినిపించే మాట నిందితుడ్ని తక్షణమే ఉరి తీయాలని. అప్పుడు మరణశిక్ష నిరుపయోగత గురించి వారితో మాట్లాడడం కష్టం కాని ఆ ఘటన పూర్వాపరాలు బయటికొచ్చే కొద్దీ, నిందితుల కారణాలు తెలిసే కొద్దీ మరణశిక్షలు అమానవీయమైనవనే మా వాదన వినడానికి కొంతయినా సుముఖంగా ఉంటారు. మరణశిక్షల పట్ల తమ అభిప్రాయాన్ని మార్చుకోవడానికి కొందరైనా సిద్ధపడతారు. ఆరంభంలో ఇది ఎక్కువగా నేరస్తుడిని 'తమ వాడిగా' భావించే సమూహాలకే పరిమితమైనప్పటికీ ఒక్కో సందర్భంలో ఒక్కో సమూహానికి ఈ వాదన అవసరమవుతుంది కాబట్టి ఆ రకంగా అది విస్తృతమవుతూ పోతుంది.

ఇంకాస్త స్పష్టంగా చెప్పాలంటే తమ పార్టీ, సిద్ధాంతం, కులం, జాతి, దేశం వగైరా అస్తిత్వాలకు చెందినవారిని రక్షించుకోవడం కోసమే ఆయా వర్గాలవారు మొదట ఈ వాదనను ఆశ్రయించినా భవిష్యత్తులో మరణశిక్ష రద్దును ఒక విలువగా ఆమోదించడానికి అదే ప్రాతిపదిక కాగలదు.

హక్కుల కార్యకర్తలకు మనిషే 'తమ వాడు' కనుక మరణశిక్షలను వ్యతిరేకించడం మొదట్నించీ ఒక విలువగానే చూస్తూ, ప్రచారం చేస్తూ వచ్చారు. నేరస్తుడు ఎవరనే దానితో నిమిత్తం లేకుండా మరణశిక్షలు అనాగరికమైనవని, అవి చట్టంలో ఉండడానికి వీల్లేదని ప్రతి సందర్భంలోనూ చెపుతూ వస్తున్నారు. ప్రతి మరణశిక్ష విషయంలోనూ ఆయా ఘటనల నేపథ్యం, ఆయా కేసుల్లోని లొసుగులతో పాటు మరణశిక్ష అనాగరికతను కూడా పదే పదే ప్రజలకు వివరిస్తూనే ఉన్నారు. మరణశిక్ష రద్దు కోసం కరపత్రాలు పంచే వాళ్ల మొహం మీద ఉమ్మేసిన ఘటనలు కూడా మన రాష్ట్రంలో జరిగాయంటే ఇదెంత ఎదురీతో, దీనిపట్ల సమాజంలో ఎంత వ్యతిరేకత ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఇంత తీవ్రమైన వ్యతిరేకతను ఎదుర్కొంటూ కూడా 1994 నుండి 2008 వరకు; చలపతి, విజయవర్ధనరావుల నుండి అఫ్జల్ గురు, సరబ్‌జిత్ సింగ్‌ల వరకు; ఆయా ఘటనల విశ్లేషణ నుండి అంతర్జాతీయ ఆలోచనా ధోరణుల వరకు ఎన్నో అంశాలను తడుముతూ బాలగోపాల్‌గారు మరణశిక్షలపై రాసిన వ్యాసాల సంకలనం ఇది. ఈ 13 వ్యాసాలలో ఒక ఇంటర్వ్యూ, ఒక ముందుమాట, రెండు కరపత్రాలు కూడా ఉన్నాయి. ఇంగ్లీషులో రాసిన వ్యాసాలను వేరే పుస్తకంగా వేస్తున్నాం.

బాలగోపాల్‌గారు మరణశిక్ష అనుకూల వాదనలన్నిట్నీ ప్రస్తావించి ప్రతీదీ ఎలా తప్పో చాలా హేతుబద్ధంగా నిరూపించారు. దయతోనో జాలితోనో మాత్రమే దోషులను క్షమించమని, మానవతా దృష్టితో మాత్రమే ఉరిశిక్షను జీవితఖైదుగా మార్చమని అనలేదు ఆయన. నేరాలను అదుపు చేయడంలో మరణదండన నిరుపయోగతను చారిత్రకంగా, సామాజికంగా వివరించారు. చట్టమూ, న్యాయవ్యవస్థ కూడా తప్పు చేసే అవకాశం ఉందని ఎత్తి చూపారు. ఏ శిక్ష అయినా మనుషుల సంస్కరణకు అవకాశం కల్పించే విధంగా ఉండాలే తప్ప ప్రజాస్వామ్య దేశాల న్యాయవ్యవస్థలు ఆదిమ ప్రతీకార నీతికి పాల్పడకూడదని

అన్నారు. ప్రతి నేరానికీ ఒక కారణం ఉంటుందని, ఆ కారణం సమాజంలోనే ఉంటుందని, అందువలన తప్పంతా మనిషి మీదే పెట్టి సమాజం తప్పుకోవడానికి వీల్లేదని ఆయన గట్టిగా చెపుతారు.

ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం బాధ్యులుగా, ఆ తర్వాత మానవహక్కుల వేదిక బాధ్యులుగా ఆయన చేసిన ఈ రచనలు మరణశిక్ష రద్దు కోసం ప్రజాభిప్రాయాన్ని కూడగట్టడంలో చాలా ముఖ్యమైన పాత్రను పోషించాయి. ఏ క్షణంలో ఉరి తీస్తారో తెలియని స్థితిలో ఇవ్వాళ భారతదేశంలోని వివిధ జైళ్లలో కనీసం 20 మంది ఖైదీలు ఉన్నారనే విషయం గుర్తు చేసుకుంటే ఈ కృషి మరెంత విస్తృతంగా జరగాల్సిన అవసరం ఉందో అర్థమవుతుంది. మరణశిక్ష రద్దు కోసం పనిచేస్తున్న వాళ్లకే కాక నేరము - శిక్ష గురించి ఆలోచించేవాళ్లకు కూడా సైద్ధాంతికంగా ఎంతో ఉపయోగపడగల వ్యాసాలివి.

**మానవహక్కుల వేదిక**

8-4-2012

# ఇందులో ...


ఆదిమ ప్రతీకార నీతికి ఆఖరి అవశేషం . . . . . . . . . . . 17

చలపతి, విజయవర్ధనరావులను ఉరి తీయాల్సిందేనా? . . . . 23

రేప్‌కు మరణదండన అవసరమా? . . . . . . . . . . . . . 35

ఆ నలుగురికి మాత్రం ఎందుకు ఉరి? . . . . . . . . . . . 41

మరణశిక్ష రద్దుకై ఉద్యమిద్దాం . . . . . . . . . . . . . . 47

రాజీవ్‌గాంధీ హత్యకేసు ముద్దాయిల ఉరిశిక్షను . . . . . . . 53
ఖైదుగా మార్చమని ఉద్యమిద్దాం

రాజీవ్‌గాంధీ హత్యకేసు ముద్దాయిల . . . . . . . . . . . . 60
ప్రాణాలు కాపాడటానికి ఆఖరు ప్రయత్నం

డిసెంబర్ 13: దానికి ప్రతీకారం . . . . . . . . . . . . . 65

చిలకలూరిపేట: కాషాయ వ్యాఖ్యానం . . . . . . . . . . . 69

ఉరిశిక్ష: భారత్ జనజీవన స్రవంతిలోకి రావాలి . . . . . . . 74

ఉరిశిక్షలు ఇంకా విధించవలసిందేనా? . . . . . . . . . . . 78

ఎవరికి సంకేతాలు పంపడానికి అఫ్జల్‌ను ఉరితీయాలి? . . . 83

సరబ్‌జిత్: సూత్రబద్ధ వైఖరి . . . . . . . . . . . . . . 90

## ఈ వ్యాసాల్లో ప్రస్తావనకు వచ్చిన మరణశిక్ష కేసులకు సంబంధించిన తేదీలు, ప్రాథమిక వివరాలు

### 1. చిలకలూరిపేట బస్సుదహనం కేసు లేదా చలపతి, విజయవర్ధనరావుల మరణశిక్ష కేసు

8-3-1993: నిందితులు హైదరాబాద్ నుంచి చిలకలూరిపేట వెళుతున్న ఆర్టీసీ బస్సును చిలకలూరిపేట సమీపంలో దగ్ధంచేశారు. ఈ ఘటనలో 23 మంది ప్రయాణీకులు మరణించారు.

7-9-1995: గుంటూరులోని మూడవ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు వారిద్దరికీ మరణశిక్ష విధించింది.

2-11-1995: హైకోర్టు ఈ శిక్షను ఖరారు చేసింది.

28-8-1996: సుప్రీంకోర్టు కూడా ఖరారు చేసింది.

మార్చి 1997: రాష్ట్రపతి శంకర్ దయాళ్ శర్మ వారి క్షమాభిక్ష పిటిషన్లను తిరస్కరించడంతో అన్ని దారులూ మూసుకుపోయి 28-3-1997 నాడు వారిని ఉరి తీయాలని నిర్ణయమైంది. తనకు అందిన వారం లోపలే రాష్ట్రపతి ఈ నిర్ణయం తీసుకోవడం పలువురికి ఆశ్చర్యం కలిగించింది. ఉరిశిక్ష కేసుల్లో ఇంత త్వరగా నిర్ణయం తీసుకోవడం ఈ కేసులోనే జరిగింది.

28-3-1997: ఉరిశిక్ష అమలుకు నిర్ణయించబడిన తేదీ. అయితే ఢిల్లీలోని పి.యు.డి.ఆర్ కార్యకర్తలు చొరవ తీసుకుని ప్రముఖ రచయిత్రి మహాశ్వేతాదేవి చేత సంతకం చేయించి మరో క్షమాభిక్ష పిటిషన్‌ను రాష్ట్రపతికి అందజేయడంతో ఉరిశిక్ష అమలు ఆగిపోయింది. నెల్సన్ మండేలా చేతుల మీదుగా జ్ఞానపీఠ్ అవార్డు తీసుకోవడానికి ఆమె ఢిల్లీ వచ్చినపుడు సభలోనే ఆమె ఈ పిటిషన్‌పై సంతకం చేయడం, దాన్ని అక్కడికక్కడే ఆ సభకు అధ్యక్షత వహించిన రాష్ట్రపతి శంకర్ దయాళ్ శర్మకు అందజేయడం జరిగింది. ఈ పిటిషన్ ఆధారంగానే ప్రముఖ సుప్రీంకోర్టు లాయరు నిత్యా రామకృష్ణన్ సుప్రీంకోర్టు న్యాయమూర్తిని ఇంట్లో కలిసి తన వాదనలు వినిపించి మరణశిక్ష అమలుపై స్టే సంపాదించారు. చాలా నాటకీయంగా జరిగిన ఈ

పరిణామాల ఫలితంగా ఆఖరి క్షణంలో ఉరిశిక్ష అమలు ఆగిపోయింది.

మే 1998: హెచ్.డి. దేవెగౌడ ప్రధానిగా ఉన్నపుడు కేంద్ర మంత్రిమండలి ఈ ఉరిశిక్ష అమలును నిరవధికంగా వాయిదా వేయగా రాష్ట్రపతి కె.ఆర్. నారాయణన్ ఆ తర్వాత దాన్ని రద్దుచేసి జీవిత ఖైదుగా మార్చారు.

ఏప్రిల్ 2012: చలపతి, విజయవర్ధనరావులు ఈనాటికీ జైలులోనే ఉన్నారు. ఘటన జరిగిన కొద్ది రోజులకే అరెస్టయిన వీరు ఈ 19 సంవత్సరాల నుంచీ ఖైదీలుగానే ఉన్నారు. చలపతిరావు విశాఖ సెంట్రలు జైలులో, విజయవర్ధనరావు రాజమండ్రి సెంట్రలు జైలులో ఉన్నారు.

## 2. భూమయ్య, కిష్టాగౌడ్ ఉరిశిక్ష కేసు

1970 : భూమయ్య, కిష్టాగౌడ్‌ల గురించి ఎక్కువ వివరాలు తెలియవు కాని వారిద్దరూ తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్నారని, కిష్టాగౌడ్ గట్టుపల్లి మురళి దళంలో ఉండేవాడని, రెండేళ్లు జైల్లో కూడా ఉండి వచ్చాడని తెలుస్తున్నది. భూమయ్య సొంతూరు కరీంనగర్ జిల్లా పుట్నూరు. పేదలను దోచుకుంటున్నందుకు గాను ఆదిలాబాద్ జిల్లాలో ఇద్దరు భూస్వాములను వారు విడివిడిగా దాడి చేసి చంపేశారు.

పెర్కపల్లి మాజీ పోలీసు పటేల్ బోడేకంటి మల్లయ్యను గున్నాల కిష్టాగౌడ్ (42), గిన్నెదరికి చెందిన లచ్చు పటేల్‌ను కోనుగంటి భూమయ్య (45) హతమార్చారు. నిజానికి ఇవి జనం పెద్దఎత్తున వెళ్లి దాడి చేసిన సంఘటనలు.

జనవరి 1972: ఆదిలాబాద్ సెషన్స్ కోర్టు వీరిద్దరికీ మరణశిక్ష విధించింది. నక్సల్బరీ తిరుగుబాటు (1969) జరిగిన కొద్ది కాలానికే ఈ ఘటనలు జరగడంతో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా బుద్ధి చెప్పడానికే ఇంత తీవ్ర శిక్షలు విధించారనే అభిప్రాయం కలిగింది.

26-11-1974: ఉరిశిక్ష అమలుకు కోర్టు నిర్ణయించిన తేదీ. కాని ముందురోజే ఆ విషయం తెలిసి పౌరహక్కుల సంఘాలవారు, న్యాయవాదులు కలిసి ఉరిశిక్షను ఆపగలిగారు.

11-5-1975: 'భూమయ్య, కిష్టాగౌడ్ ఉరిశిక్ష రద్దు కమిటీ' ఏర్పడి వీరికి క్షమాభిక్ష సంపాదించడానికి చాలా కృషి చేసినప్పటికీ 11-5-1975 నాడు ఉరి తీయాలని నిర్ణయమైంది. ఈసారి ఢిల్లీలోని హక్కుల నేతలు కూడా గట్టిగా ప్రయత్నించడంతో రెండోసారి కూడా ఆపగలిగారు.

3-10-1975: 'డిఫెన్స్ కమిటీ' అపీలు పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. తీర్పు చెప్పిన న్యాయమూర్తులలో కృష్ణయ్యర్ కూడా ఉన్నారు.

1-12-1975: చివరికి ఎమర్జెన్సీ కాలంలో బయట ఎవరికీ తెలియనివ్వకుండా వారిద్దరినీ ముషీరాబాద్ జైలులో ఉరితీశారు. మహాత్మాగాంధిని చంపిన నాథూరామ్ గాడ్సే తర్వాత స్వతంత్ర భారతదేశంలో ఉరితీయబడ్డ మొదటి వ్యక్తులు వీళ్లే.

## 3. రాజీవ్‌గాంధి హత్య కేసు

21-5-1991: తమిళనాడులోని శ్రీపెరుంబుదూర్‌లో థాను అనే శ్రీలంక తమిళ తీవ్రవాది ఆత్మాహుతి దాడికి పాల్పడగా మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీతో సహా 18 మంది మరణించారు.

28-1-1998: చెన్నైలోని టాడా స్పెషల్ కోర్టు విచారణ జరిపి 41 మంది నిందితుల్లో 26 మందికి మరణశిక్ష విధించింది. మిగతా 15 మందిలో ముగ్గురు - ప్రభాకరన్, పొట్టు అమ్మన్, అఖిల పరారీలో ఉండగా (ఆ నాటికి) తతిమ్మా 12 మంది సైనైడ్ మింగి చనిపోయారు.

11-5-1999: ఈ తీర్పుపై ఆ 26 మంది సుప్రీంకోర్టుకు అపీలు చేసుకున్నారు. మురుగన్, శంతన్, పెరారివలన్ (అరివు), నళినిలకు మాత్రమే మరణశిక్ష ఉంచి, మరో ముగ్గురి మరణశిక్షను జీవితఖైదుగా మార్చి, మిగతా 19 మందిని నిర్దోషులుగా విడుదల చేశారు.

8-10-1999: మరణశిక్ష ఖైదీలు పెట్టుకున్న క్షమాభిక్ష పిటిషన్‌ను తమిళనాడు గవర్నరు తిరస్కరించారు.

25-11-1999: ఈ తిరస్కరణ ఉత్తర్వుపై రిట్ వేయగా మద్రాసు హైకోర్టు స్టే ఇచ్చింది.

19-4-2000: మురుగన్, నళినిలిద్దర్నీ ఉరితీస్తే వారి బిడ్డ అనాథ అవుతుందని తమిళనాడు రాష్ట్ర మంత్రివర్గం నళిని పట్ల కనికరం చూపి మరణశిక్షను రద్దు చేయాల్సిందిగా గవర్నరుకు సిఫార్సు చేసింది.

25-4-2000: గవర్నరు దానికి ఆమోదం తెలిపారు.

28-4-2000: మురుగన్, శంతన్, పెరారివలన్‌ల (అరివు) క్షమాభిక్ష పిటిషన్లను రాష్ట్ర ప్రభుత్వం కేంద్రప్రభుత్వానికి పంపింది.

11-8-2011: 11 ఏళ్ల తర్వాత వాటిని తిరస్కరిస్తున్నట్టు రాష్ట్రపతి ప్రకటించారు.

30-8-2011: సెప్టెంబర్ 9న ఉరి తీయనున్నట్లు అందిన సమాచారంపై వారు ముగ్గురూ పిటిషన్ వేసుకోగా మద్రాసు హైకోర్టు 8 వారాల పాటు స్టే ఇచ్చింది. 11 సంవత్సరాలకు పైగా జాప్యం జరిగినందువల్ల ఇప్పుడు మరణశిక్షను అమలు చేయడం అన్యాయం, అనైతికం అవుతుందని దోషుల తరపున వాదిస్తూ రామ్ జెత్మలానీ అన్నారు.

29-11-2011: ఈ ముగ్గురి మరణశిక్షను యావజ్జీవ ఖైదుగా మార్చవలసిందిగా స్వయంగా తమిళనాడు ప్రభుత్వమే రాష్ట్ర హైకోర్టును కోరింది. దీని మీద కోర్టు ఇంకా ఎటువంటి తీర్పూ చెప్పలేదు.

## 4. ఇందిరాగాంధి హత్య కేసు లేదా కేహార్ సింగ్ ఉరిశిక్ష కేసు

31-10-1984: ప్రధానమంత్రి ఇందిరాగాంధిని ఆమె సెక్యూరిటీలో పనిచేసే ఇద్దరు బాడీగార్డులు - సత్వంత్ సింగ్, బియాంత్ సింగ్‌లు కాల్చి చంపారు. ఘటన జరిగిన వెంటనే ఇతర బాడీగార్డులు బియాంత్ సింగ్‌ను కాల్చి చంపేశారు. సత్వంత్ సింగ్‌ను మాత్రం అరెస్టు చేసి జైలులో పెట్టారు.

కేహార్ సింగ్ బియాంత్ సింగ్‌కు మామ అవుతాడు. ఈ హత్యకు కుట్ర పన్నిన వారిలో అతను కూడా ఉన్నాడనే అనుమానంపై అరెస్టు చేసి విచారించారు.

22-1-1986: ఢిల్లీలోని అదనపు సెషన్స్ జడ్జి సత్వంత్ సింగ్‌తో పాటు కేహార్ సింగ్‌కు కూడా ఉరిశిక్ష విధించారు. కేహార్ సింగ్ దోషి అనడానికి ఎటువంటి ఆధారాలు లేవనే విమర్శలు వెల్లువెత్తినా కోర్టులు, ప్రభుత్వం తమ అభిప్రాయం మార్చుకోలేదు.

6-1-1989: తీహార్ జైలులో సత్వంత్‌ను, కేహార్‌ను ఉరి తీసి జైలు ఆవరణలోనే ఖననం చేశారు.

## 5. పార్లమెంటుపై దాడి కేసు

13-12-2001: గుర్తు తెలియని ఐదుగురు సాయుధులు పార్లమెంటుపై దాడి చేసి ఏడుగురు వ్యక్తుల్ని కాల్చి చంపారు. అయితే భద్రతా దళాలు జరిపిన ఎదురు కాల్పులలో ఆ ఐదుగురూ అక్కడికక్కడే మరణించారు.

16-12-2002: ఈ దాడికి కుట్ర పన్నారనే అభియోగంపై ఢిల్లీలోని పోటా స్పెషల్ కోర్టు ఎస్.ఎ.ఆర్. గిలానీ (ఢిల్లీ యూనివర్సిటీకి చెందిన జాకీర్ హుస్సేన్ కాలేజిలో అరబిక్ లెక్చరర్), షౌకత్ హుస్సేన్ గురు (ఢిల్లీ యూనివర్సిటీలో చదువుకున్న విద్యార్థి), మహ్మద్ అఫ్జల్ గురు (లొంగిపోయిన జె.కె.ఎల్.ఎఫ్. మిలిటెంట్) లకు మరణశిక్ష విధించింది. దాడి విషయం తెలిసీ దాచిపెట్టిన నేరంపై షౌకత్ హుస్సేన్ గురు భార్య అఫ్సాన్ గురుకి ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, పదివేల రూపాయల జరిమానా విధించింది.

29-10-2003: ఢిల్లీ హైకోర్టులో అపీలు వేయగా ఎస్.ఎ.ఆర్. గిలానీ, అఫ్సాన్ గురులను నిర్దోషులుగా ప్రకటించి, షౌకత్ హుస్సేన్ గురు, మహమ్మద్ అఫ్జల్ గురులకు మాత్రం మరణశిక్ష ఖరారు చేశారు.

4-8-2005: అపీలులో సుప్రీంకోర్టు షౌకత్ హుస్సేన్ గురు మరణశిక్షను పదేళ్ల కఠిన కారాగార శిక్షగా మార్చింది. మిగతా ముగ్గురి విషయంలో ఢిల్లీ హైకోర్టు నిర్ణయాన్నే ఖరారు చేసింది.

3-10-2006: మహమ్మద్ అఫ్జల్ గురును 20-10-2006న ఉరి తీయనున్నట్లు తెలిసి ఆయన కుటుంబం రాష్ట్రపతికి క్షమాభిక్ష పిటిషన్ పెట్టుకుంది. (అఫ్జల్ స్వయంగా పెట్టుకోవడానికి నిరాకరించాడు.)

ఏప్రిల్ 2012: ఈ పిటిషన్‌పై ఇప్పటివరకు ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. అఫ్జల్‌తో సహా వివిధ నేరాలలో నిందితులుగా ఉన్న మొత్తం 20 మంది నేరస్తుల క్షమాభిక్ష పిటిషన్‌లు తమవద్ద పెండింగ్‌లో ఉన్నాయని కేంద్రప్రభుత్వం 30-11-2011న ప్రకటించింది. వీటిలో బల్వంత్ సింగ్ రాజొనాను (పంజాబ్ ముఖ్యమంత్రి బియాంత్ సింగ్ హంతకులలో ఒకరు) 2-4-2012న ఉరి తీయాలని నిర్ణయించి కూడా పంజాబ్ ప్రజాగ్రహానికి తలొగ్గి కేంద్ర ప్రభుత్వం ఆ మరణశిక్ష అమలును వాయిదా వేసింది.

## 6. ధనుంజయ్ చటర్జీ కేసు

5-3-1990: కలకత్తాలోని భవానిపూర్‌లో ఒక అపార్టుమెంట్స్‌కు సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న ధనుంజయ్ చటర్జీ (25) షీతల్ పరేఖ్ అనే 14 ఏళ్ల బాలికను ఆమె సొంత అపార్టుమెంటులోనే రేప్ చేసి హత్య చేశాడు.

12-8-1991: కలకత్తా సెషన్స్ కోర్టు మరణశిక్ష విధించింది.

జనవరి 1992: కలకత్తా హైకోర్టు దానిని ఖరారు చేసింది.

12-8-2004: అతని క్షమాభిక్ష పిటిషన్‌ను రాష్ట్రపతి తిరస్కరించారు.

14-8-2004: ధనుంజయ్‌ను తన 39వ పుట్టినరోజునాడు ఉరి తీశారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఉరిశిక్ష కారణంగా ప్రాణాలు కోల్పోయిన 55వ వ్యక్తి అతను.

## 7. వీరప్పన్ అనుచరుల మరణశిక్ష కేసు

9-4-1993: తమిళనాడు-కర్ణాటక సరిహద్దులోని పాలార్ బ్రిడ్జి దగ్గర వీరప్పన్ అనుచరులు మందుపాతర పేల్చి 20 మంది పోలీసుల్ని, ఇద్దరు అటవీశాఖ సిబ్బందిని హతమార్చారు.

29-9-2001: ఈ కేసులో మొత్తం 123 మందిని అరెస్టు చేసి మైసూరులోని ప్రత్యేక టాడా కోర్టులో విచారణ జరిపి ఏడుగురికి యావజ్జీవ ఖైదు విధించారు. ఇంకో ఏడుగురికి స్వల్పకాలిక శిక్షలు విధించి మిగతా 109 మందిని నిర్దోషులుగా విడుదల చేశారు.

29-1-2004: అపీలులో సుప్రీంకోర్టు ఆ ఏడుగురి యావజ్జీవ ఖైదును మరణశిక్షగా మార్చింది. అలా జరగడం చాలా అరుదు. పైకెళ్లే కొద్దీ శిక్ష తగ్గడం చూశాం కాని పెరగడం ఈ కేసులోనే కనిపిస్తుంది. వారి పేర్లు - సైమన్, కాలియప్ప, జ్ఞానప్రకాశ్, బిల్వేంద్రన్, మిసెకర యాదయ్య, వీరస్వామి, శేఖర్.

12-4-2004: మరో నాలుగు రోజుల్లో అంటే 16వ తేదీన ఉరిశిక్ష అమలు చేయనున్నట్లు టాడా కోర్టు ప్రకటించింది. అయితే ఈలోగా వారు క్షమాభిక్ష పిటిషన్లు పెట్టుకోవడంతో, ఆ పిటిషన్లపై రాష్ట్రపతి ఇంకా ఎటువంటి నిర్ణయం తీసుకోకపోవడంతో ప్రస్తుతానికి ఆగిపోయాయి.

## 8. దారాసింగ్ కేసు లేదా గ్రహం స్టెయిన్స్ హత్య కేసు

22-1-1999: ఒరిస్సాలోని కియోంజార్ జిల్లా మనోహర్‌పూర్ గ్రామంలో వ్యానులో నిద్రిస్తున్న గ్రహం స్టెయిన్స్ అనే ఆస్ట్రేలియన్ క్రిస్టియన్ సంఘ సేవకుడ్ని, అతని కుమారులిద్దర్నీ - ఫిలిప్ (10 ఏళ్లు), తిమోతి (6 ఏళ్లు) - భజరంగ్‌దళ్‌కు చెందిన గుంపు ఒకటి పెట్రోలు పోసి తగలబెట్టింది.

22-6-1999: సిబిఐ దర్యాప్తు జరిపి చార్జిషీట్ దాఖలు చేసింది.

22-9-2003: సెషన్స్ కోర్టు 14 మంది నిందితుల్లో 13 మందికి వివిధ కాలపరిమితి గల జైలుశిక్షల్ని వేసి ఒక్క దారాసింగ్‌కు మాత్రం (అసలు పేరు రవీందర్ కుమార్ పాల్) మరణశిక్ష విధించింది.

మే 2005: ఒరిస్సా హైకోర్టు ఈ మరణశిక్షను కొట్టేసి యావజ్జీవ ఖైదుగా మార్చింది.

21-1-2011: సుప్రీంకోర్టు కూడా దానినే ఖరారు చేసింది. నిజానికి గ్లాడిస్ స్టెయిన్స్ (గ్రహం స్టెయిన్స్ సహచరి, ఫిలిప్, తిమోతీల తల్లి) హైకోర్టు కంటే, సుప్రీంకోర్టు కంటే ముందే దారాసింగ్‌కు క్షమాభిక్ష ప్రకటించింది.

## 9. సరబ్‌జిత్ సింగ్ కేసు

1990: పాకిస్తాన్‌లోని లాహోర్, ముల్తాన్, ఫైస్లాబాద్‌లలో 14 మంది మృతికి కారణమైన వరసబాంబు పేలుళ్ల కేసులో భారత పౌరుడైన సరబ్‌జిత్ సింగ్ ఒక నిందితుడు. అలాగే మరో ముగ్గురి మృతికి కారణమైన యక్కిగేట్ కేసులో కూడా సరబ్‌జిత్ ఒక నిందితుడు. అయితే తాను సరిహద్దు గ్రామానికి చెందిన ఒక పేదరైతునని, వేరే ఎవరిగానో పొరబడి తనను అరెస్టు చేశారని సరబ్‌జిత్ కోర్టుకు చెప్పాడు.

అక్టోబర్ 1991: లాహోర్‌లోని యాంటీ టెర్రరిజం కోర్టు అతనికి మరణశిక్ష విధించింది.

2003: లాహోర్ హైకోర్టు దానిని ధ్రువీకరించింది.

18-8-2005,: రెండు కేసుల్లోనూ పాకిస్తాన్ సుప్రీంకోర్టు అతని మరణశిక్షలను

17-9-2005 ధ్రువీకరించింది.

9-3-2006: ఒక కేసులో సరబ్‌జిత్ పెట్టుకున్న రివ్యూ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టేసింది.

మార్చి 2006: పాకిస్తాన్ అధ్యక్షుడు పర్వేజ్ ముషారఫ్‌కు క్షమాభిక్ష పిటిషన్ పెట్టుకున్నాడు.

5-3-2008: ముషారఫ్ క్షమాభిక్ష ను తిరస్కరించడంతో ఏప్రిల్ ఒకటిన ఉరిశిక్ష అమలు జరపాలని నిర్ణయించారు.

19-3-2008: ఇంతలో భారత ప్రభుత్వం స్పందించి క్షమాభిక్ష పెట్టమని కోరినందువల్ల ముషారఫ్ అతని ఉరిశిక్ష అమలును నెలరోజులపాటు వాయిదా వేశారు.

21-4-2008: పాకిస్తాన్ పౌరహక్కుల నాయకుడు అన్సార్ బర్నే సరబ్‌జిత్ తరపున మరో క్షమాభిక్ష పిటిషన్ దాఖలు చేశారు.

2-5-2008: తదుపరి ఉత్తర్వులు వెలువడేంత వరకు సరబ్‌జిత్ మరణశిక్ష అమలును వాయిదా వేస్తున్నట్లు పాకిస్తాన్ ప్రభుత్వం ప్రకటించింది.

20-6-2009: సరబ్‌జిత్ పెట్టుకున్న మరో రివ్యూ పిటిషన్‌ను కూడా కొట్టేస్తున్నట్లు సుప్రీంకోర్టు ప్రకటించింది.

22-7-2009: ఈ నిర్ణయాన్ని రివ్యూ చేయమని కోరుతూ ఇంకో పిటిషన్ దాఖలైంది. మరణశిక్ష అమలవుతుందో లేదో తెలియని స్థితిలో సరబ్‌జిత్ ఇంకా పాకిస్తాన్ జైల్లోనే ఉన్నాడు.

## 10. మక్బూల్ భట్ కేసు :

14-9-1966: మక్బూల్ భట్ జె.కె.ఎల్.ఎఫ్. వ్యవస్థాపకులలో ఒకరు. సెప్టెంబర్ 14న భారత భద్రతా దళాలపై కాల్పులు జరిపి సిఐడి క్రైంబ్రాంచి ఇన్‌స్పెక్టర్‌ను హత్య చేసిన కాశ్మీరీ మిలిటెంట్ల బృందంలో ఆయనా ఉన్నారు. అరెస్టు చేసి విచారణ జరిపి మరణశిక్ష విధించారు.

1968: శ్రీనగర్ జైల్లో ఉండగా భట్, మరో ఇద్దరు సొరంగం తవ్వి బయటపడి పాకిస్తాన్‌కు పారిపోయారు.

1971: ఎయిర్ ఇండియా విమానాన్ని లాహోర్‌కు హైజాక్ చేయించిన కుట్ర అంతా మక్బూల్ భట్‌దేనని భారత ప్రభుత్వం ప్రకటించింది. హైజాకర్లు కూడా భట్‌నే తమ నాయకుడుగా చెప్పుకున్నారు. అప్పుడు పాకిస్తాన్ భట్‌ను, మరికొంతమందిని అరెస్టు చేసి జైల్లో ఉంచి 1974లో విడుదల చేసింది.

1976: విడుదలైన రెండేళ్ల తర్వాత భట్ రహస్యంగా ఇండియాకు తిరిగొచ్చాడు కాని పోలీసులు పసిగట్టి అరెస్టు చేసి మళ్లీ జైలులో పెట్టారు.

అంతకుముందే విధించిన మరణశిక్షపై అతను రాష్ట్రపతికి క్షమాభిక్ష పిటిషన్ పెట్టుకున్నాడు.

11-2-1984: జె.కె.ఎల్.ఎఫ్ మిలిటెంట్లు 6-2-1984 నాడు ఇంగ్లండ్‌లోని బర్మింగ్‌హామ్‌లో రవీంద్ర మాత్రే అనే భారతీయ దౌత్యవేత్తను కిడ్నాప్ చేసి హత్య చేశారు. హత్యకు ముందు వారు చేసిన డిమాండ్లలో భట్ విడుదల ఒకటి. రవీంద్ర మాత్రే హత్య జరిగిన వెంటనే భారత ప్రభుత్వం అప్పటిదాకా పెండింగ్‌లో ఉన్న భట్ క్షమాభిక్ష పిటిషన్‌ను తిరస్కరించి 11-2-1984 నాడు ఢిల్లీలోని తీహార్ జైలులో ఉరి తీసింది.

# ఆదిమ ప్రతీకార నీతికి ఆఖరి అవశేషం

“చిలకలూరిపేట ఘటన చాలా ఘోరమైన నేరమే. కాని ఇక్కడ చర్చ నేరాల గురించి కాదు. శిక్షల గురించి. నేరాలు ఘోరంగా ఉన్నాయని శిక్షలు ఘోరంగా ఉండాలా? కాలు నరికిన వాడికి కాలు నరకడమే శిక్ష అని ఎవ్వరూ అనరు. జైలు శిక్షే దానికి తగిన శిక్ష అని ఒప్పుకుంటారు. కాని హత్యానేరం విషయంలో చంపిన మనిషికి చావే శిక్ష అంటారు. కంటికి కన్ను, పంటికి పన్ను అనే శిక్షా విధానం ఆదిమ ప్రతీకార నీతికి ఆఖరి అవశేషం.”

మరణశిక్ష రద్దు కోసం భారతదేశంలో చాలారోజుల నుంచి పౌరహక్కుల సంస్థలు ఉద్యమాలు చేస్తూనే ఉన్నాయి. మరణశిక్ష విధించడం సమస్యలకు పరిష్కారం కాదని వారు వాదిస్తున్నారు. ఇటీవల రాష్ట్రంలో సంచలనం సృష్టించిన చిలకలూరిపేట బస్సు దగ్ధం కేసులో నిందితులకు గుంటూరు జిల్లా కోర్టు ఉరిశిక్ష విధించగా, హైకోర్టు దానిని ధృవీకరించింది. అయితే ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం ఈ తీర్పును సుప్రీంకోర్టులో సవాలు చేసి 'స్టే' తెచ్చింది. ఈ సంఘటన నేపథ్యంలో ఆ సంస్థ రాష్ట్ర వ్యాప్తంగా మరణదండనకు వ్యతిరేకంగా ప్రజాభిప్రాయాన్ని కూడగట్టేందుకు రంగంలోకి దిగింది. చిలకలూరిపేట కేసులో నిందితులకు ఉరిశిక్ష విధించడం సరైందేనని ప్రజలు భావిస్తున్నప్పటికీ, అది అప్రజాస్వామికమైన అభిప్రాయమని పౌరహక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె. బాలగోపాల్ అన్నారు. "కంటికి కన్ను, పంటికి పన్ను, హత్యకు మరో హత్య అనేది ఆదిమ ప్రతీకార నీతికి ఆఖరి అవశేషం" అని 'వార్త'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో అన్నారు. ఇటీవల ఆయన గుంటూరు వచ్చిన సందర్భంగా 'ప్రభాతవార్త' చేసిన ఇంటర్వ్యూ ఈ విధంగా సాగింది.

ప్రశ్న : 23 మంది అమాయక పౌరులను సజీవ దహనం చేసిన కేసులో నేరస్తులకు ఉరిశిక్షను విధించరాదని మీరెలా అనగలరు?

జ: ఎవ్వరినీ ఏ నేరానికీ ఉరి తీయకూడదని మేము అంటున్నాం. ఇది ఒక కేసుకు, ఒక ముద్దాయికి సంబంధించిన విషయం కాదు. శిక్షాస్మృతిలో ఉరిశిక్ష అనేదే ఉండకూడదని పౌరహక్కుల ఉద్యమం అభిప్రాయం. ఉరిశిక్షలను సంపూర్ణంగా రద్దు చేయడం గురించి ప్రపంచ వ్యాప్తంగా చాలా చర్చ జరిగింది. చాలా దేశాలు ఉరిశిక్షను పూర్తిగా రద్దు చేశాయి. మరికొన్ని దేశాలు కేవలం యుద్ధ సమయంలో జరిగే నేరాలకు తప్ప సాధారణ సమయంలో జరిగే హత్యలకు, ఇతర నేరాలకు ఉరిశిక్షను రద్దు చేశాయి. ఇక్కడ సమస్య ఘోరమైన నేరాలు జరుగుతున్నాయా లేదా అనేది కాదు. సమాజంలో చాలా ఘోరమైన నేరాలు జరుగుతున్న మాట నిజమే. చిలకలూరిపేట ఘటన చాలా ఘోరమైన నేరమే. కాని ఇక్కడ చర్చ నేరాల గురించి కాదు. శిక్షల గురించి. నేరాలు ఘోరంగా ఉన్నాయని శిక్షలు ఘోరంగా ఉండాలా? కాలు నరికిన వాడికి కాలు నరకడమే శిక్ష అని ఎవ్వరూ అనరు. జైలు శిక్షే దానికి తగిన శిక్ష అని ఒప్పుకుంటారు. కాని హత్యానేరం విషయంలో చంపిన మనిషికి చావే శిక్ష అంటారు. కంటికి కన్ను, పంటికి పన్ను అనే శిక్షా విధానం ఆదిమ ప్రతీకార నీతికి ఆఖరి అవశేషం.

ప్రశ్న : వారిద్దరి ఉరిశిక్షకు ప్రజామోదం ఉంది కదా! దాన్ని వ్యతిరేకించడమంటే మీ సంస్థ ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా పనిచేస్తున్నట్టు కాదా?

జ: ప్రజామోదం ఉన్న అన్ని విషయాలను అంగీకరించడం ప్రజాస్వామ్య దృక్పథం కాదు. ప్రజాస్వామ్య విలువలు, ప్రమాణాలు ప్రజాస్వామిక దృక్పథానికి ప్రాతిపదిక. ప్రజాభిప్రాయం అప్రజాస్వామికంగా ఉంటే ప్రజాభిప్రాయాన్ని మార్చడానికి ప్రయత్నం చేయడం పౌరహక్కుల ఉద్యమం కర్తవ్యం అవుతుంది. ఒక హత్యకు హంతకుడిని మాత్రమే పూర్తిగా బాధ్యుడ్ని చేసి పరిహారం మొత్తం అతనే చెల్లించాలని భావించడం ప్రజాభిప్రాయంలోని తప్పుడు ధోరణులలో ఒకటి. చిలకలూరిపేట కేసులో బాధ్యత కేవలం విజయవర్ధనరావు, చలపతిరావులదేనా? నేరానికి సామాజిక వ్యవస్థ బాధ్యత ఎంత, నేరస్తుడి బాధ్యత ఎంత అనేది చూడాలి. వ్యక్తి బాధ్యత ఉన్న మేరకు వ్యక్తికి శిక్ష, సమాజం బాధ్యత ఉన్న మేరకు సమాజానికి శిక్ష వేసే చట్టాలుంటే బాగుండేది. ఉదాహరణకు నేరానికి పాల్పడినందుకు చలపతిరావు, విజయవర్ధనరావులకు శిక్ష వేసినట్టే వాళ్ల పేదరికానికి, నిస్పృహకు కారణమైన సామాజిక ఆర్థిక వ్యవస్థకు శిక్ష ఎందుకు వేయకూడదు? వాళ్ళు జైలులో ఉన్నంత కాలం వాళ్ల కుటుంబాలను ప్రభుత్వం ప్రజాధనంతోనే పోషించాలన్న చట్టం ఎందుకు ఉండకూడదు? వాళ్లిద్దరికీ జైలు శిక్ష వేయడాన్ని పౌరహక్కుల సంఘం వ్యతిరేకించడం లేదు. కాని తప్పంతా వాళ్లమీదే పెట్టి ఉరిశిక్ష వేయడాన్ని వ్యతిరేకిస్తున్నాం. ప్రజలు కూడా ఈ విషయాన్ని గురించి ఆవేశాలు పక్కకు పెట్టి ఆలోచిస్తారని ఆశిస్తాం.

ప్రశ్న: మరణశిక్షను ఒక శిక్షా పద్ధతిగా వ్యతిరేకించడానికి కారణాలేమిటి?

జ: మరణశిక్షను వ్యతిరేకించడానికి కారణమేమిటి అనే ప్రశ్న వేసుకునే ముందు మరణశిక్షను సమర్థించడానికి కారణమేమిటో చూడాలి. ఈ విషయాన్ని గురించి న్యాయశాస్త్రంలో చాలా వివరమైన చర్చ జరిగింది. నేను ఒకరి ప్రాణం తీస్తే ఆ తర్వాత నా ప్రాణం కూడా పోతుందన్న భయం మనుషులలో ఉంటే తప్ప హత్యా నేరాలు ఆగవనేది ముఖ్యమైన వాదన. ఇది పైకి సహేతుకంగానే కనిపిస్తుంది. కాని ఇది నిజంగా సహేతుకమైన వాదనేనా? ప్రపంచంలో చాలా దేశాలు మరణదండనను పూర్తిగా రద్దు చేశాయి. మరి ఆ దేశాలలో మరణ దండనను రద్దు చేసిన తరువాత హత్యా నేరాల సంఖ్య పెరిగిందా? ఈ విషయంలో ఎన్నో పరిశోధనలు జరిగాయి. రద్దుకు ముందు, తరువాత హత్యా

నేరాల ఉద్ధృతిలో తేడా ఏమీ లేదని పలు పరిశోధనలు తేల్చాయి. చాలామంది భయపడుతున్నట్లు మరణదండనను నిషేధించిన దేశాల సమాజాలు అతలాకుతలం అయిపోలేదు. అభద్రతతో విలవిలలాడడం లేదు. ఉరిశిక్షను మేము వ్యతిరేకించడానికి మరొక ముఖ్యమైన కారణం ఉంది. న్యాయమూర్తులు, కోర్టులు తప్పులకు అతీతమేమీ కాదు. తప్పుడు సాక్ష్యాలతో కేసులు రుజువు చేసే ప్రయత్నం మన పోలీసు వ్యవస్థకు కొత్త కాదు. పొరపాటుగా ఒక వ్యక్తికి శిక్షవేసే ప్రమాదం ఉన్నపుడు ఆ పొరపాటును గ్రహించిన తరువాత శిక్షని వెనక్కు తీసుకునే అవకాశం ఉండాలి. కాని ఉరితీసిన ప్రాణాన్ని వెనక్కి తీసుకు రావడం సాధ్యం కాదు.

ప్రశ్న: అన్యాయానికి తగిన పరిహారం చెల్లించకపోతే సమాజం నైతిక ఆవేదన చల్లారుతుందా?

జ: తప్పు చేసిన వాళ్లు సులభంగా తప్పించుకుంటే సమాజం నైతికంగా నిస్పృహకు లోనవుతుందనేది కదా మీ ప్రశ్న. కంటికి కన్ను తీస్తే తప్ప చల్లారని ఆవేశం అసలు నైతికమే కాదు. ఇది నిజానికి ఆదిమ ప్రతీకార సిద్ధాంతానికి కొత్త రూపం మాత్రమే. తప్పుచేసిన వ్యక్తిని సంస్కరించి సమాజానికి ఉపయోగపడే వ్యక్తిగా తయారుచేసి బయటకు పంపే శిక్షాస్మృతే నిజంగా నైతికమైంది.

ప్రశ్న: ఇలాంటి నేరస్తులను వదిలేస్తే భవిష్యత్‌లో అలాంటి నేరాలు పెరిగే అవకాశం ఉంటుంది కదా?

జ: నేరాలు జరగడానికి, జరగకపోవడానికి అనేక కారణాలుంటాయి. మనిషి మానసిక స్థితి నుంచి ఆర్థిక, సామాజిక ఒత్తిడుల దాకా అనేక కారణాలుంటాయి. వాటినన్నిటినీ పక్కన బెట్టి శిక్ష క్రూరత్వాన్ని బట్టి నేరాల పరిమాణం ఉంటుందని వాదించడం అశాస్త్రీయమైన వాదన. ఒకరికి శిక్ష వేస్తే మరొకరు భయపడతారనే వాదన నిర్హేతుకమే గాక అవాస్తవికం కూడానని పరిశోధనలు తెలిపాయి. 1948 సంవత్సరంలో బ్రిటన్ రాయల్ కమిషన్ ఉరిశిక్ష పడిన 168 మందిని ప్రశ్నించగా వారిలో 164 మంది గతంలో ఒక బహిరంగ ఉరిని కళ్లారా చూసిన వారేనని తేలింది. అయినప్పటికీ వాళ్లు మళ్లీ మరణదండనకు గురయ్యే నేరమే చేశారు.

ప్రశ్న: చిలకలూరిపేట కేసు ముద్దాయిలు సాధారణ నేరస్తులు కదా! ఉద్యమకారులు గాని నక్సలైట్లు గాని కాదు. మరి మీ సంస్థ ఇంత ఆసక్తి చూపడానికి కారణమేమిటి?

జ: ఉద్యమకారుల హక్కులకు, నక్సలైట్ల హక్కులకు ఎక్కువ ప్రాముఖ్యం ఇవ్వాలనేది పౌరహక్కుల ఉద్యమం అభిప్రాయం కాదు. అది మా గురించి ప్రచారంలో ఉన్న దురభిప్రాయం మాత్రమే. మేము ఒక విషయంలో ఇమిడి ఉన్న విలువలను బట్టి స్పందిస్తాము తప్ప దానివల్ల ఎవరికి ప్రయోజనం కలుగుతుందనే దాన్ని బట్టి కాదు.

ప్రశ్న: భూమయ్య, కిష్టాగౌడ్‌ల ఉరిశిక్ష విషయంలో ప్రజల నుంచి పెద్దఎత్తున నిరసన వచ్చింది. కాని చిలకలూరిపేట నేరస్తులకు కనీసం సానుభూతి కూడా రావడం లేదు. ఎందుకని?

జ: ప్రజల స్పందన అనేది సంఘటన స్వభావాన్ని బట్టి ఉంటుంది. ఆ రెండు సంఘటనలు ఒకే రకమైనవి కావు. పైగా భూమయ్య, కిష్టాగౌడ్‌ల విషయంలో ప్రజాందోళన నిర్మించడానికి వారికి అండగా ఒక బలమైన రాజకీయ ఉద్యమం ఉండింది. విజయవర్ధనరావు, చలపతిరావులకు అటువంటి అండ లేదు. అయినప్పటికీ ప్రజాభిప్రాయం కూడగట్టడానికి మా వంతుగా మేము ప్రయత్నం చేస్తున్నాం.

ప్రశ్న: మరణశిక్షను ఏ సోషలిస్టు దేశాలైనా రద్దు చేశాయా?

జ: ఒక్క తూర్పు జర్మనీ మాత్రమే ఆఖరి రోజులలో రద్దు చేసినట్టుంది. వేరే ఏ సోషలిస్టు దేశమూ చేయలేదు. చైనాలో హత్యా నేరానికే కాక ఇతర నేరాలకు కూడా మరణదండన విధిస్తున్నారు. ఆధునిక కాలంలో హత్యా నేరానికే కాక ఇతర నేరాలకు కూడా మరణదండన విధిస్తున్న కొద్ది దేశాలలో చైనా ఒకటి. సోషలిస్టు దేశాలలో కూడా మరణదండన రద్దు చేయాలని మేము కోరుతున్నాం.

ప్రశ్న: నక్సలైట్లు కూడా ప్రజాకంటకులు, పోలీసు ఇన్‌ఫార్మర్ల పేరుతో కొందరిని చంపుతున్నారు కదా, దీన్ని మీరెందుకు వ్యతిరేకించరు?

జ: నక్సలైట్ ఉద్యమాన్ని మేమొక రాజకీయ ఉద్యమంగా భావిస్తున్నాం. పీడిత ప్రజల సమస్యల నుంచి పుట్టిన రాజకీయ ఉద్యమంగా గుర్తిస్తున్నాం. దాని అర్థం వాళ్లు చేసే అన్ని చర్యలు సమర్థనీయమని కాదు. వాళ్లు విచ్చలవిడిగా, విచక్షణా రహితంగా, అప్రజాస్వామికంగా ప్రవర్తిస్తే పౌరహక్కుల ఉద్యమం విమర్శిస్తుంది, వ్యతిరేకిస్తుంది. అయితే వారి చర్యలను రాజ్యం చర్యలతో సమానంగా చూడము. వారు ఒక వ్యక్తిని బందీగా తీసుకుని చంపడం, కోర్టు ఒక ముద్దాయికి మరణదండన విధించడం ఒకే కోవకు చెందిన ఘటనలు కావు.

నక్సలైట్లు బందీలుగా తీసుకున్న వ్యక్తులపైన విచారణ జరిపే పద్ధతుల గురించి, విధించే శిక్షల గురించి చర్చ జరగవలసిన అవసరం ఉంది. అయితే అధికార శిక్షాస్మృతిని చర్చించే ప్రాతిపదికపైననే దానిని గురించి కూడా చర్చించడం ఉచితం కాదు. దానికి సంబంధించిన ప్రాతిపదిక (విడిగా) రూపొందించుకోవాలి. ఆ పని పౌరహక్కుల ఉద్యమం చేయవలసి ఉంది. ఇప్పటికింకా చేయలేదు.

ప్రశ్న: చుండూరు మారణకాండకు బాధ్యులైన అగ్రకుల నేరస్తులకు కోర్టు ఉరిశిక్ష విధిస్తే మీరు దాన్ని కూడా వ్యతిరేకిస్తారా?

జ: కచ్చితంగా వ్యతిరేకిస్తాం. మేము సూత్రరీత్యానే ఉరిశిక్షకు వ్యతిరేకులం. ఒక విషయంలో మినహాయింపు ఇస్తే, రాజ్యానికి చట్టబద్ధంగా మనుషులను చంపే అధికారం కట్టబెట్టడం అవుతుంది. అది దళితులకు, పేదలకే మంచిది కాదు.

ప్రశ్న: మరణశిక్షను రద్దు చేసిన దేశాలెన్ని? అక్కడ ఫలితాలెలా ఉన్నాయి?

జ: 1989 గణాంకాల ప్రకారం ప్రపంచంలో 35 దేశాలు మరణదండనను పూర్తిగా రద్దు చేశాయి. మరొక 18 దేశాలు యుద్ధనేరాలవంటి వాటికి తప్ప మామూలు నేరాలకు (హత్యా నేరాలతో సహా) ఉరిశిక్షను రద్దు చేశాయి. మరొక 27 దేశాలు చట్టంలో రద్దు చేయకపోయినా ఆచరణలో ఉరిశిక్షను విధించడం మానేశాయి.

పూర్తిగా రద్దు చేసిన దేశాలలో ఆస్ట్రేలియా, ఫ్రాన్స్, జర్మనీ, డెన్మార్క్, పోర్చుగల్, స్వీడన్, నెదర్లాండ్స్, ఐస్‌లాండ్, ఫిలిప్పీన్స్, ఫిన్లాండ్ మొదలైనవి ఉన్నాయి. ఈ దేశాల అనుభవంలో మరణదండన రద్దు చేసిన తరువాత హత్యానేరాలేం పెరగలేదు. సామాజిక జీవితం ఛిన్నాభిన్నం అయిపోలేదు. ఉదాహరణకు కెనడాలో 1976లో ఉరిశిక్షను రద్దుచేశారు. అంతకుముందు ఏడాది లక్ష మంది జనంలో 3.09 శాతం మంది హతులైతే 1983లో అంటే ఉరిశిక్ష రద్దయిన ఎనిమిదేళ్ల తరువాత ఆ రేటు 2.74గా ఉంది. 1984లో అంతకన్నా తక్కువ సంఖ్యలో హత్యలు జరిగాయి.

"లెట్ అజ్ స్టాండ్ ఫర్ లైఫ్, నాట్ ఫర్ డెత్" అంటూ ముగించారు డాక్టర్ బాలగోపాల్.

**అమర్తలూరి రత్నప్రసాద్,**

**వార్త దినపత్రిక, 4 మార్చి 1996**

# చలపతి, విజయవర్ధనరావులను ఉరి తీయాల్సిందేనా?

"ఈ 17 సంవత్సరాలలో మన రాష్ట్రంలో దాదాపు 40 వేల హత్యలు జరిగాయి. అందులో క్రూరంగా, పకడ్బందీగా, వ్యూహాత్మకంగా చేసిన హత్యలు ఎన్నో ఉన్నాయి. వాటిలో ఏ ఒక్కదానికీ ఎవరినీ ఉరితీయలేదు. చాలామందికసలు ఏ శిక్షా పడలేదు. ఈ హంతకులందరినీ ఉరితీయవలసిందేనని రాష్ట్రంలో ఎప్పుడూ ఎవరూ ఆందోళన చేయలేదు. పెద్దగా ఆవేశపడలేదు. పత్రికలకు ఘాటైన ఉత్తరాలు రాయలేదు. కానీ ఉరిశిక్ష పడిన చలపతిరావు, విజయవర్ధనరావులను ఉరి తీయకపోతే మాత్రం ఈ రాష్ట్రానికింక మనశ్శాంతి ఉండదేమో అనిపించేంతగా అందరూ ఆవేశపడుతున్నారు. ఇది ఎంతవరకు సహేతుకం అనేది అందరూ కొంచెం ఆలోచిస్తే బాగుంటుంది."

చిలకలూరిపేట బస్సు దహనం కేసులో ఉరిశిక్ష పడిన సాతులూరి చలపతిరావును, గంటెల విజయవర్ధనరావును మరణదండన నుండి తప్పించమని కోర్టులను, ప్రభుత్వాన్ని పౌరహక్కుల సంఘం ఎందుకు కోరుతూ ఉందో వివరించమని చాలామంది అడుగుతున్నారు. ఉద్దేశ్యపూర్వకంగా బస్సుకు నిప్పుపెట్టి 23 మంది అభం శుభం ఎరుగని ప్రయాణీకులను చంపిన హంతకులకు ఉరి తప్పించడానికి ప్రయత్నించడం ఒక పౌరహక్కుల సంఘం చేయవలసిన పనేనా? చేయడానికి ఇంతకంటే మంచి పనులేవీ లేవా? చంపినప్పుడు వాళ్ళకు లేని దయ వాళ్ళపైన మనకెందుకుండాలి? చంపినవాళ్ళ జీవించే హక్కు గురించి మాట్లాడే వాళ్ళు చచ్చిన వాళ్ళ జీవించే హక్కు గురించి ఏమంటారు? చంపిన వాళ్ళు పేద నిరుద్యోగ దళిత యువకులు కాబట్టి సానుభూతి చూపించాలంటున్నారే, మరి చచ్చిన 23 మందీ బలిసిన కులాలకూ, వర్గాలకూ చెందినవారేనా? వాళ్ళ గురించి పౌరహక్కుల సంఘానికి బాధ లేదెందుకు?

ఈ ప్రశ్నలు, ఇటువంటి ప్రశ్నలు, గడిచిన మూడు నెలలుగా పౌరహక్కుల సంఘాన్ని రాష్ట్రమంతటా వెంటాడుతున్నాయి. ఇవి పూర్తిగా అహేతుకమైన ప్రశ్నలు కావు. వీటికి హేతుబద్ధంగా సమాధానం చెప్పవలసిందే. మన ఆత్మ సంతృప్తికి మనం ఏవో జవాబులు చెప్పుకొని, ఒప్పుకోని వారికి తెలివి లేదనో మనసు లేదనో సర్దిచెప్పుకుంటే సరిపోదు. చెప్పే జవాబు ప్రశ్నించే వాళ్ళ ఆలోచనలను తాకగలిగింది కావాలి. ఆలోచనలు మారాలంటే సంభాషణ జరగాలి. ఏక పక్షమైన సిద్ధాంత వివరణ కాదు.

ఈ ప్రశ్నలకు హేతుబద్ధమైన జవాబులు వెతికే ప్రయత్నం చేస్తాము. అయితే వీరిద్దరి ఉరిశిక్ష విషయంలో మన రాష్ట్రంలో వ్యక్తమవుతున్న ఆవేశంలో ఉన్న ఒక అహేతుకమైన అంశాన్ని మాత్రం ముందు ప్రస్తావించాలి. గడిచిన 17 సంవత్సరాలుగా మన రాష్ట్రంలో ఎవ్వరికీ మరణదండన అమలు చేయలేదు. ఎంత ఘోరమైన హత్యలు చేసిన వారికైనా యావజ్జీవ కారాగార శిక్ష మాత్రమే వేస్తున్నారు. క్రింది కోర్టు ఒకవేళ మరణదండన విధించినా పై కోర్టులు దానిని సడలిస్తున్నాయి. ఈ 17 సంవత్సరాలలో మన రాష్ట్రంలో దాదాపు 40 వేల హత్యలు జరిగాయి. అందులో క్రూరంగా, పకడ్బందీగా, వ్యూహాత్మకంగా చేసిన హత్యలు ఎన్నో ఉన్నాయి. వాటిలో ఏ ఒక్కదానికీ ఎవరినీ ఉరితీయలేదు. చాలామందికసలు ఏ శిక్షా పడలేదు. ఈ హంతకులందరినీ ఉరితీయవలసిందేనని

రాష్ట్రంలో ఎప్పుడూ ఎవరూ ఆందోళన చేయలేదు. పెద్దగా ఆవేశపడలేదు. పత్రికలకు ఘాటైన ఉత్తరాలు రాయలేదు. కానీ ఉరిశిక్ష పడిన చలపతిరావు, విజయవర్ధనరావులను ఉరి తీయకపోతే మాత్రం ఈ రాష్ట్రానికింక మనశ్శాంతి ఉండదేమో అనిపించేంతగా అందరూ ఆవేశపడుతున్నారు. ఇది ఎంతవరకు సహేతుకం అనేది అందరూ కొంచెం ఆలోచిస్తే బాగుంటుంది.

ఆ ఇద్దరినీ ఉరితీయవలసిందేననే వాళ్ళు వేస్తున్న ప్రశ్నలకు సమాధానం చాలా కోణాలనుండి చెప్పవచ్చును. ఈ కేసులకు సంబంధించిన వాస్తవాలను బట్టి వారిద్దరికీ 'క్షమాభిక్ష' కోరడం సబబని వాదించవచ్చును. ఉరిశిక్షను గురించి భారత సుప్రీంకోర్టు ప్రవచించిన ప్రామాణిక సూత్రాలను ఆధారం చేసుకొని వాదించవచ్చును. నేరం – శిక్ష అనే విషయాల గురించి న్యాయశాస్త్రంలోనూ సామాజిక శాస్త్రాలలోనూ చాలాకాలంగా జరుగుతున్న చర్చను ప్రాతిపదిక చేసుకొని వాదించవచ్చును. నేరానికీ శిక్షకూ ఉండే సాంఘిక ఆర్థిక నేపథ్యాన్నీ స్వభావాన్నీ ప్రామాణికంగా తీసుకొని వాదించవచ్చును. వాటన్నిటిలోనూ మళ్ళీ ఉపకోణాలు కూడా ఉంటాయి.

పై వాటిలో ఏ కోణాన్ని ప్రమాణం చేసుకుని చూసినా చలపతిరావు, విజయవర్ధనరావులను ఉరితీయకుండా కారాగార శిక్షతో సరిపెట్టుకోవడం సబబని సహేతుకంగానే వాదించవచ్చును. పూర్తి వివరాలలోకి పోకుండా క్లుప్తంగా ఒక్కొక్క కోణం నుండి విషయాన్ని వివరిస్తాము.

1. చిలకలూరిపేట బస్సు దహనం కేసుకు సంబంధించిన ఒక ముఖ్య వాస్తవం ఏమిటంటే చలపతిరావు, విజయవర్ధనరావులు నేరచరిత్ర కలిగిన వ్యక్తులు కారు. వాళ్ళు గతంలో ఎప్పుడూ ఏ నేరమూ చేయలేదు. వాళ్ళ జీవితం నేర ప్రపంచానికి చాలా దూరం. ఇద్దరూ కాయకష్టం చేసుకుని బ్రతికిన పట్టణ ప్రాంత దళితులు. పట్టణ ప్రాంత అసంఘటిత కార్మికరంగం నిత్యం ఎదుర్కొనే దుర్భర పరిస్థితులు వాళ్ళను క్రుంగదీసాయి. సరళమైన వచనశైలిలో చలపతిరావు చెప్పుకున్న తన కథలోనే అతని బాధలు తెలుసుకునే అవకాశం తెలుగు పాఠకులకు ఉంది. అతనిని ఉరితీసినా తీయకపోయినా దానిని ఏదో ఒక పత్రిక ప్రచురిస్తుందని ఆశిస్తాము.

   కాబట్టి వీళ్ళిద్దరి నుండి సమాజాన్ని (ప్రైవేట్ ఆస్తినే కానివ్వండి) కాపాడవలసిన అవసరం ఏమీ లేదు. వాళ్ళు నేరాలు చేసి తలపండిన వాళ్ళయితే – వాళ్ళను వదిలిపెడితే మళ్ళీ దోపిడీలు చేస్తారని

భయపడవచ్చు. కానీ ఈ ఇద్దరి విషయంలో ఆ భయం అనవసరం. గౌరవప్రదమైన శ్రమతో బ్రతుకు గడిచేటట్టయితే వాళ్ళు మళ్ళీ నేరాన్ని గురించి ఆలోచించరు. నేరస్తులందరి గురించి ఈ మాటలు అనలేకపోవచ్చు. కానీ ఈ ఇద్దరి గురించి కచ్చితంగా అనగలము. అటువంటప్పుడు వాళ్ళను హతమార్చి 'పీడ' విరగడ చేసుకోవాల్సిన అవసరం సమాజానికి ఏముంది? వాళ్ళు బ్రతికి ఉంటే జైల్లోనయినా బయటయినా శ్రమచేసి సమాజాన్ని సంపన్నం చేస్తారు కదా?

2. ఈ కేసుకు సంబంధించిన మరొక ముఖ్యమైన వాస్తవం ఏమిటంటే వాళ్ళు బస్సును కావాలని తగులబెట్టలేదు. ప్రయాణీకులను చంపాలనీ చంపలేదు. బస్సులో పెట్రోల్ పోసి బెదిరించి దోచుకుందామని మాత్రమే వాళ్ళు అనుకున్నారు. కానీ (వాళ్ళ అనుభవరాహిత్యం వల్ల) తాము ఊహించిన దానికంటే భిన్నంగా బస్సు సిబ్బంది, ప్రయాణీకులు స్పందించేసరికి వాళ్ళు తత్తరపడ్డారు. ప్రయాణీకులు ఎంత గాభరా పడ్డారో వీళ్ళు కూడా అంత గాభరా పడ్డారు. అందరూ ఒకేసారి బస్సునుండి బయటపడాలని ప్రయత్నించారు. ఎట్లా అంటుకుందో గానీ ఈ గొడవలో పెట్రోల్ అంటుకుని బస్సు దహనం అయింది.

   రద్దీగా ఉండే బస్సులో పెట్రోల్ పోసి దొంగతనం చేయాలన్న ఆలోచనే బాధ్యతారహితమైనది. (దానికి వారిని పురిగొల్పిన పరిస్థితులేమయినప్పటికీ, వాటికి ఆ బస్సులోని ప్రయాణీకులు బాధ్యులు కారు) ఆ బాధ్యతారాహిత్యం పర్యవసానమే బస్సు దహనం. దానికి చలపతిరావు, విజయవర్ధనరావులు శిక్ష అనుభవించక తప్పదు. కానీ ఎంత శిక్ష ఉచితంగా ఉంటుంది? వాళ్ళను ఉరి తీయడమే ఉచితమైన శిక్షా? ముందుగా ఉద్దేశపూర్వకంగా పథకం వేసుకుని, నిపుణులయిన హంతకులను కిరాయికి తీసుకొని, ప్లాన్ వేసి మాటుగాసి చంపిన ఎన్నో కేసులలో రకరకాల కారణాలవల్ల హంతకులు ఉరి తప్పించుకుంటున్నారు. అటువంటప్పుడు, తాము ఉద్దేశించని ఘటనల వల్ల – వాటికి మూలం తమ బాధ్యతారహితమైన ప్రయత్నమే అయినప్పటికీ – మనుష్యుల చావుకు కారకులయిన వారిని ఉరి తీయాల్సిందేననడం సబబా?

3. మరణదండన భారత రాజ్యాంగం ప్రకారం చెల్లుతుందా చెల్లదా అనే విషయంపై సుప్రీంకోర్టులో చాలాసార్లు వాదోపవాదాలు జరిగాయి. ఇప్పటికీ

ఈ చర్చ అయిపోలేదు. ప్రస్తుతం అమలులో ఉన్న సుప్రీంకోర్టు అభిప్రాయం ఏమిటంటే, హత్యకేసులలో అయినా సరే మరణదండన సులభంగా వేయకూడదు. అరుదయిన వాటిలోకి అరుదయిన కేసులలో (rarest of rare cases) మాత్రమే వేయాలి. ఈ వాదనతోనే, సెషన్స్ కోర్టు వేసే మరణదండనను పై కోర్టులు తరచుగా కొట్టేస్తుంటాయి. కానీ చలపతిరావు, విజయవర్ధనరావుల విషయంలో ఈ వాదనను హైకోర్టు, సుప్రీంకోర్టు ఒప్పుకోలేదు. పోలీసులు తమ చార్జిషీటులో బస్సు దహనాన్ని అసంకల్పితంగా లేక తత్తరపాటుతో జరిగిన చర్యగా కాక ఉద్దేశ్యపూర్వకంగా చేసిన చర్యగా చూపించారు. కోర్టులు దానిని నమ్మాయి. అంతే కాక ముద్దాయిల లక్ష్యాన్ని కూడా కోర్టులు వికృతంగా అర్థం చేసుకున్నాయి. దారిద్ర్యం నుండి బయటపడడానికి చేసిన ప్రయత్నంగా కాక, అడ్డదారులు తొక్కి ధనవంతులు అయ్యే ప్రయత్నంగా అర్థం చేసుకున్నాయి. దేశాన్ని దోచి ధనవంతులయిన వాళ్ళు ఉన్నారు గానీ బస్సులు దోచి ధనవంతులయిన వాళ్ళెవరూ లేరు. అయినా కోర్టులు ఈ ఇద్దరి లక్ష్యాన్ని ఆ విధంగానే అర్థం చేసుకొని, అటువంటి వారికి కరుణ చూపించనవసరం లేదని నిర్ణయించాయి. చలపతిరావు, విజయవర్ధనరావుల పట్ల న్యాయమూర్తులలో సానుభూతి కొరవడింది. అందులో ఆశ్చర్యమేమీ లేదు. ప్రత్యేకమైన ప్రయత్నం చేయకపోతే మనుషులు 'తమబోటి' వారిపట్ల మాత్రమే సానుభూతితో స్పందించగలరు. ఈ ఇద్దరూ న్యాయమూర్తులకు 'తమబోటి' వారిగా కనిపించలేదు. కులం, వర్గం కట్టిన గోడలు అడ్డం వచ్చాయి. వాళ్ళ ఆవేదననూ ఆరాటాన్నీ అర్థం చేసుకోలేకపోయారు.

అయినప్పటికీ ఈ ఘటనను 'అరుదయిన వాటిలోకి అరుదయినది'గా భావించవలసిందేనా అంటే, చనిపోయిన వారి సంఖ్య కారణంగా అవుననే న్యాయమూర్తులు నిర్ణయించారు. 23 మంది అమాయకులు చనిపోయారనేది కోర్టులనూ ఇతర ప్రజలనూ ఆవేశానికి గురిచేసింది. చేస్తూ ఉంది. ఇది సహేతుకమైన వైఖరేనా? ఒకవేళ ఆ రోజు బస్సులో అయిదారుగురు మాత్రమే ప్రయాణీకులు ఉండి ఉంటే ఏమయ్యేది? రద్దీ తక్కువ కావడం వల్ల వారిలో కొందరు తప్పించుకుని ఒకరిద్దరు మాత్రం తప్పించుకోలేకపోయారనుకుందాం. అప్పుడు కోర్టులు ఇంత నిర్దయగా ఉండేవా? ముద్దాయిలకు క్షమాభిక్ష పెట్టాలన్న డిమాండ్ పట్ల ప్రజలకు ఇంత కోపం వచ్చేదా? లేదనుకుంటాము. అంటే ఒక చర్య అసంకల్పితంగా,

అనుద్దిష్టంగా, పొరపాటుగా (అది ఎంత ఘోరమైన పొరపాటయినా కానీయండి) జరిగినప్పుడు దాని ఫలితంగా ఎక్కువ మంది చనిపోయినట్టయితే అది 'అరుదైన వాటిలోకీ అరుదైన ఘటన' అయిపోతుందా? ఎవ్వరినీ చంపే ఉద్దేశ్యం వాళ్ళకు లేనప్పుడు ఎంతమంది చనిపోయారనేదాని వల్ల నేరం తీవ్రత పెరగదు. చంపే ఉద్దేశం ఉంటే అది వేరే సంగతి.

ఇంక కోర్టుల సంగతి పక్కన బెట్టి మిగిలిన విషయాలు చూద్దాం.

4. ఒక నేరం చేసిన తరువాత చలపతిరావు, విజయవర్ధనరావులంత సులభంగా చట్టం చేతికి చిక్కిపోయిన వాళ్లు కొద్దిమందే ఉంటారు. పోలీసులు వాళ్ళను ఒకటి రెండు రోజులలోనే అరెస్టు చేశారు. వేగంగా, నిరాటంకంగా నేరపరిశోధన ముగించి, జరిగిన సంఘటనను అతిగా చేసి చూపించే చార్జిషీటు పెట్టారు. సాక్షులందరూ నిర్భయంగా సాక్ష్యం చెప్పారు. కోర్టు నిర్మొహమాటంగా మరణదండన విధించింది.

అన్ని హత్య కేసులూ ఈ విధంగా నడవవు. ముద్దాయిలు సాంఘికంగా, ఆర్థికంగా బలవంతులయినా, ఒక రాజకీయ ఉద్యమానికి చెందిన వారయినా, కనీసం వృత్తి నేరస్తులయినా ఈ క్రమానికి ఎక్కడో ఒకచోట బ్రేక్ పడి ఉండేది. వీళ్ళకు ఆ మూడు లక్షణాలూ లేవు. వీళ్ళిద్దరూ దిక్కుమొక్కులేని దళిత శ్రామికులు. వీళ్ళు పోలీసుల చేతులు తడిపి వారి పరిశోధన కొంచెం తమకు అనుకూలంగా జరిగేటట్టు చూసుకోలేకపోయారు. ఎవరి చేతా ఎస్‌పిగారికో డిఐజిగారికో చెప్పించలేకపోయారు. సాక్షులను కొనలేకపోయారు, బెదిరించలేకపోయారు. కేసుకు అడుగడుగునా సాంకేతిక ఇబ్బందులు కల్పించి (కారంచేడు ముద్దాయిలు చేసినట్టు) సాగదీయలేకపోయారు. వేరే ఏ రకంగానూ తమను తాము కాపాడుకోలేక పోయారు. గవర్నర్ దగ్గరా రాష్ట్రపతి దగ్గరా వీళ్ళ తరపున గట్టిగా ఒత్తిడి పెట్టే ఘరానా మనుషులెవరూ లేరు. ముఖ్యమంత్రి చెవిలో ఒక మాట వేసి గవర్నర్ చేత క్షమాభిక్ష అర్జీపైన సంతకం పెట్టించగల శ్రేయోభిలాషులు కూడా వీళ్ళకు ఎవరూ లేరు.

వీళ్ళిద్దరినీ ఉరి తీయవలసిందేనని ఆవేశపడుతున్న వాళ్ళంతా ఈ వాస్తవాలనొకసారి తలచుకుంటే మంచిది. మన దేశంలో బలవంతులు – కులం, డబ్బు, అధికారం, హోదా ఉన్నవాళ్ళు చట్టానికి సులభంగా చిక్కరు.

చిక్కేది బలహీనులే. 'బలవంతులను న్యాయస్థానాలు శిక్షించలేకపోతున్నాయి కాబట్టి బలహీనులను సైతం విడిచిపెట్టమనడం న్యాయవ్యవస్థను భ్రష్ఠ పట్టించడం కాదా? వీళ్లనే కాక వాళ్లను కూడా శిక్షించమని ఉద్యమించడం సబబుగా ఉండదా?' అని ఎదురు ప్రశ్న వేస్తారేమో. బలవంతులను శిక్షించలేని న్యాయవ్యవస్థను మూసివేయాలని మేము అనడం లేదు. కాని చేతికి చిక్కారు కదా అని బలహీనులపైనే చట్టం తన ప్రతాపమంతా చూపించనవసరం లేదు.

బలవంతులు చట్టానికి చిక్కకపోవడం ఒకటే కాదు, వాళ్ళకు నేరాలకు పాల్పడవలసిన 'అవసరం' కూడా ఉండదు. వాళ్ళు అవసరం కోసం కాక అదనపు ప్రయోజనాల కోసం నేరాలకు పాల్పడతారు. (క్షణికోద్రేకం వంటి కొన్ని ఇతర కారణాలు కూడా ఉండవచ్చు.) బలహీనులు (ఎప్పుడూ కాకపోయినా) తరచుగా ఒక అవసరం పెట్టే ఒత్తిడి వల్ల నేరానికి పాల్పడతారు. ఇతరుల సంగతి ఎట్లాగున్నా, చలపతిరావు, విజయవర్ధనరావుల విషయంలో ఇది పూర్తిగా వాస్తవం. వాళ్ళు తమ కుటుంబాలను ఆర్థిక సమస్యల నుండి బయట పడేయడం కోసం ఈ దొంగతనానికి పూనుకున్నారు. ఒక అవసరం కోసం కాక స్వార్థ ప్రయోజనాల కోసం నేరాలకు పాల్పడే బలవంతులు చట్టానికి దొరకకుండా అనేక రూపాలలో తప్పించుకోగలరు. చట్టం ఇచ్చే హక్కులనే అందుకోసం వాడుకోగలరు. ఏదో ఒక అవసరం లేక ఒత్తిడి కారణంగా నేరాలలోకి నెట్టబడే బలహీనులు చట్టానికి దొరుకుతారు. దొరికారు కదా అని చట్టం తన ప్రతాపమంతా వారిపైన చూపించవలసిన అవసరం లేదు. వాళ్ళ జీవన పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కొంత ఉదారంగా వ్యవహరించవచ్చును. అదే ఉచితంగా ఉంటుంది.

మర్రి చెన్నారెడ్డిని ముఖ్యమంత్రి కుర్చీ నుండి దింపి నేదురుమల్లి జనార్దనరెడ్డిని ఎక్కించడం కోసం హైదరాబాద్‌లో 200 మందిని ఊచకోత కోయించిన సంగతి తెలిసిందే. అది కుట్రపూరితంగా జరిగిన మారణకాండ. అయినా దానికి పోలీసులు కుట్రకేసు పెట్టలేదు. విడివిడిగా హత్యకేసులు పెట్టారు. ఆ కేసులు కోర్టులలో నత్తనడక నడుస్తున్నాయి. వాటిలో ఎవరికైనా శిక్ష పడినా ఉరిశిక్ష మాత్రం పడదని గట్టిగా చెప్పవచ్చును. అవి అధికారబలం ఉన్నవాళ్ళు వృత్తి నేరస్తులను కిరాయికి తీసుకొని చేయించిన

హత్యలు. వాళ్ళు బలమైన సాక్ష్యాలను కోర్టుదాకా రానివ్వరు. ఆ పని చేతకాని చలపతిరావు, విజయవర్ధనరావులు పేదరికపు ఒత్తిడి కారణంగా చేసిన తప్పిదానికి ఉరికంబం ఎక్కవలసిందేనా?

5. 'నేరం ఎంతటిదయితే శిక్ష కూడా అంతే ఉండాలి' అనేది నేరం – శిక్షల గురించి చాలామందికి ఉండే అభిప్రాయం. నువ్వు ఎంత హాని చేస్తే నీకు తిరిగి అంతే హాని జరిగితేనే సరైన పరిహారం జరిగినట్టు అని చాలామంది భావిస్తారు. సాంప్రదాయక నేరస్మృతులు ఈ 'కంటికి కన్ను పంటికి పన్ను' అనే వైఖరికి అధికార ముద్ర వేశాయి. దీని ఫలితం ఏమిటంటే నేరానికి బాధ్యత మొత్తం నేరం చేసిన వ్యక్తి పైననే పెట్టడం. కానీ నిజానికి ప్రతీ నేరానికీ వ్యక్తి బాధ్యతతో పాటు పరిస్థితుల బాధ్యత కూడా కొంత ఉంటుంది. పరిస్థితులకు సామాజిక వ్యవస్థ బాధ్యత వహించవలసి ఉంటుంది. కాబట్టి జరిగిన ప్రతీ నేరానికి, దానికి పాల్పడిన వ్యక్తితోపాటు సమాజం కూడా కొంత బాధ్యత స్వీకరించవలసి ఉంటుంది. ముఖ్యంగా – రకరకాల ఒత్తిడులలో జీవించే పేద, దళితవర్గాల వారు, పరిసరాల ప్రభావానికి సులభంగా లోనయ్యే యువకులు చేసే నేరాలకు సమాజం బాధ్యత చాలా ఉంటుంది. మరి 'సమాజం' అనే దానిని శిక్షించలేము కదా అనవచ్చు.. ఏమో – అది కూడా ఆలోచించవలసి ఉంటుంది. చలపతిరావు, విజయవర్ధనరావులను నేరానికి నెట్టిన పరిస్థితులకు సమాజం పరిహారం చెల్లించే మార్గమేదీ ఆలోచించలేమా?

సమాజాన్ని తగుపాళ్ళలో శిక్షించలేకపోయినా, వ్యక్తి మీదే తప్పంతా పెట్టి 'నువ్వు చంపావు కాబట్టి నువ్వు చావవలసిందే'ననడం సబబు కాదు. మరణదండన అంటేనే హత్యకు పూర్తి బాధ్యత హంతకునిపైన పెట్టడం అని అర్థం. సమాజం బాధ్యతను గుర్తిస్తే శిక్షల కాఠిన్యాన్ని తగ్గించాల్సి ఉంటుంది. మరణదండనను సూత్రప్రాయంగా వ్యతిరేకించడానికి గల కారణాలలో ఇదొకటి. ఎవరయితే సాంఘిక, ఆర్థిక వ్యవస్థనుండి పుట్టే ఒత్తిడుల వల్ల నేరాల వైపు ఆకర్షితులవుతారో వాళ్ళ విషయంలో శిక్షలు మరీ సరళంగా ఉండాలి. కానీ విడ్డూరం ఏమిటంటే ఈనాటి న్యాయవ్యవస్థలో వాళ్ళే ఎక్కువగా శిక్షించబడుతున్నారు.

'తిండిలేని వాళ్ళంతా దొంగతనాలు చేస్తున్నారా? ఎట్లాగో కష్టపడి ఒకరికి హాని చేయకుండా బతకడం లేదా?' అని చాలామంది అడుగుతున్నారు.

ఎంత పేదరికంలోనయినా దొంగతనానికి పాల్పడకుండా బ్రతకడం గొప్ప విషయమా లేక తెలివితక్కువతనమా అనే ప్రశ్నను పక్కన పెడదాం. దానిని వివరంగా చర్చించడానికి ఇది సందర్భం కాదు. దానికి సులభమైన జవాబు కూడా లేదు. ఎందుకంటే దొంగతనం అనేది కేవలం ప్రైవేటు ఆస్తి అనే భావనపైన దాడి కాదు. అది దొంగతనానికి పాల్పడే మనిషి స్వీయ వ్యక్తిత్వంపైన దెబ్బ కూడా. కానీ దొంగతనం చేసి డబ్బు సంపాదించుకుందామన్న ఆలోచన ఈనాటి నిరుద్యోగ యువకులకు సులభంగా వస్తున్నదంటే దానికి బాధ్యులెవరు? ఆ నిరుద్యోగ యువకులేనా? అక్రమార్జనలో తప్పేమీ లేదన్న అభిప్రాయం సమాజంలో ప్రబలడానికి కారకులు చలపతిరావు, విజయవర్ధనరావుల వంటి పేద, దళిత, నిరుద్యోగ యువకులు కారు. అధికారం, సంపద, హెూదా ఉన్న అగ్రకుల పెత్తందార్లు. దేశ ప్రధాని నుండి ఊరి ప్రెసిడెంట్ దాకా అందరికీ ఈ పాపంలో భాగం ఉంది. డబ్బు సంపాదనలో అక్రమం, సక్రమం అనే తేడా లేదనే అభిప్రాయాన్ని స్థిరపరచింది ఈ పెద్దమనుషులే. వీళ్ళు తీర్చిదిద్దిన సంస్కృతి చేత ప్రభావితులైన చలపతిరావు, విజయవర్ధనరావులు బస్సు దోపిడీకి పాల్పడదామని నిర్ణయించుకుంటే ఆ తప్పంతా ఈ ఇద్దరి మీదనే ఎందుకు పెట్టాలి? ఈ సంస్కృతీ వైపరీత్యానికి కర్తలయిన ఘరానా నేరస్తులను సమాజం శిక్షించలేకపోతే పోయింది, కనీసం వీళ్ళను కొంతయినా కనికరించవచ్చును కదా?

6. '23 మందిని చంపిన వాళ్ళను కూడా ఉరితీయలేకపోతే ఇంక సమాజంలో నేరాలను ఆపేది ఎట్లా'గని చాలామంది ఆవేశంగా ప్రశ్నిస్తున్నారు. కఠినమైన శిక్షలు వేయకపోతే నేరాలు ఆగవనీ, నేరాలను ఆపడానికి కఠినమైన శిక్షలు అవసరమనీ చాలామంది నమ్ముతున్నారు. నేరానికీ శిక్షకూ మధ్యనున్న సంబంధం ఇంత సరళమైందా? శిక్ష పడుతుందన్న భయమొక్కటే నేరాలను అదుపు చేస్తుందా? కఠినమైన శిక్ష పడుతుందన్న భయం లేకపోతే మనుషులను నేరాలు చేయకుండా ఆపేది వేరే ఏదీ లేదా? శిక్ష పడుతుందన్న భయం ఉన్నా నేరానికి పురిగొల్పే పరిస్థితులు, శక్తులు ఏవీ లేవా?

ఈ ప్రశ్నల గురించి సామాజిక శాస్త్రవేత్తలు చాలా చర్చ, పరిశోధన చేసి ఉన్నారు. నేరాలను అదుపు చేయడంలో శిక్షల కాఠిన్యానికి ఉండే పాత్ర

చాలా స్వల్పం అనేది ఈ పరిశోధనల సారాంశం. నేరానికీ, శిక్ష పడుతుందన్న భయానికీ మధ్య చాలా ఇతర అంశాలు ఉంటాయి. సమాజం, అందులోని వివిధ వర్గాల ప్రజల సామాజిక స్థితిగతులు, సామాజిక సంస్కృతి, నైతిక ప్రమాణాలు మొదలయినవన్నీ నేరాలను పెంపొందించడంలోనూ అదుపు చేయడంలోనూ పాత్ర నిర్వహిస్తాయి. కాబట్టి శిక్ష కఠినంగా లేకపోతే నేరాలు పెచ్చరిల్లిపోతాయని గానీ, శిక్ష కఠినంగా ఉంటే నేరాలు తగ్గుతాయని గానీ నమ్మడానికి ఆధారాలేమీ లేవని పరిశోధకులు అంటున్నారు.

సమాజంలో నేరాలు అదుపు చేయాలంటే వివిధ సామాజిక జీవిత రంగాలలో అనేక చర్యలు చేపట్టవలసి ఉంటుంది. చాలా మార్పులు తీసుకురావాల్సి ఉంటుంది. అప్పుడు 'శిక్ష' అనేది హింసించడం ద్వారా నేరాలను అదుపు చేసే ప్రక్రియ కాక, తప్పుచేసిన మనిషిని సమాజానికి ఉపయోగపడే వ్యక్తిగానూ, ఆ తప్పుకు స్థానం కల్పించిన సమాజాన్ని మనిషికి ఉపయోగపడే జీవితరంగంగానూ మలచుకునే సంస్కరణాత్మక ప్రక్రియ కాగలదు. సంస్కరణకు లోను కావలసింది కేవలం నేరం చేసిన వ్యక్తే కాదు – అతనికి స్థానం కల్పించిన సమాజం కూడా.

కాబట్టి హంతకులను ఉరి తీయకపోతే హత్యలు ఆగవు అనుకోనవసరం లేదు. ప్రపంచంలోని 55 దేశాలలో ఇప్పుడు మరణదండన రద్దు చేయబడింది. మరొక 42 దేశాలలో మరణదండన నేరస్మృతులలో ఉన్నప్పటికీ ఆ దండన విధించడం మానేసారు. వాటిలో అభివృద్ధి చెందిన దేశాలే కాక మనబోటి మూడవ ప్రపంచపు దేశాలు కూడా ఉన్నాయి. కానీ మరణ దండన రద్దు చేసిన దేశాలలో ఆ తరువాత హత్యలు పెరిగిన దాఖలాలు లేవని శాస్త్రీయ పరిశోధనలు తెలుపుతున్నాయి. నేరానికీ, శిక్ష పడుతుందన్న భయానికీ మధ్యనున్న సంబంధం ఏమంత ప్రత్యక్షమైనదీ కాదు, సరళమైనదీ కాదు.

నిజానికి శిక్షలు కఠినంగా లేకపోతే నేరాలు ఎట్లా ఆగుతాయని ఆవేశపడుతున్నారు గానీ లోపలికి తరచి చూసుకుంటే అసలు కారణం అది కాదు. శిక్షలు కఠినంగా ఉండాలనే కోరికలో అంతర్లీనంగా ఉన్నది ప్రతీకార వాంఛ. మనలో ఎవ్వరైనా ఏ రోజయినా ఒక దొంగతనానికి లేక దోపిడీకి

గురి కావచ్చును కాబట్టి అలా గురి అయినవారితో సహానుభూతి చెంది ప్రతీకారం కోరుకుంటున్నాము. అందుకే ఆ ఇద్దరినీ ఉరితీసి తీరాలని అందరూ ఇంతగా ఆవేశపడుతున్నారు. కాని శిక్షాస్మృతికి ఈ రకమైన ప్రతీకారేచ్ఛ ప్రమాణం కావచ్చునా అనేది కొంచెం శాంతంగా ఆలోచించవలసిన విషయం. ఒక నష్టానికి గురయిన వ్యక్తి దానికి కారకుడయిన వ్యక్తిని పురిగొల్పిన పరిస్థితుల గురించి ఆలోచించలేడనీ, ఎటువంటి కనికరం చూపించలేడనీ మనకు తెలుసును. నష్టానికి లోనయి ఆవేశపడుతున్న వ్యక్తి చెప్పే న్యాయాన్ని మనం మామూలుగా విశ్వసించం. ఎందుకంటే ప్రతీకార కాంక్షతో రగిలిపోయే మనిషి న్యాయం ఆలోచించలేడని మనకు తెలుసును. శిక్షలు కఠినంగా ఉండి తీరాలని సమాజంలో సాధారణంగా వినిపించే అభిప్రాయం వెనుకనున్నది ఈ ప్రతీకార ఆవేశమే తప్ప నిలకడగా చేసే ఆలోచన కాదు. కానీ నిలకడగా ఆలోచించినప్పుడే నేరం వెనుక ఉన్న అన్ని పరిస్థితులను లెక్కలోకి తీసుకుని శిక్షల గురించి సహేతుకంగా ఆలోచించగలుగుతాం. ఒక ఉమ్మడి ప్రతీకారేచ్ఛతో రగిలిపోయే సమాజం ఉరిశిక్ష గురించి సహేతుకంగా ఆలోచించజాలదు.

7. ఒక ఆఖరి మాట:

మనం సాధారణంగా హింసను అసహ్యించుకుంటాం. ఒక మనిషి మరొక మనిషిని హింసిస్తే దానికి చాలా బలమైన కారణం ఉంటే తప్ప ఆమోదించం. ఏ సమస్యకయినా శాంతియుతమైన పరిష్కారం వెతుక్కోవడమే మంచిదని నమ్ముతాం. పూర్తిగా అనివార్యమైతేనే బలప్రయోగాన్ని ఆమోదిస్తాం.

కానీ శాంతిభద్రతల పేరిట, చట్టం పేరిట, సమాజ ప్రయోజనాల పేరిట, న్యాయం పేరిట రాజ్యవ్యవస్థ పాల్పడే హింసను సులభంగా ఆమోదించడమే కాక తరచుగా ఆహ్వానిస్తాము కూడా. దీనికొక నేపథ్యం ఉంది. సమాజాన్ని క్రమశిక్షణలో పెట్టే బాధ్యత రాజ్యవ్యవస్థకు చారిత్రకంగా కట్టబెట్టబడింది. అందుకోసం బలప్రయోగం చేసే అధికారం రాజ్యవ్యవస్థకు ఇవ్వబడింది. కాబట్టి భద్రత పేరిట రాజ్యవ్యవస్థ చేసే బలప్రయోగాన్ని మన మంచి కోసమే మనం ఆహ్వానిస్తున్నామనుకుంటాము.

కానీ భద్రత నెలకొల్పడం కూడా ఒక సామాజిక సమస్యే. అన్ని సామాజిక సమస్యల లాగా దీనిని కూడా వీలయినంత వరకు సామరస్యంగా, శాంతియుతంగా, బలప్రయోగానికి పాల్పడకుండా పరిష్కరించమని మనమెందుకు కోరలేకపోతున్నాము? వేరే విషయాలలో శాంతినీ అహింసనూ కాంక్షించేవాళ్లం, ఈ విషయంలో మాత్రం కఠినమైన బలప్రయోగమే పరిష్కారం అని ఎందుకు నమ్ముతున్నాము? నేరాలను అరికట్టడానికి ఇతర మార్గాలన్నీ అన్వేషించి, అవి సరిపోని మేరకు మాత్రమే శిక్షా వ్యవస్థను ఆశ్రయించాలని ఎందుకు అనలేకపోతున్నాము? కఠినమైన శిక్షలు వేయడం ఒక్కటే పరిష్కారం అని ఎందుకు అనుకుంటున్నాము? మానవ ప్రవర్తనలో అనాగరికంగా భావించే హింసను రాజ్య వ్యవస్థ దగ్గరికొచ్చేసరికి సులభంగా ఆహ్వానించడమే కాక అది మరింత కఠినంగా ఉండాలనీ, నిర్దయగా ఉండాలనీ అనుకోవడంలో ద్వంద్వ ప్రమాణాలు లేవా? చలపతిరావు, విజయవర్ధనరావులు చేసిన హత్యను అసహ్యించుకునే వాళ్ళు, వారిద్దరినీ ఇప్పుడు రాజ్యవ్యవస్థ హత్య చేయవలసిందేనని ఆవేశపడడం ఈ ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనం కాదా?

కొంచెం ఆలోచించమని మనవి.

**'చలపతి, విజయవర్ధనం' పుస్తకంలో వచ్చిన వ్యాసం, ఏకలవ్య ప్రచురణ**

**20 నవంబర్ 1996**

# రేప్‌కు మరణదండన అవసరమా?

**"**నేరాలు జరుగుతుండడానికి కారణం శిక్షలు కఠినంగా లేకపోవడమేననేది – విషయాన్ని గురించి ప్రాథమికమైన అవగాహన సైతం లేనివాళ్ళు చేసే ఆలోచన. స్త్రీలపైన లైంగిక అత్యాచారాలు విపరీతంగా జరుగుతున్నాయని, వాటిని అరికట్టాలని అందరూ ఒప్పుకుంటారు. కానీ చట్టం వాటిని అరికట్టలేకపోవడానికి ఉరిశిక్ష లేకపోవడమే కారణమా? అసలు జరుగుతున్న రేప్ నేరాలలో ఎన్నిటిలో నిందితునికి శిక్షపడుతున్నది? నూటికి నాలుగు కేసులలో కూడా శిక్షపడడం లేదని అంచనా. శిక్ష అంత అరుదుగా పడేటప్పుడు అది ఉరిశిక్ష అయితేనేం, వేరే ఏదయితేనేం?**"**

మన హోంమంత్రి అద్వానీకి 'మరణదండన ప్రియుడు' అని బిరుదు ఈయవచ్చు. నేరాలు పెరిగిపోతున్నాయని ఆయనతో ఎవరు ఫిర్యాదు చేసినా "అయితే ఉరి తీసేద్దాం" అంటాడు. ఒక బి.జె.పి. నాయకుడుగానో ఆర్.ఎస్.ఎస్. నాయకుడిగానో ఆయన ఆ మాటలు మాట్లాడితే అది ఆ సంస్థల సిద్ధాంత వైపరీత్యం అని కొట్టిపారేయవచ్చు. కానీ ఈయన దేశానికి హోంమంత్రి.

రేప్ కేసులకు కూడా మరణదండన విధించేటట్టు చట్టాన్ని సవరిస్తామని ఆయన అన్నారు. అంతకు ముందొకసారి, మారణాయుధాలు పట్టుకుని తిరుగుతున్న వాళ్ళకు కూడా మరణదండన విధిస్తామన్నారు. ఇంకా ఎవరెవరిని ఆయన ఈ జాబితాలో చేరుస్తారో చూడాలి.

నేరాలు జరుగుతుండడానికి కారణం శిక్షలు కఠినంగా లేకపోవడమేననేది – విషయాన్ని గురించి ప్రాథమికమైన అవగాహన సైతం లేనివాళ్ళు చేసే ఆలోచన. స్త్రీలపైన లైంగిక అత్యాచారాలు విపరీతంగా జరుగుతున్నాయని, వాటిని అరికట్టాలని అందరూ ఒప్పుకుంటారు. కానీ చట్టం వాటిని అరికట్టలేకపోవడానికి ఉరిశిక్ష లేకపోవడమే కారణమా? అసలు జరుగుతున్న రేప్ నేరాలలో ఎన్నిటిలో నిందితునికి శిక్షపడుతున్నది? నూటికి నాలుగు కేసులలో కూడా శిక్షపడడం లేదని అంచనా. శిక్ష అంత అరుదుగా పడేటప్పుడు అది ఉరిశిక్ష అయితేనేం, వేరే ఏదయితేనేం? నూటికి నాలుగు కేసులు మించి నేరం రుజువు కానప్పుడు నేరం రుజువయితే ఉరిశిక్ష సైతం వేస్తామని బెదిరించి ఏం ప్రయోజనం?

ఈ పరిస్థితి ఉండడానికి పోలీసు యంత్రాంగం బాధ్యత ఉంది. సమాజం బాధ్యత (అంటే మనందరి బాధ్యత) ఉంది. బాధితురాలు ఫిర్యాదు చేయడానికే వెనకాడుతుంది. నేరస్తుడి సంగతేమో కానీ తన భవిష్యత్తు ఏమవుతుందో అని ఆందోళన చెందుతుంది. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా చాలాసార్లు వెంటనే స్పందించరు. నేర పరిశోధన చేయరు. బాధితురాలిని వైద్య పరీక్షకు పంపించడంలో పోలీసులు ఆలస్యం చేయడం వల్ల సాక్ష్యం రుజువుకు నిలువకుండా పోయిన కేసులు చాలా ఉన్నాయి. వెంటనే పంపించినా వైద్యులు నిజాయితీగా పరీక్ష జరపని ఘటనలు చాలా ఉన్నాయి. లంచాల ప్రభావం బలంగా పని చేసే ఈ వ్యవహారాలలో (పోలీసులూ – వైద్యులూ అందరూ లంచగొండులేనని నా అభిప్రాయం కాదు.) మగవాళ్ళకున్న సౌకర్యం స్త్రీలకుండదు.

ఎక్కువగా రేప్‌కు గురయ్యే పేద, దళిత స్త్రీలకు అసలే ఉండదు.

ఇక్కడిదాకా సవ్యంగా జరిగినా బాధితురాలి అసలు సమస్యలు ఆ తర్వాత మొదలవుతాయి. రేప్ చేసిన వాడి పరువుకేమీ ఢోకా ఉండదు. కానీ బాధితురాలి పరువు పోతుందని కుటుంబంలో, కులంలో, సమాజంలో ఒత్తిడి మొదలవుతుంది. అతడితో ఆమెకు ఏ కొంచెం పరిచయం ఉన్నా – 'ఆమె ఎట్లాంటిదో – వాడికీ ఆమెకూ ఏ సంబంధం ఉందో' అన్న చర్చ మొదలవుతుంది. నిజానికి ఈ భయంతోనే చాలామంది స్త్రీలు చెప్పుకోవడానికే భయపడతారు. లేదా ఆ తర్వాత రాజీపడతారు. పోలీసులు, ఇంటి పెద్దలు, కులం పెద్దలు, ఊరి పెద్దలు, అందరూ కలిసి బలవంతంగా రాజీ చేయిస్తారు. ఇది మారాలంటే సామాజిక వ్యవస్థలోనూ, ఆలోచనారీతులలోనూ చాలా సంస్కరణ తేవలసి ఉంది. కఠినమైన శిక్షల గురించి మాట్లాడడం ఈ అవసరాన్నీ, దానికి సంబంధించిన వైఫల్యాన్నీ కప్పి పెట్టడానికి మాత్రమే పనికొస్తుంది.

ఒకవేళ ఇదంతా అధిగమించి కేసు కోర్టు దాకా వచ్చినా బాధితురాలికక్కడ అవమానమే ఎదురవుతుంది. లైంగిక క్రియకు తాను సమ్మతించలేదని తానే రుజువు చేసుకునే స్థితికి ఆమె నెట్టబడుతుంది. బ్రిటిష్ సంప్రదాయంలో వచ్చిన రేప్ చట్టం తొలినాడు ఆ నేరాన్ని స్త్రీ పైన అత్యాచారంగా భావించలేదు. లైంగిక నియమాలకు అపచారంగా భావించింది. అంటే భార్యాభర్తలు కాని స్త్రీ పురుషులు సంభోగించడం అందులోని ప్రధాన నేరం. ఆ తప్పులో పాల్గొన్న స్త్రీ 'అతను నన్ను బలవంతం చేశాడు' అని సంజాయిషీ చెప్పుకుంటున్నట్టు చట్టం ఆమె అభియోగాన్ని అర్థం చేసుకునేది. అందువల్ల ఆమె సాక్ష్యాన్ని అనుమానంగా చూడాలన్న నియమం ఉండేది. కాలక్రమంలో రేప్‌ను స్త్రీపైన అత్యాచారంగా అర్థం చేసుకోవడం మొదలయినప్పటికీ బాధితురాలి వాంగ్మూలాన్ని అనుమానంగా చూసే వైఖరి కోర్టులను ఇంకా వదిలిపెట్టలేదు. ఈ వైఖరి చట్టవిరుద్ధం అని సుప్రీంకోర్టు ఈ మధ్య కొన్ని తీర్పులలో ప్రకటించినప్పటికీ (దేశ ప్రధాన న్యాయమూర్తిగా ఉండిన జస్టిస్ అహ్మదీ 1995లో కర్నేల్‌సింగ్ కేసులో ఇచ్చిన తీర్పు ఒక మంచి ఉదాహరణ) న్యాయస్థానాల సంస్కృతిలో పెద్దగా మార్పు రాలేదు.

అంతే కాకుండా బాధితురాలి ఫిర్యాదు అబద్ధమని రుజువు చేయడం కోసం ఆమె 'గత చరిత్ర'ను తవ్వి తీసే అవకాశం సాక్ష్యాల చట్టంలోని సెక్షన్ 155 (4) ముద్దాయికి ఇస్తుంది. కోర్టులో బోనెక్కిన బాధితురాలికి ఎవరెవరితోనో సంబంధం

అంటగట్టి అవమానపరచడానికి ఇది ఉపయోగపడుతుంది. చట్టాన్ని సవరించడం ద్వారా రేప్ కేసులలో న్యాయం జరగడానికి తోడ్పడాలన్నదే అద్వానీ ఉద్దేశ్యమైతే ఈ విషయాలలో ఉపయోగకరమైన సవరణలకు చాలా అవకాశం ఉంది.

కానీ అన్ని నేరాల లాగా రేప్ విషయంలో కూడా కేవలం చట్టాలు – కోర్టులు అనే పరిధిలో ఆలోచిస్తే ప్రయోజనం లేదు. నేరాలు జరిగేది సమాజంలో. వాటికి నివారణ వెతకవలసింది సమాజంలో. నేరస్మృతి ఇందుకు ఒకానొక సాధనం మాత్రమే. సామాజిక బాధ్యత మొత్తం వదిలిపెట్టి నేరస్మృతిని మరింత 'కఠినం' చేస్తే సరిపోతుందనుకోవడం బలప్రయోగం మీద అతి విశ్వాసం ఉంచడం. అది సమస్యను పరిష్కరించకపోగా నేరస్మృతినీ, న్యాయవ్యవస్థనూ వికృతంగా, అనాగరికంగా మారుస్తుంది.

తన లైంగిక అవసరాల కోసం స్త్రీని ఒక వస్తువుగా వాడుకునే 'హక్కు' మగవాడికి ఉందనే సంస్కృతి మన సామాజిక వ్యవస్థలో ఉంది. రేప్‌కు సామాజిక మూలం ఈ వికృతమైన 'హక్కే'. ఈ సంస్కృతిని పోగొట్టడానికి సామాజికంగా కృషి జరగడం అవసరం. ఆ బాధ్యతంతా ప్రభుత్వానిదే కాదు. కానీ ప్రభుత్వానికి కూడా ఈ విషయంలో ఒక విధానం ఉండాలి. అటువంటిదేమీ లేకుండా రేప్ చేసిన వాళ్ళను ఉరితీస్తామని ప్రకటించడం సులభమైన పరిష్కారంగా కనిపించవచ్చు కానీ అది కష్టతరమైన కర్తవ్యాన్ని తప్పించుకునే మార్గం మాత్రమే.

ఈ వికృత సంస్కృతిని పోగొట్టే కృషి సమాజంలో ఏమీ జరగకపోగా దానిని మరింత పెంచే సినిమా సంస్కృతి, చవుకబారు సాహిత్య సంస్కృతి రాజ్యమేలుతున్నాయి. ఈ సంస్కృతి ప్రభావంలో ఉన్న మగవాళ్ళకు ఏ స్త్రీనైనా లైంగికంగా లోబరుచుకోవడం అత్యంత సహజమైన విషయంగా కనిపిస్తుందే తప్ప ఒక తప్పుగానో, అన్యాయంగానో, నేరంగానో కనిపించదు.

ప్రభుత్వానికే కాదు. అద్వానీగారి పార్టీకి, వారి మిత్ర 'సంఘ్ పరివార్' సంస్థలకు కూడా ఈ విషయంలో ఒక అవగాహన గానీ, విధానం గానీ లేదు. వాళ్ళు తరచుగా 'మన సంస్కృతి' అంటూ ఆవేశపడుతుంటారు. 'మన సంస్కృతిని కాపాడుకోవాలి' అని గొడవ చేస్తుంటారు. కాని ఈ 'మన సంస్కృతి' లోని లైంగిక హింస, దాన్ని మరింత పెంచుతున్న సినిమా, సాహిత్య సంస్కృతి వారికి అభ్యంతరకరంగా కనిపించవు. పోరాడవలసిన విషయాలుగా కనిపించవు. వారికి అభ్యంతరకరంగా కనిపించేవి లైంగికత గురించీ, లైంగిక జీవితాన్ని గురించీ నిజాయితీగానూ, సున్నితంగానూ ఆలోచింపజేసే 'ఫైర్' వంటి సినిమాలు.

లైంగిక హింసను రెచ్చగొట్టే ఏ సినిమా పట్ల చూపించని వ్యతిరేకత వీళ్ళు ఈ సినిమా పట్ల చూపిస్తున్నారంటే వీళ్ళు 'మన సంస్కృతి'ని కాపాడదలుచుకున్నది హింస నుంచి, ఆధిపత్యం నుంచి కాదనీ, నిజాయితీగల ఆత్మావలోకనం నుంచి అనీ అర్థం అవుతుంది.

ఆ మూసలో తయారయిన అద్వానీకి రేప్‌కు జవాబు ఉరిశిక్షేనని తోచడంలో ఆశ్చర్యమేమీ లేదు. కానీ ఉరిశిక్ష ఏ నేరానికీ జవాబు కాదనేది ఇవ్వాళ అంతర్జాతీయంగా జరుగుతున్న చర్చ. సంఘ్ పరివార్ హిందూత్వవాదులకు ఆ చర్చతో పరిచయం లేకపోవచ్చు. ఆ మాటకొస్తే మానవతావిలువల పురోగమనానికి సంబంధించిన ఏ చర్చతో వాళ్ళకు పరిచయం ఉంది కనుక? కానీ ఈ దేశం సంఘ్ పరివార్ జాగీరు కాదు. ఈ దేశ నాగరికతను వాళ్ళ ఆలోచనల స్థాయికి కుదించి వేయడానికి వీలు లేదు. మన నాగరికతకు నిజమైన నష్టం దాని నుంచి వస్తుంది. 'ఫైర్'వంటి సినిమాల నుంచి కాదు.

'ప్రపంచంలో 56 దేశాలు మరణదండనను సంపూర్ణంగా చట్టాల నుంచి తొలగించాయి. మరో 40 పైగా దేశాలు ఆచరణలో మరణదండన వేయడం మానేశాయి. అంటే ప్రపంచంలో దాదాపు సగం దేశాలు మరణదండనకు దూరంగా ఉన్నాయి. ఆ దేశాలేమీ నాశనం అయిపోలేదు. మిగిలిన దేశాలలో అత్యధిక భాగం (ఇప్పటివరకూ భారతదేశం లాగా) కేవలం హత్యానేరానికి, అవి కూడా అనేక పరిమితులతో మరణదండన విధిస్తున్నాయి. సౌదీ అరేబియా, చైనా వంటి కొన్ని దేశాలు మాత్రమే హత్యకే కాక ఇతర నేరాలకు కూడా మరణశిక్ష విధిస్తున్నాయి. అయినా దాని వలన ఆ దేశాలలో నేరాలు తగ్గిన దాఖలాలేమీ లేవు. మన దేశాన్ని కూడా ఆ స్థాయికి దిగజార్చాలన్న సంఘ్‌పరివార్ హోంమంత్రి ప్రయత్నాన్ని ఆమోదించడానికి వీలు లేదు.

నిజానికి 1983లో రేప్ చట్టాన్ని సవరించి కస్టడీలో రేప్, గ్యాంగ్ రేప్ వంటి వాటికి కఠినమైన శిక్షలు పెట్టారు. ముద్దాయిపైననే నిర్దోషిత్వం రుజువు చేసుకునే బాధ్యత ఒక మేరకు పెట్టారు. అయితే ఇది ఎంతవరకు అమలవుతున్నది? అమలు చేయడానికి పోలీసులు ఏ మాత్రం నిజాయితీగా కృషి చేస్తున్నారు? అమలు చేయించుకోవడానికీ, సామాజిక ఒత్తిడులను, అవమానాన్ని ఎదుర్కోవడానికీ బాధితురాళ్ళకు ఏ మాత్రం సహాయం అందించడం జరుగుతున్నది? దీనిని సమీక్షించకుండా శిక్షను మరింత కఠినం చేసేస్తే కేసు నమోదు చేయడంలోనూ, చార్జిషీటు తయారు చేయడంలోనూ మరింత 'జాగ్రత్త'

అవసరం అన్న నెపంతో పోలీసులు ఈ నేరాల పట్ల మరింత ఉదాసీనంగా ఉండే ప్రమాదం ఉంది.

అద్వానీ ప్రతిపాదన ఒక ఎత్తు అయితే మన రాష్ట్ర హైటెక్ ప్రభుత్వం దానికి వెంటనే మద్దతు ప్రకటించడం ఒక ఎత్తు. అభివృద్ధి మొత్తం కంప్యూటర్లలోనే కన్పించే మన ముఖ్యమంత్రికి, ఇతర విషయాలలో మన సమాజాన్ని మధ్యయుగాలకు వెనక్కు తీసుకుని పోయినా అభ్యంతరం లేనట్టుంది.

లైంగిక హింసను పెంచుతున్న సంస్కృతికి వ్యతిరేకంగా అందరమూ కృషి చేయవలసిన అవసరం చాలా ఉంది. శివసేన ఫక్కీలో రాళ్ళతో – కర్రలతో కాదు. సాంస్కృతిక పోరాటం బల ప్రయోగంతో జరిగేది కాదు. అది మనుషుల ఆలోచనా రీతుల మీద పోరాటం. దీనికి తగిన మార్గాలు రూపొందించుకోవాలి. ప్రభుత్వ విధానాలు ఇందుకేమైనా తోడ్పడితే ఆహ్వానించవచ్చుగానీ మరణదండనను చిట్కా వైద్యంగా భావించే శాసన సంస్కరణలు ఆహ్వానించదగినవి కావు.

**ఆంధ్రప్రభ దినపత్రిక**
**10 డిసెంబర్ 1998**

# ఆ నలుగురికి మాత్రం ఎందుకు ఉరి?

“ఎల్.టి.టి.ఇ. చేయించిన ఈ హత్యలో కుట్రదారులయిన వారికి ఉరిశిక్ష వేయవలసిందేనని ఇక్కడ న్యాయస్థానాల లోపలా బయటా చాలామంది వాదిస్తున్నారు. కానీ ఎల్.టి.టి.ఇ ఒక యుద్ధమే నడుపుతున్న శ్రీలంకలో అసలు ఉరిశిక్ష లేదు. ఈ నేరమే శ్రీలంకలో జరిగి ఉంటే దానికి ఉరిశిక్ష పడే అవకాశం లేదు. ఎల్.టి.టి.ఇ. నడుపుతున్న ‘ఈలం’ పోరాటంలాగే బ్రిటన్‌లోని ఐర్లాండ్‌లోనూ సాయుధ పోరాటం నడుస్తున్నది. దానిని అణిచివేయడానికి బ్రిటిష్ ప్రభుత్వం అనేక అక్రమాలకు పాల్పడుతున్నది కానీ బ్రిటిష్ నేర స్మృతిలోనూ ఉరిశిక్ష లేదు.”

రాజీవ్‌గాంధీ హత్యకేసుగా పేరు పొందిన శ్రీపెరుంబుదూర్ హత్యకేసు (అందులో రాజీవ్ గాంధీయే కాక మరొక పదిమందికి పైగా చనిపోయారు) చివరికొక కొలిక్కి వచ్చింది. సుప్రీంకోర్టు తీర్పుపైన ముద్దాయిలు వేయదలచుకున్న రివిజన్ పిటిషన్ బాకీ ఉందనుకోండి, కానీ రివిజన్‌లో కోర్టు సాధారణంగా తన అభిప్రాయాలను మార్చుకోదు. కాబట్టి న్యాయస్థానాలకు సంబంధించినంతవరకూ కేసు ముగిసినట్టే. చెన్నైలోని టాడా స్పెషల్ కోర్టు 26 మంది ముద్దాయిలకూ ఉరిశిక్ష విధించగా సుప్రీంకోర్టు అందులో 19 మందిని నిర్దోషులుగా ప్రకటించి, మిగిలిన ఏడుగురిని దోషులుగా గుర్తించింది. వారిలో ముగ్గురికి యావజ్జీవ ఖైదు శిక్ష చాలుననీ, మిగిలిన నలుగురినీ ఉరి తీయాలనీ తీర్పు ఇచ్చింది.

అయితే ఆ నలుగురిని మాత్రం ఎందుకు ఉరి తీయాలి?

హత్యానేరానికి మరణదండన ఒకానొక శిక్ష మాత్రమే. చంపిన వాళ్ళందరూ చట్టం చేతిలో చావవలసిందేనని ఎక్కడా లేదు. మరి ఈ నలుగురినీ చట్టం చంపవలసిందేనని సుప్రీంకోర్టు ఎందుకు భావించింది?

దీనికి మన సుప్రీంకోర్టు నిర్ణయించిన ప్రమాణం ఒకటుంది. హత్యానేరానికి ఖైదు మాత్రమే (జీవిత ఖైదు కావచ్చు, అంతకంటే తక్కువ కావచ్చు.) సాధారణంగా వేయవలసిన శిక్ష అనీ, అత్యంత అరుదయిన (అరుదయిన వాటిలోకీ అరుదయిన) ఘటనలలో మాత్రమే మరణదండన విధించాలి అనీ ఆ ప్రమాణం చెపుతుంది.

మరి శ్రీపెరుంబుదూర్ ఘటన అటువంటి అత్యంత అరుదయిన ఘటనల కోవలోకి వస్తుందని సుప్రీంకోర్టు భావించడానికి గల కారణం ఏమిటి? ఉదాహరణకు బిల్లా, రంగాలను ఉరితీసినప్పుడు వాళ్ళు నిస్సహాయులయిన పసి పిల్లలను చంపారు కాబట్టి వారి నేరం మరణదండనకు అర్హమయిన అరుదయిన ఘటన అని కోర్టు భావించడంలో ఒక తర్కమైనా ఉంది. శ్రీపెరుంబుదూర్ ఘటన ఒక రాజకీయ హత్య. భారత ప్రభుత్వం తమిళ ఈలం రాజకీయాల పట్ల అనుసరించిన అవకాశవాద విధానం దానికి నేపథ్యం. మొదట్లో 'ఈలం' రాజకీయాలను భారత పాలకులు సానుభూతితో చూశారు. ఎల్.టి.టి.ఇ.కి మన తమిళ భూభాగంలో మన సైన్యమే శిక్షణ ఇచ్చింది. ఈ సంస్థ ఇవాళ ప్రపంచంలోనే అత్యంత నైపుణ్యం గల మిలిటెంట్ సంస్థగా గుర్తింపు పొందిందంటే ఆ ఘనతలో భారత సైన్యానికి కూడా ఒక పాలు ఉంది. కానీ ఆ తర్వాత భారత ప్రభుత్వం అకస్మాత్తుగా తన విధానాన్ని మార్చుకుంది. శ్రీలంక

ప్రభుత్వానికి సన్నిహితమై, శాంతిస్థాపన కోసమని చెప్పి భారత సైన్యాన్ని ఆ దేశానికి పంపించింది. ఏ పేరు చెప్పుకున్నా సైన్యం చేసేది యుద్ధమే కాబట్టి అది భారత సైన్యానికీ ఎల్.టి.టి.ఇ. వంటి తమిళ ఈలం పోరాట సంస్థలకూ మధ్య యుద్ధంగా మారింది. ఫలితంగా చాలామంది శ్రీలంక తమిళులు భారత సైనికుల చేతిలో చిత్రహింసలు అనుభవించారు. ప్రాణాలు కోల్పోయారు. భారత ప్రభుత్వం తమను నమ్మించి మోసం చేసిందన్న భావన శ్రీలంక తమిళులలో బలంగా ఉంది. దీనికి రాజీవ్‌గాంధీ బాధ్యుడన్న అభిప్రాయమూ ఉంది.

శ్రీపెరుంబుదూర్ హత్య ఈ నేపథ్యంలో జరిగింది. భారత ప్రభుత్వం అనుసరించిన వైఖరి ఉచితమా, అనుచితమా, దానికి అప్పటి ప్రధానమంత్రిని బాధ్యునిగా భావించడం సబబా అన్న ప్రశ్నలు అటుంచి, ఆ ఘటన రాజకీయ ఘటన అనడంలో సందేహమేమీ లేదు. బలహీనులనో, నిస్సహాయులనో బలవంతులు హతమార్చిన ఘటనలతో పోల్చదగినది కాదు. వాటి సరసన దీనిని కూడా మరణదండనకు అర్హమయిన నేరంగా చూసేట్లయితే మన దేశంలో అసంఖ్యాకంగా జరిగే రాజకీయ హత్యలన్నింటినీ అదే గాటన కట్టి చూడవలసి ఉంటుంది. కానీ ఇప్పటివరకూ న్యాయస్థానాలు రాజకీయ హత్యలను ఆ విధంగా చూడడం లేదు.

అయితే మొన్నటి తీర్పులో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ఉరిశిక్షను సమర్థించడానికి రాజీవ్‌గాంధీ 'భారత ప్రజలకు ప్రీతిపాత్రుడయిన నాయకుడు' అన్న వ్యాఖ్య చేశారు. ప్రజలు ప్రేమించే ఒక నాయకుడిని దారుణంగా బాంబులతో చంపిన ఘటనగా అది 'అరుదయిన వాటిలోకీ అరుదయిన' కోవలోకి వచ్చినట్టయింది.

ఇది సందేహాస్పదమైన వ్యాఖ్య. రాజీవ్‌గాంధీ మంచి నాయకుడా కాదా అన్నది కాదిక్కడ ప్రశ్న. అతను ప్రజల ప్రియతమ నాయకుడన్న నిర్ణయానికి ఒక న్యాయస్థానం ఏ విధంగా వస్తుందనేది ప్రశ్న. న్యాయస్థానాలు తమ ఎదుట నమోదయిన సాక్ష్యాన్ని లెక్కలోకి తీసుకుంటాయి. అది సరయిన పద్ధతిలో రుజువయినట్టయితే దానిని సత్యమని నమ్ముతాయి. ఈ విధంగా నమోదయిన సాక్ష్యాలే కాక కొన్ని సాధారణ సత్యాలను కూడా న్యాయస్థానాలు లెక్కలోకి తీసుకుంటాయి. (ఉదాహరణకు శ్రీలంక ప్రభుత్వానికీ, తమిళ పోరాటకారులకూ మధ్య 'ఈలం' గురించి ఘర్షణ జరుగుతున్నదనేది న్యాయస్థానాలు లెక్కలోకి తీసుకునే ఒక సాధారణ సత్యం).

రాజీవ్‌గాంధీ ప్రజల ప్రియతమ నాయకుడనే అభిప్రాయం శ్రీపెరుంబుదూర్ కేసులో రుజువయిన సాక్ష్యమూ కాదు. ఒక సాధారణ సత్యమూ కాదు. మరి దానిని ఆధారం చేసుకుని ఆ ఘటన మరణ శిక్ష వేయగల అరుదయిన ఘటన అని ఎలా నిర్ధారించారు?

ఇంకొక విషయం కూడా ఉంది. ఈ నలుగురిలో ఏ ఒక్కరూ (ప్రాసిక్యూషన్ కేసు ప్రకారం సహితం) బాంబు పేల్చడంలో ప్రత్యక్షంగా పాల్గొనలేదు. నలుగురి మీది అభియోగమూ వారు కుట్రదారులనే. కానీ భారత న్యాయశాస్త్రంలో కుట్ర అనే నేరం ప్రత్యక్ష సాక్ష్యాల ద్వారా రుజువు కాదు. పరోక్ష సాక్ష్యాల ద్వారా మాత్రమే రుజువవుతుంది. అటువంటి నేరానికి అత్యధిక శిక్ష అయిన మరణ దండన వేయడం సబబా? ఎందుకంటే పరోక్ష సాక్ష్యం ద్వారా జరిగే నేర నిర్ధారణలో ఎంతో కొంత అనుమానం ఎప్పుడూ మిగిలే ఉంటుంది. అటువంటి సాక్ష్యం ఆధారంగా శిక్ష వేయనే కూడదని కాదు కానీ ఉరిశిక్ష వేయడం తగదు. ఉరి అనేది వెనక్కి తీసుకునే వీలులేని శిక్ష.

మరొక విషయం. ఇప్పుడు ఉరిశిక్ష ఖరారయిన నలుగురిలో ఇద్దరు (నళిని, మురుగన్) భార్యాభర్తలు. ఇద్దరినీ ఉరితీస్తే వారి కుమార్తె అనాథ అవుతుంది కాబట్టి తల్లి అయిన నళినికి ఉరిశిక్ష బదులు జీవిత ఖైదు విధించడం ఉచితంగా ఉంటుందని ముగ్గురు జడ్జీలలో ఒకరయిన జస్టిస్ థామస్ భావించారు. కానీ మిగిలిన ఇద్దరు జడ్జీలు అంగీకరించకపోవడంతో ఆమెకు కూడా ఉరిశిక్షే ఖరారయింది.

చట్టం ప్రకారం న్యాయమూర్తులు చేయవలసిన నిర్ణయాలలో ఇటువంటి 'సెంటిమెంట్'లకు చోటు ఉంటుందా అని సందేహించవచ్చు. ఉంటుంది. ఉంటుందని మానవ హక్కుల ఉద్యమకారులు చెప్పడం కాదు. దాదాపు 140 ఏళ్ళ కింద రాసిన భారత శిక్షాస్మృతే చెపుతుంది. ఆ స్మృతిలో ఏ నేరానికీ కచ్చితంగా ఫలానా శిక్ష వేయాలని లేదు. అన్ని నేరాలకూ ఒక గరిష్ఠ శిక్ష మాత్రమే ఉంటుంది. కొన్ని నేరాలకు కనిష్ఠ శిక్ష కూడా ఉంటుంది. కానీ ఎక్కువ భాగం గరిష్ఠ శిక్ష మాత్రమే ఉంటుంది. నేరాన్ని విచారించే న్యాయమూర్తి గరిష్ఠ శిక్షయినా వేయవచ్చు. అంతకంటే తక్కువ ఎంతయినా వేయవచ్చు.

ఈ నిర్ణయం చేయడంలో చట్టంలో మామూలుగా చోటు ఉండని సామాజిక, నైతిక విలువలకూ, దయ, సానుభూతి మొదలయిన 'సెంటిమెంట్'లకూ చోటు

ఉంటుంది. ఈ చోటు చట్టంలో ఉద్దేశపూర్వకంగానే కల్పించబడింది. నేరస్మృతిలో మామూలుగా సామాజిక అవగాహనకూ నైతిక విలువలకూ పెద్దగా స్థానం ఉండదు. ఒళ్ళు బలిసి చేసినా, గతిలేక చేసినా నేరం నేరమేనని చట్టం అంటుంది. లాభం కోసం చంపినా, తమకు జరిగిన అన్యాయానికి ఆగ్రహించి చంపినా అది హత్యేనంటుంది. రుజువంటూ అయితే అదయినా ఇదయినా నేరమే. చట్టానికుండే ఈ వైఖరి వల్ల గతిలేని పరిస్థితులలో నేరం చేసేవాళ్ళు కూడా ఒళ్ళు బలిసి నేరం చేసేవాళ్ళతోపాటు ఒకే సెక్షన్లకింద విచారణ ఎదుర్కొంటారు. కానీ ఇది నేరం రుజువయ్యేంతవరకే. శిక్ష పరిమాణం నిర్ణయించేటప్పుడు మాత్రం వీటిని లెక్కలోకి తీసుకుని ఎంత శిక్ష తగునో నిర్ణయించే అవకాశం న్యాయమూర్తికి ఇవ్వబడింది.

ఆ రకంగా చూసినప్పుడు బిడ్డ యోగక్షేమాలను దృష్టిలో ఉంచుకుని తల్లిదండ్రులిద్దరినీ ఉరితీయడం న్యాయం కాదనీ, కనీసం తల్లి శిక్ష తగ్గించాలనీ జస్టిస్ థామస్ భావించడం సబబే. ఇతర న్యాయమూర్తులు ఆయనతో అంగీకరించలేకపోవడం విచారకరం.

అయినప్పటికీ రాజ్యాంగంలో మరొక అవకాశం ఉంది. న్యాయస్థానాలు చట్టాన్ని అమలు చేసేటప్పుడు నేరానికుండే సామాజిక, నైతిక కోణాలను పూర్తిగా లెక్కలోనికి తీసుకోలేకపోవచ్చు. కాబట్టే న్యాయస్థానం వేసిన ఏ శిక్షనయినా ఎంతమేరకయినా తగ్గించడానికి రాజ్యాంగం రాష్ట్ర గవర్నర్‌కూ దేశ రాష్ట్రపతికీ అధికారం ఇచ్చింది. రుజువయిన నేరాన్ని రుజువు కాలేదని వారు అనలేరు. నేరం రుజువయినదీ లేనిదీ తేల్చే పని కేవలం న్యాయస్థానాలదే. అది వేరే ఎవ్వరూ చేయలేరు. కానీ రుజువయిన నేరానికి న్యాయస్థానం వేసిన శిక్షను ఏ మేరకయినా తగ్గించే అధికారం మాత్రం గవర్నర్‌కూ, రాష్ట్రపతికీ ఉంటుంది. ఈ అవకాశం రాజకీయ ఒత్తిడుల వల్ల ఎక్కువ భాగం దుర్వినియోగం అవుతుందనేది వాస్తవమే కానీ, చట్టానికి లేని సామాజిక స్పృహను కనీసం ఈ రూపంలోనయినా అమలు చేసే అవకాశం కల్పించే ఈ రాజ్యాంగ అధికారం సూత్రప్రాయంగా సరయినదే.

కాబట్టి తమిళనాడు గవర్నర్, దేశ రాష్ట్రపతి తమ విచక్షణ పాటించి ఆ నలుగురికీ వేసిన మరణదండన ఎంతవరకూ సబబని నిర్ణయించవలసి ఉంది. క్షమాభిక్ష కోసం అర్జీ ఎవరో ఒకరు పెట్టకమానరు. వాటిమీద సరయిన నిర్ణయం తీసుకుంటారని ఆశిద్దాం.

ఎల్.టి.టి.ఇ. చేయించిన ఈ హత్యలో కుట్రదారులయిన వారికి ఉరిశిక్ష వేయవలసిందేనని ఇక్కడ న్యాయస్థానాల లోపలా బయటా చాలామంది

వాదిస్తున్నారు. కానీ ఎల్.టి.టి.ఇ. ఒక యుద్ధమే నడుపుతున్న శ్రీలంకలో అసలు ఉరిశిక్ష లేదు. ఈ నేరమే శ్రీలంకలో జరిగి ఉంటే దానికి ఉరిశిక్ష పడే అవకాశం లేదు. ఎల్.టి.టి.ఇ నడుపుతున్న 'ఈలం' పోరాటంలాగే బ్రిటన్‌లోని ఐర్లాండ్‌లోనూ సాయుధ పోరాటం నడుస్తున్నది. దానిని అణిచివేయడానికి బ్రిటిష్ ప్రభుత్వం అనేక అక్రమాలకు పాల్పడుతున్నది కానీ బ్రిటిష్ నేర స్మృతిలోనూ ఉరిశిక్ష లేదు.

ప్రపంచంలో ఏ దేశానికీ లేని ప్రత్యేకమైన పరిస్థితులేవో మనకున్నాయని మనం అనుకుని మన చట్టంలో ఉరిశిక్ష కొనసాగించవలసిన అవసరం లేదు. చావుకు చావే ప్రతీకారం అన్న అనాగరిక సూత్రానికి చట్టం, న్యాయనిర్ణయం అనే నాగరికమైన రంగులు పూయనవసరం లేదు.

**27 మే 1999, ఆంధ్రప్రభ దినపత్రిక**

# మరణశిక్ష రద్దుకై ఉద్యమిద్దాం

"హత్యలను గానీ రేప్‌ను గానీ వేరే ఏ నేరాన్ని గానీ తక్కువ చేసి చూడడం మా ఉద్దేశ్యం కాదు. మనిషి ప్రాణాన్ని న్యాయం పేరిట తీసేసే శిక్షాస్మృతి ఒక నాగరిక సమాజంలో ఉండదగినదా అన్నదే ప్రశ్న. మనుషులు తెలిసో తెలియకో ఆవేశంలోనో ఉద్విగ్నత వల్లనో కక్షలవల్లనో పగ వల్లనో ప్రాణాలు తీస్తారు. అన్ని కోణాలూ పరిశీలించి స్థిమితంగా ఆలోచించవలసిన చట్టం సహితం న్యాయం పేరిట ప్రాణాలు తీయవచ్చునా?"

ప్రపంచంలోని అతిపెద్ద దేశాలలో ఒకటయిన మన దేశం ప్రపంచ దేశాలకు సంబంధించిన ఏ వార్తలోనయినా కనిపించడం సహజం. కనిపించకపోతే ఎక్కడో ఏదో తీవ్రమైన లోపం ఉందనో, జరిగిందనో అనుకోవలసి ఉంటుంది.

అంతర్జాతీయ మానవహక్కుల ప్రకటన వెలువడి 50 సంవత్సరాలు గడిచిన సందర్భంలో ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఈ సంవత్సరం మే నెలలో మరణదండన గురించి ఒక రిపోర్టు ప్రచురించింది. మరణదండన రద్దు విషయంలో ప్రపంచవ్యాప్తంగా ఈ మధ్యకాలంలో జరిగిన పరిణామాలను అందులో చర్చించింది.

మరణదండనను మొత్తంగా నేరస్మృతి నుండి కొత్తగా తొలగించిన దేశాల గురించి;

మరణదండనను చట్టం నుండి తొలగించకున్నా ప్రభుత్వ విధానంగా మరణదండనపైన నిషేధం పెట్టిన దేశాల గురించి;

మరణ దండన విధించగల నేరాలను తగ్గించిన దేశాల గురించి;

గతంలో కొన్ని కేసులలో విధించిన మరణదండనను పునఃపరిశీలించి ఆనాటి దండన తప్పని అభిప్రాయపడిన ఉదంతాల గురించి.

ఆ ప్రచురణలో ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ చర్చించింది. ఎప్పటికైనా ప్రపంచవ్యాప్తంగా మరణదండన రద్దయ్యే పోకడ ఏమైనా సమకాలీన ఘటనలలో కనిపిస్తున్నదా అని విశ్లేషించింది. కొంత ఆశాభావాన్ని వ్యక్తం చేసింది.

కానీ ఆ ప్రచురణలో ఎక్కడా భారతదేశం పేరు గానీ ప్రస్తావన గానీ లేదు. ఇది మనం దేశభక్తితో ఆవేశపడవలసిన విషయం కాదు. మరణదండన రద్దు కోసం ఎదురు చూసేవారు భారతదేశం నుండి పొందగల ఉత్తేజమేమీ లేదు. మరణదండనను రద్దు చేయవలసిన అవసరం లేదని మొండిగా వాదిస్తున్న పెద్ద దేశాలలో మనదొకటి. మన తోటిది అమెరికా. (అందరి కంటే ఎక్కువగా మరణదండన విధించే చైనా ఈ సంవాదంలో అసలే పాల్గొనదు. ఏ సంవత్సరంలోనయినా తక్కిన అన్ని దేశాలూ కలిసి ఎంతమందికి మరణదండన అమలు చేస్తాయో ఒక్క చైనాయే అంతకంటే ఎక్కువ మంది ప్రాణాలను న్యాయం పేరిట తీసేస్తుంది. కాబట్టి ఈ సంవాదంలో పాల్గొనటానికి సహితం చైనాకు ముఖం చెల్లదు.)

మన వైఖరి వల్ల మనం ప్రపంచ దేశాలలో మైనారిటీలో ఉన్నాం. మంచి కోసం మైనారిటీలో ఉంటే తప్పు లేదు. గర్వించవచ్చు కూడ. కానీ ఒక అనాగరికమైన సంప్రదాయాన్ని మొండిగా కొనసాగిస్తున్న మైనారిటీలో ఉండడంలో గర్వించేది ఏమీ లేకపోగా అది సిగ్గు పడవలసిన విషయం.

ఏవో బాగా అభివృద్ధి చెందిన దేశాలు మరణదండనను రద్దు చేయగలవు గానీ మనబోటి వెనుకబడిన దేశాలకు అది ఆచరణ యోగ్యం కాని ఆదర్శం అని భావించేవాళ్ళు చాలామంది ఉన్నారు. మనబోటి దేశాలలో నేరాలు, రాజకీయ తీవ్రవాదం, టెర్రరిజం హెచ్చుస్థాయిలో ఉంటాయి కాబట్టి 'గట్టి శిక్షలు' అవసరం అని వీరు నమ్ముతారు. కానీ నిజానికి ప్రపంచంలోని అత్యంత అభివృద్ధి చెందిన దేశమైన అమెరికా మనతో సమానంగా చాలా మొండిగా మరణదండన ఉండవలసిందేనని అంటున్నది. ఇటువైపు భారత్‌తో సమానంగా వెనుకబడిన దేశాలనేకం మరణదండనను రద్దు చేసాయి.

మరణదండన రద్దు చేసిన దేశాల జాబితాలో 1998లో తొలిసారి చేరిన దేశాలలో మన పొరుగు దేశమైన నేపాల్ ఒకటి. మరొకటి మధ్యఆసియా దేశమైన అజర్‌బైజాన్. చట్టంలో మరణదండన కొనసాగుతున్నా ఆచరణలో దాని అమలుపైన నిషేధం పెట్టిన దేశాల జాబితాలో మరొక రెండు మధ్యఆసియా దేశాలున్నాయి. అవి తుర్క్‌మెనిస్తాన్, కిర్గిజ్‌స్తాన్.

మధ్యఆసియా దేశాలు మన అంత పేదదేశాలు కాకపోయినా అనేక సమస్యలు, సంక్షోభాలు ఉన్న దేశాలే. అయితే ఈ సమస్యలను ఎదుర్కొనడానికి మనుష్యుల్ని ఉరితీసే అధికారం రాజ్యం చేతిలో ఉండడం అవసరం అని ఆ దేశాలు భావించడం లేదు. అదే వాటికీ మనకూ తేడా.

మధ్యఆసియా దేశాల కంటే కూడ పేదరికంలోనూ వెనకబాటుతనంలోనూ అల్లర్లలోనూ అలజడులలోనూ మనతో పోల్చదగినవి ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలు. అయితే ఆఫ్రికాకు చెందిన నమీబియా, మొజాంబిక్ దేశాలూ, లాటిన్ అమెరికాకు చెందిన అనేక దేశాలూ (బ్రెజిల్, పనామా, వెనిజులా, ఉరుగ్వే, కొలంబియా, కోస్తారికా, ఈక్వడార్) కేవలం యుద్ధ సమయంలో తప్ప ఇంకెప్పుడూ మరణదండన విధించకూడదని చెప్పే అంతర్జాతీయ లేక ప్రాంతీయ ఒప్పందాల పైన సంతకం చేసిన దేశాల జాబితాలో ఉన్నాయి.

తూర్పు యూరప్‌లో గడిచిన దశాబ్ద కాలంలో వచ్చిన పెనుమార్పుల ఫలితంగా కొత్తగా బహుళ పార్టీ వ్యవస్థనూ రాజకీయ ప్రజాస్వామ్యాన్నీ ప్రవేశపెట్టి

ఆర్థిక వ్యవస్థలో లోతయిన మార్పులు తీసుకొచ్చి కొత్త కొత్త సమస్యలు ఎదుర్కొంటున్న బల్గేరియా, రుమేనియా, జెకస్లోవేకియా, ఎస్టోనియా వంటి దేశాలు సహితం ఇటువంటి ఒడంబడికలపైన సంతకం చేసి ఉన్నాయి.

ఈ దేశాలకు లేని సమస్యలేవీ మనకు లేవు. వాటికి మరణదండన పరిష్కారం కాదని మాత్రం మనం గుర్తించలేకపోతున్నాం.

ఒక్క వాక్యంలో చెప్పాలంటే 1998 చివరినాటికి 68 దేశాలు మరణదండనను సంపూర్ణంగా రద్దు చేయగా అమలు చేయని 37 దేశాలతో కలుపుకొని మొత్తం 105 దేశాలు మరణదండనను అమలు చేయటం మానేసాయి. అమలు చేస్తున్న దేశాల సంఖ్య 89. ఈ 89లో మనమూ ఉన్నాం. పైగా ఇప్పుడు ఉరిశిక్ష వేస్తున్న నేరాలకే కాక రేప్ వంటి మరికొన్ని నేరాలకు కూడా ఉరిశిక్ష విధించాలని అద్వానీ నుండి చంద్రబాబునాయుడు దాకా ఈ దేశాన్ని ఏలుతున్న నాయకులు ప్రకటనలిస్తున్నారు.

హత్యలను గానీ రేప్‌ను గానీ వేరే ఏ నేరాన్ని గానీ తక్కువ చేసి చూడడం మా ఉద్దేశ్యం కాదు. మనిషి ప్రాణాన్ని న్యాయం పేరిట తీసేసే శిక్షాస్మృతి ఒక నాగరిక సమాజంలో ఉండదగినదా అన్నదే ప్రశ్న. మనుషులు తెలిసో తెలియకో ఆవేశంలోనో ఉద్విగ్నత వల్లనో కక్షలవల్లనో పగ వల్లనో ప్రాణాలు తీస్తారు. అన్ని కోణాలూ పరిశీలించి స్థిమితంగా ఆలోచించవలసిన చట్టం సహితం న్యాయం పేరిట ప్రాణాలు తీయవచ్చునా?

మరణదండన వంటి కఠినమైన శిక్షలు లేకుంటే నేరాలు అదుపు చేయటం సాధ్యం కాదని నమ్మేవారున్నారు. నేరాలను అరికట్టడానికి – ముఖ్యంగా హత్యానేరాన్ని అరికట్టడానికి – ఉరిశిక్ష అవసరమని వారు నమ్ముతారు. ఇది రుజువు చేయవలసిన అవసరం లేని కామన్‌సెన్స్ సత్యంగా చలామణి అవుతున్నది. కానీ నిజానికి నేరాలను అదుపు చేయడంలో క్రూరమైన శిక్షలకుండే పాత్ర చాలా స్వల్పమేనని అన్ని పరిశోధనలూ తెలుపుతున్నాయి.

కేరళ రాష్ట్రంలోని తిరువాన్కూరు – కొచ్చిన్ రాజ్యంలో స్వాతంత్రానికి పూర్వం మరణదండన లేదు. 1951 నుండి పునరుద్ధరించబడింది. 1945–50 కాలంలో ఆ ప్రాంతంలో 962 హత్యలు జరుగగా 1951–56 కాలంలో 967 హత్యలు జరిగాయి. అంటే ఉరిశిక్షను ప్రవేశపెట్టడం వల్ల హత్యలేమీ తగ్గలేదు.

ఒక్క కేరళలోనే కాదు, మరణదండనను ఏదో ఒక దశలో రద్దు చేసిన ప్రతీ దేశంలోనూ ఈ చిత్రమే కనిపిస్తుంది. నేరాలు జరగడానికి గల కారణాలు సమాజంలోనూ మానవ జీవితంలోనూ అనేకం ఉంటాయి. నేరాలను అదుపు చేయడానికి ఆయా రంగాలలో కృషి చేయవలసి ఉంటుంది. ఇదంతా విడిచిపెట్టి శిక్షల కాఠిన్యాన్ని గురించి మాత్రమే చర్చ పెట్టడం ఈ కర్తవ్యాన్ని తప్పించుకోవడానికి తప్ప ఇంకెందుకూ పనికిరాదు. దాని వల్ల శిక్షాస్మృతి క్రూరంగా అనాగరికంగా తయారవుతుందే తప్ప ఏ సమస్యా పరిష్కారం కాదు.

చివరిగా, న్యాయస్థానాలు చేసే నేర నిర్ధారణలో ఏ తప్పుకూ ఆస్కారం లేదనుకుంటేనే మరణదండనను సమర్థించడం సబబవుతుంది. ఎందుకంటే తప్పు ఉన్నట్టయితే పోయిన ప్రాణాన్ని వెనక్కి తీసుకురావడం సాధ్యం కాదు కాబట్టి. ఖైదులో ఉన్న మనిషినయితే విడుదల చేయొచ్చు. వేసిన శిక్షకు నష్టపరిహారమైనా ఇయ్యవచ్చు.

ఇంగ్లండ్‌లో ఈ మధ్య ఒక క్రిమినల్ కేసెస్ రివ్యూ కమిషన్‌ను నెలకొల్పారు. గతంలో మరణదండన విధించిన కేసులను సహితం ఈ కమిషన్‌కు పునఃపరిశీలన నిమిత్తం అప్పగించారు. రెండు కేసులలో నేర నిర్ధారణ తప్పుగా జరిగిందనీ వారికి మరణదండన విధించి ఉండకూడదనీ ఈ కమిషన్ భావించింది. ఒకరు 1952 లో మరణదండన విధించబడిన మహ్మద్‌హుసేన్ మట్టన్, రెండవ వ్యక్తి 1953లో మరణదండన విధించబడిన డెరెక్ బెంట్లీ. పోయిన ఈ ప్రాణాలను వెనక్కి తీసుకురాలేని న్యాయవ్యవస్థకు ప్రాణాలు తీసే హక్కు ఉందా? ఇంగ్లాండ్ మరణశిక్షను రద్దు చేసి ఈ సందేహాన్ని నివృత్తి చేసుకుంది. మరి మన సంగతి?

మన దేశంలో అటువంటి కమిషన్ ఏదీ నియమించడం జరగలేదు గానీ నియమిస్తే ఇందిరాగాంధీ హత్యకేసులో ఉరితీసిన కేహార్‌సింగ్ విషయంలో అన్యాయం జరిగిందన్న అభిప్రాయానికి రాకతప్పదు.

రేపు రాజీవ్‌గాంధీ హత్యకేసులోనూ ఇదే జరగనుందా? ఆ కేసులో చెన్నైలోని టాడా స్పెషల్ కోర్టు 26 మంది ముద్దాయిలకూ మరణశిక్ష విధించగా సుప్రీంకోర్టు నలుగురికి మాత్రం ఉరిశిక్ష ఖరారు చేసిన సంగతి తెలిసిందే. కానీ ఈ తీర్పు మీద కూడా అనేక సందేహాలున్నాయి.

అది రాజీవ్‌గాంధీ మీద ప్రతీకార భావంతో చేసిన నేరమే తప్ప సాధారణ ప్రజలను భయభ్రాంతులు చేసే ఉద్దేశ్యంగానీ భారత ప్రభుత్వాన్ని లోబరచుకునే ఉద్దేశ్యంగానీ ఆ చర్యలో లేవనీ, అందువల్ల అది 'టెర్రరిస్టు' నేరం కాదనీ సుప్రీంకోర్టు అనింది. అంటే టాడా కింద విచారించిన ఆ కేసు నిజానికి టాడా కిందికి రాదని అర్థం.

అయినప్పటికీ టాడా చట్టం కింద పోలీసులు నమోదు చేసిన ఒప్పుకోళ్ళను సాక్ష్యంగా స్వీకరించవచ్చునని భావించి వాటిని ఆధారం చేసుకొని ఈ శిక్షలు వేసింది.

ఇది సబబేనా? అనేది ఒక ప్రశ్న.

ఈ ఒప్పుకోలు సాక్ష్యాన్ని మదింపు వేసేటప్పుడు కూడా గతంలో సుప్రీంకోర్టు సూచించిన ప్రమాణాలేవీ ఈ కేసులో సుప్రీంకోర్టు లెక్కలోకి తీసుకోలేదు.

అటువంటి తీర్పు చెల్లుతుందా?

ఈ రకమైన అనుమానాలకు తావు ఇచ్చే తీర్పు ఆధారంగా నలుగురి ప్రాణాలు తీయడం సబబా? రేపెప్పుడైనా ఈ అనుమానాలు సహేతుకమైనవేనని సుప్రీంకోర్టు భావించవచ్చు. ప్రస్తుత తీర్పు ఇచ్చిన జడ్జిలు సహితం భావించవచ్చు. కానీ అప్పుడు నివృత్తి చేసుకోవడానికి ఏ మార్గముంటుంది?

కాబట్టి ఏ రకంగా చూసినా సమర్థనీయం కాని మరణదండన పూర్తి రద్దుకై ఉద్యమించవలసిన అవసరం ఉంది. 1948 నాటికి కేవలం 8 దేశాలు మరణశిక్షను రద్దు చేసి ఉన్నాయి. ఇప్పుడు ప్రపంచంలోని మెజారిటీ దేశాలు మరణశిక్ష ఉపయోగించడం మానేసాయి. మనమింకా ఈ విషయంలో వెనుకబడి ఉండవలసిన అవసరం లేదు.

**మానవహక్కుల వేదిక కరపత్రం**
**18 ఆగస్టు 1999**

# రాజీవ్‌గాంధీ హత్య కేసు ముద్దాయిల ఉరిశిక్షను ఖైదుగా మార్చమని ఉద్యమిద్దాం

"ఏ నేరానికైనా ఒక సామాజిక నేపథ్యం ఉంటుంది. దానిని అర్థం చేసుకున్నప్పుడే నేరం చేసిన వారికి ఎంత శిక్ష వేయడం సబబన్న ప్రశ్నకు జవాబు దొరుకుతుంది. కేవలం కండకావరంతోను బలవంతులమన్న అహంకారంతోను స్వార్థంతోను చేసే నేరాలుంటాయి. సామాజిక ఆర్థిక ఒత్తిడుల కారణంగా చేసే నేరాలుంటాయి. తమకు, లేక తాము మమేకం చెందే ప్రజలకు అన్యాయం జరిగిందన్న ఆగ్రహంతో జరిగే నేరాలుంటాయి. నేరం ఒకటే అయినంత మాత్రాన ఈ కారణాలలో ఏది వర్తిస్తుందని చూడకుండ కఠినంగా శిక్షించవలసిందేనని అనడం అనుచితం."

రాజీవ్ గాంధీ హత్యకేసులో నలుగురికి ఉరిశిక్ష ఖరారయింది. ఆ నలుగురు నళిని, శంతన్, మురుగన్, అరివు.

కింది కోర్టు (చెన్నైలోని టాడా స్పెషల్ కోర్టు) 26 మంది ముద్దాయిలకు ఉరిశిక్ష విధించినపుడు ఇది 'జుడీషియల్ మర్డర్' అని వారి తరఫున సుప్రీంకోర్టులో వాదించిన న్యాయవాది అన్నాడు. అవునని సుప్రీంకోర్టు కూడ ఒప్పుకుంది. ఒప్పుకొని 26లో నలుగురికి మాత్రం ఉరిశిక్ష విధించడం సబబని నిర్ణయించింది. ఆ నిర్ణయాన్ని పునఃపరిశీలించమని ఆ నలుగురు పెట్టుకొన్న రివ్యూ పిటిషన్‌ను సుప్రీంకోర్టు ఇప్పుడు కొట్టేసింది.

ఇది కూడా జుడీషియల్ మర్డరేనని మేము అంటున్నాం.

హత్యలను గానీ వేరే ఏ నేరాన్నిగానీ తక్కువ చేసి చూడడం మా ఉద్దేశ్యం కాదు. మేమంటున్నది మనిషి ప్రాణాన్ని న్యాయం పేరిట తీసే శిక్షాస్మృతి ఒక నాగరిక సమాజంలో ఉండకూడదని మాత్రమే. మరణశిక్ష అనేది పథకం ప్రకారం చేసే హత్యల్లో అత్యంత క్రూరమైనది. 'కంటికి కన్ను పంటికి పన్ను' అనే అమానుష సిద్ధాంతానికి నాగరిక సమాజంలో తావుండకూడదు. మరణశిక్ష 'జీవించే హక్కు'కు వ్యతిరేకం. అది అంతర్జాతీయ మానవ హక్కుల ప్రకటన నిషేధించిన అమానుష శిక్షా పద్ధతి.

## ఎందుకిది జుడీషియల్ మర్డర్ అంటున్నాం?

మరణదండన భారతరాజ్యాంగం ప్రకారం చెల్లుతుందా చెల్లదా అనే విషయంపై సుప్రీంకోర్టులో చాలాసార్లు వాదోపవాదాలు జరిగాయి. ఇప్పటికీ ఈ చర్చ అయిపోలేదు. ప్రస్తుతం అమలులో వున్న సుప్రీంకోర్టు అభిప్రాయం ఏమిటంటే, హత్యకేసులలో మరణదండన సులభంగా వేయకూడదు. అరుదయిన వాటిలోకీ అరుదయిన కేసులలో మాత్రమే వేయాలని.

మరి ఈ నలుగురిలో ఏ ఒక్కరూ రాజీవ్ గాంధీ హత్యలో ప్రధాన సూత్రధారులు కారు (ఎవరికైనా మరణశిక్ష వేయకూడదనేది మా వాదన). ప్రాసిక్యూషన్ అభియోగం ప్రకారం ప్రధాన సూత్రధారులు శ్రీలంకకు చెందిన ఎల్‌టిటిఇ నాయకులు ప్రభాకరన్, పొట్టు అమ్మన్, అఖిల. ఆ ముగ్గురూ మన పోలీసులకు దొరకలేదు. బహుశా దొరకరు.

ఈ నలుగురిలో ఏ ఒక్కరూ హత్యాకాండలో ప్రత్యక్ష పాత్రధారులు కూడా కారు. ప్రత్యక్ష పాత్రధారులు థాను, శుభ, శివరాసన్. థాను 'మానవబాంబు'

అయి రాజీవ్‌గాంధీతో బాటు తాను కూడ చనిపోయింది. శుభ, శివరాసన్ ఆ తరువాత ఆత్మహత్య చేసుకున్నారు.

ఈ నలుగురిలో ఒక్క నళిని తప్ప మిగిలిన వాళ్ళు హత్యాకాండ జరిగిన స్థలంలో సహితం లేరు. అంతకు ముందు రకరకాల రూపాలలో సహకరించారన్నదే వారిపైన అభియోగం. నళినికి కూడ ఆరోజు దాకా రాజీవ్‌గాంధీని హత్య చేసే పథకం సంగతి తెలీదు. ఆమె ఎల్‌టిటిఇ అభిమానిగా వారితో కలిసి తిరుగుతున్నది. వారి తక్షణ లక్ష్యమేమిటో ఆమెకు తెలీదు. ఆరోజు శివరాసన్ థానుకు తోడు రమ్మని ఆమెను తీసుకుపోయాడు. ఆమె అంతకంటే చేసిందేమీ లేదు.

నిజానికి రాజీవ్‌గాంధీ హత్యకేసులో సిబిఐ గుర్తించిన 41 మంది ముద్దాయిలలో ముగ్గురు శ్రీలంకలోనో, మరెక్కడో ఉండగా, శుభ, శివరాసన్‌లతో సహా మరొక 12 మంది నేర విచారణ ప్రారంభం కాకముందే ఆత్మహత్య చేసుకొని చనిపోయారు. 'ప్రాణం తీసినవారు ప్రాణం కోల్పోవలసిందే'ననుకున్నా ఆ ప్రతీకారం జరిగిపోయింది. మిగిలిన 26 మంది ఆ హత్యాకాండలో ఏమంత ప్రధానపాత్ర లేనివారు. వారిని కూడ ఉరి తీయవలసిందేనా?

## అది టెర్రరిస్టు నేరం కాదని సుప్రీంకోర్టు అనింది

రాజీవ్‌గాంధీ హత్య టెర్రరిస్టు నేరం కాదనీ సాధారణ నేరమేననీ సుప్రీంకోర్టు గుర్తించింది. ఒక నేరం టెర్రరిస్టు నేరం కావాలంటే దానికి పాల్పడ్డవారు ప్రభుత్వాన్ని లొంగదీసుకోవడం కోసమో లేక ప్రజలను (లేదా ప్రజలలో ఒక వర్గాన్ని) భయభ్రాంతులకు గురిచేయడానికో ఆ నేరానికి పాల్పడి ఉండాలి. లేని పక్షంలో అది ఎంత కుట్రపూరితంగా, క్రూరంగా జరిగినా అది టెర్రరిస్టు నేరం అనిపించుకోదు. అంటే 'టాడా' కిందికి రాదు.

రాజీవ్‌గాంధీ హత్య టెర్రరిస్టు నేరమేనని భావించి సిబిఐ టాడా చట్టం కింద చార్జిషీటు చేసింది కానీ అది టెర్రరిస్టు నేరం కాదనీ, మామూలు నేరమేననీ సుప్రీంకోర్టు భావించింది. రాజీవ్‌గాంధీని చంపే ఉద్దేశ్యమే తప్ప భారత ప్రభుత్వాన్ని లొంగదీసుకునే ఉద్దేశ్యం గానీ, ఏదైనా ప్రజాసమూహాన్ని బెదరగొట్టే ఉద్దేశ్యంగానీ హంతకులకు లేదని నిర్ధారించింది.

అటువంటప్పుడు ఉరి వంటి తీవ్రమైన శిక్ష వేయడం సబబా?

## అది రాజకీయ నేరమని సుప్రీంకోర్టు గుర్తించింది

ఏ నేరానికైనా ఒక సామాజిక నేపథ్యం ఉంటుంది. దానిని అర్థం చేసుకున్నప్పుడే నేరం చేసిన వారికి ఎంత శిక్ష వేయడం సబబన్న ప్రశ్నకు జవాబు దొరుకుతుంది. కేవలం కండకావరంతోను బలవంతులమన్న అహంకారంతోను స్వార్థంతోను చేసే నేరాలుంటాయి. సామాజిక ఆర్థిక ఒత్తిడుల కారణంగా చేసే నేరాలుంటాయి. తమకు, లేక తాము మమేకం చెందే ప్రజలకు అన్యాయం జరిగిందన్న ఆగ్రహంతో జరిగే నేరాలుంటాయి. నేరం ఒకటే అయినంత మాత్రాన ఈ కారణాలలో ఏది వర్తిస్తుందని చూడకుండ కఠినంగా శిక్షించవలసిందేనని అనడం అనుచితం.

రాజీవ్‌గాంధీ హత్య వీటిలో మూడవకోవకు చెందిన నేరమని సుప్రీంకోర్టు గుర్తించింది. హత్యకు పాల్పడిన ఎల్‌టిటిఇని శ్రీలంక తమిళుల ప్రయోజనాల పరిరక్షణ కోసం పుట్టిన సంస్థగా గుర్తించింది. శ్రీలంకలో మైనారిటీ అయిన తమిళులు వివక్షకూ అణచివేతకూ గురి అవుతుండడం వల్ల ఇటువంటి సంస్థలు ఏర్పడ్డాయని గుర్తించింది.

ఎల్‌టిటిఇకి భారత భూభాగంలో ఒక దశ వరకు పూర్తి స్వేచ్ఛ ఉండిందనీ, ప్రోత్సాహం ఉండిందనీ సుప్రీంకోర్టు గుర్తించింది. కేంద్ర రాష్ట్ర (తమిళనాడు) ప్రభుత్వాలకు తెలిసే ఇది జరిగింది. సుప్రీంకోర్టు స్పష్టంగా అనకపోయినా అందరికీ తెలిసిన సత్యమేమిటంటే ఎల్‌టిటిఇకి భారత సైన్యమే తమిళనాడులో నెలకొల్పిన ముప్పైకి పైగా క్యాంపులలో సైనిక శిక్షణ ఇచ్చింది.

ఆ తరువాత భారత ప్రభుత్వం తన విధానాన్ని మార్చుకొని శ్రీలంకలో శాంతి నెలకొల్పడానికి ఆ దేశ ప్రభుత్వానికి సహకరించింది. 1987 జులై 29న రాజీవ్‌గాంధీ చొరవతో ఇరుదేశాల మధ్య ఒప్పందం జరిగింది. ఒప్పందంలో భాగంగా ఐపికెఎఫ్ (భారత శాంతి పరిరక్షక బలగం) పేరిట భారత సైన్యం శ్రీలంకకు పోయింది. అక్కడ శాంతి నెలకొల్పే నెపంతో భారత సైన్యం తమిళు లపైన అనేక రూపాలలో అత్యాచారాలకు పాల్పడింది. ఈ అభియోగాలను సుప్రీంకోర్టు కూడ ఈ కేసు తీర్పులో పలుమార్లు ప్రస్తావించింది. అవి అబద్ధపు అభియోగాలని సుప్రీంకోర్టు కొట్టిపారేయలేదు.

ఈ పరిణామాలవల్ల తమ లక్ష్యం దుర్లభం అయిందన్న కోపంతో పాటు భారత సైన్యం తమిళ ప్రజలపైన అత్యాచారాలకు పాల్పడిందన్న కోపం కూడ

ఎల్‌టిటిఇలో పెరిగిందని సుప్రీంకోర్టు గుర్తించింది. అది రాజీవ్‌గాంధీపైన కక్షగా మారిందని కూడా గుర్తించింది. వి.పి.సింగ్ మన దేశానికి ప్రధాన మంత్రి అయిన తరువాత భారత సైన్యాన్ని శ్రీలంక నుండి ఉపసంహరించడం జరిగింది. కానీ 1991 మధ్యంతర ఎన్నికల్లో కాంగ్రెస్ మళ్లీ గెలిచి రాజీవ్‌గాంధీ ప్రధాన మంత్రి అయినట్టయితే సైన్యాన్ని తిరిగి శ్రీలంకకు పంపిస్తాడేమోనని భయపడిన ఎల్‌టిటిఇ రాజీవ్‌గాంధీని చంపాలని నిర్ణయించుకుంది. కాంగ్రెస్ ఎన్నికల మానిఫెస్టోలో భారత – శ్రీలంక ఒడంబడికను సమర్థించడం వారి అనుమానానికి బలమిచ్చింది. ఇది సుప్రీంకోర్టు వ్యాఖ్యే, మా వ్యాఖ్య కాదు.

దీనిని బట్టి రాజీవ్‌గాంధీ హత్య వెనుక బలమైన రాజకీయ కారణాలున్నాయనీ, భారత ప్రభుత్వం శ్రీలంక తమిళుల సమస్యలపట్ల అనుసరించిన విధానంలోని ఎగుడుదిగుళ్ళు, అందులో భాగంగా శ్రీలంకకు పోయిన భారత సైన్యం చేతిలో శ్రీలంక తమిళులు అనుభవించిన హింస – ఈ హత్యకు ప్రధాన నేపథ్యమనీ అర్థం అవుతుంది. దీనికి భారత పాలకులు, అందులో భాగంగా రాజీవ్ గాంధీ ఎంతో కొంత బాధ్యత స్వీకరించక తప్పదు.

మరి అటువంటప్పుడు తప్పంతా ఈ ముద్దాయిలపైననే పెట్టి చావుకు చావే బదులు అని వారిని ఉరి తీయడం సబబా? జైలు శిక్షతో సరిపెట్టుకోవచ్చు గదా?

## తీర్పులో చట్టపరమైన లోపాలున్నాయి

ఈ కేసులో ఉన్న ప్రధాన సాక్ష్యం ముద్దాయిలు స్వయంగా పోలీసులకు ఇచ్చిన ఒప్పుకోలు. అది కూడ దాదాపు 60 రోజులు పోలీసు కస్టడీలో ఉన్న అనంతరం ఇచ్చిన ఒప్పుకోలు. మామూలు నేరాలలో ఇటువంటి ఒప్పుకోలు సాక్ష్యమే కాదు. ఇది 'టాడా' కింద పెట్టిన కేసు కాబట్టి పోలీసులకిచ్చిన ఒప్పుకోలును సాక్ష్యంగా ప్రవేశపెట్టారు. ఈ ఘటనలో నిజానికి 'టాడా' నేరమేదీ లేదని ప్రకటించిన సుప్రీంకోర్టు ఈ ఒప్పుకోళ్లను మాత్రం లెక్కలోకి తీసుకోవచ్చుననింది. వాటి ఆధారంగా నలుగురికి ఉరిశిక్ష ఖరారు చేసింది. ఇది చట్టబద్ధమైన తీర్పేనా? కాదని చాలామంది న్యాయ శాస్త్రజ్ఞులు అంటున్నారు. అవునని సుప్రీంకోర్టు అంటున్నది. రేపెప్పుడైనా ఇది తప్పుడు అభిప్రాయమనే నిర్ణయానికి సుప్రీంకోర్టే రావచ్చును. ఆ లోపల ఈ నలుగురినీ ఉరితీసేస్తే వాళ్ళ ప్రాణాలు వెనక్కి తేలేము కదా?

దేశంలోని అత్యున్నత న్యాయస్థానం శిక్ష ఖరారు చేసిందంటే అది న్యాయమే అయి ఉండాలని చాలామంది అనుకుంటారేమో. సుప్రీంకోర్టును అగౌరవపరచడం మా ఉద్దేశ్యం కాదు గానీ అంతటి విజ్ఞత ఏ మానవ మాత్రులకూ ఆపాదించలేము. అందుకే ప్రాణం తీసే అధికారం మానవ మాత్రులయిన న్యాయమూర్తుల చేతిలో సహితం ఉండకూడదు. నిజానికి ఈ కేసు విచారించిన ముగ్గురు న్యాయమూర్తులలో ఒకరయిన జస్టిస్ థామస్ నళినిని ఉరి తీయకూడదని భావించగా, మిగిలిన ఇద్దరూ ఉరితీయాలని అన్నారు. ముగ్గురూ అత్యున్నత న్యాయస్థానంలోని జడ్జీలే మరి. నళిని, మురుగన్‌లు భార్యాభర్తలు కావడం వల్ల వారిద్దరినీ ఉరితీస్తే వారి పుత్రిక అనాథ అవుతుంది కాబట్టి నళినికి జీవిత ఖైదు చాలునని జస్టిస్ థామస్ భావించగా, ఆమె చేయూతనిచ్చిన ఆనాటి హత్యాకాండలో ఇంకెంతో మంది అనాథలు కాలేదా అని మిగిలిన ఇద్దరు జడ్జిలు అన్నారు. హంతకులు క్రూరంగానే ప్రవర్తించారనుకున్నా, కోర్టు కూడ అంతే క్రూరంగా ఆలోచించాలనే ఈ వైఖరిలోని విజ్ఞత ఎంత?

**అసలు ఉరిశిక్ష ఎందుకుండాలి?**

రాజీవ్‌గాంధీ హత్యకేసును పక్కనపెట్టినా, అసలు భారత నేరస్మృతిలో ఉరిశిక్ష అనేది ఎందుకు ఉండాలి? జీవిత ఖైదే అత్యధిక శిక్ష అయితే మన దేశ భద్రతకు పెనువిఘాతం కలిగిపోతుందా?

ఉరిశిక్ష పడడం వల్ల హత్యలేమీ తగ్గవని అనేక దేశాలలో జరిగిన పరిశోధనలు తెలియజేస్తున్నాయి. హంతకుడు ఒక హత్య చేస్తే న్యాయం మరొక హత్య చేసి హతుల సంఖ్యను పెంచడం మాత్రమే జరుగుతుంది.

ప్రపంచంలో ఈ రోజు 68 దేశాలు మరణదండనను పూర్తిగా రద్దుచేశాయి. 37 దేశాలు చట్టం నుండి మరణదండనను తొలగించకున్నా ఆ శిక్షను అమలు చేయడం మానేసాయి. అంటే మొత్తం 105 దేశాలు ఎవ్వరినీ న్యాయం పేరిట ఉరితీయకుండానే శాంతి భద్రతలు కాపాడుతున్నాయి. మరణదండన అమలు చేస్తున్న దేశాల సంఖ్య 89. వాటిలో మనమున్నాము. రద్దు చేసిన 105 దేశాలకు లేని సమస్యలు ఈ 89 దేశాలకేమున్నాయి? రద్దుచేసిన దేశాలలో మన దేశాన్ని అనేక విషయాలలో పోలినవి చాలా ఉన్నాయి. ఆ దేశాలలోనూ అశాంతి, తిరుగుబాట్లు, నేరాలు, అభద్రత మన దేశాన్ని పోలి ఉన్నాయి. అయితే ఈ సమస్యల పరిష్కారానికి చట్టం చేతిలో మరణదండన ఉండవలసిన అవసరం ఉందని ఆ దేశాలు అనుకోవడం లేదు. మనం మాత్రం ఎందుకు అనుకోవాలి?

అశాంతి, తిరుగుబాట్లు, నేరాలు సమాజంలో పుడతాయి కాబట్టి వాటికి జవాబు సమాజంలో వెతకాలి. సమాజంలోని అన్ని రంగాలూ ఈ అన్వేషణలో భాగం కావాలి. వాటి పరిష్కారానికి రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక కృషి కావాలి. నేరానికి బాధ్యత యావత్తూ నేరస్తులపైన పెట్టి, వారిని నిరోధించే బాధ్యత యావత్తూ శిక్షాస్మృతి మీద పెట్టడం సరయినది కాదు. అట్లా చేసినప్పుడే 'కఠిన శిక్షలు' అవసరం అనిపిస్తుంది.

రాజీవ్‌గాంధీ హత్య కేసులోని నలుగురు గురించే కాక అసలు 'మరణ దండన' అనే శిక్ష గురించి కూడా ప్రజలు ఆలోచించాలని మేము కోరుకుంటున్నాము. నువ్వు చంపావు కాబట్టి నువ్వు చావవలసిందే అనే న్యాయవ్యవస్థ ఒక నాగరికమైన వ్యవస్థేనా? నేరానికి సమాజం బాధ్యత కొంత ఉందని గుర్తించకుండా వ్యక్తిపైననే బాధ్యత అంతా పెట్టడం సబబేనా? పౌరులు ప్రతీకారం తీర్చుకుంటే ఒప్పుకోని చట్టం న్యాయం పేరిట ప్రతీకార నీతిని ఆచరించడం సబబేనా? నేరం చేసినవారిపైన సమాజం ప్రతీకారం తీర్చుకునే ఈ శిక్షాస్మృతి బదులు నేరం చేసిన వ్యక్తినీ, ఆ వ్యక్తికి స్థానం కల్పించిన సమాజాన్నీ సంస్కరించే వ్యవస్థను రూపొందించలేమా? ప్రపంచంలో మరణదండనను రద్దుచేసిన దేశాల జాబితాలో మనమూ చేరలేమా?

## రాష్ట్రపతికి విజ్ఞప్తి చేయండి

నళిని, శంతన్, మురుగన్, అరివుల ప్రాణాలు కాపాడడానికి ఆఖరి అవకాశం రాష్ట్రపతికి రాజ్యాంగం ఇచ్చిన క్షమాధికారంలో ఉంది. న్యాయస్థానాలు వేసిన ఏ శిక్షనయినా ఎంత మేరకైనా తగ్గించే అధికారం ఆర్టికల్ 72 ప్రకారం రాష్ట్రపతికి ఉంది. పై నలుగురి ప్రాణాల రక్షణ కోసం ఆ అధికారాన్ని సద్వినియోగం చేయమనీ, వారికి వేసిన శిక్షను జీవిత ఖైదుగా మార్చమనీ రాష్ట్రపతికి 'ఉరిశిక్ష వ్యతిరేక జాతీయ కమిటీ' అధ్యక్షులు వి.ఆర్. కృష్ణయ్యర్ ఇప్పటికే అర్జీ పెట్టి ఉన్నారు. వారితో మీరు కూడ గొంతు కలుపుతూ రాష్ట్రపతి చిరునామాకు లేఖ రాయవలసిందిగా కోరుతున్నాం.

మొత్తంగానే మన నేరస్మృతి నుండి మరణదండనను తొలగించాలనే ఉద్యమంలో భాగం కమ్మని కూడ కోరుతున్నాం.

**ఉరిశిక్ష వ్యతిరేక కమిటీ కరపత్రంగా వచ్చింది**
**16 అక్టోబర్ 1999**

# రాజీవ్‌గాంధీ హత్యకేసు ముద్దాయిల ప్రాణాలు కాపాడటానికి ఆఖరు ప్రయత్నం

"అసలయిన పాత్రధారులు,
సూత్రధారులు ఆత్మహత్య చేసుకోకుండా
ప్రాణాలతో దొరికి ఉంటే ఈ నలుగురిలో
ఏ ఒక్కరికీ ఉరిశిక్ష పడేది కాదు. వారికి
ఉరిశిక్ష వేసి వీరికి ఎంతో కొంత
పరిమాణంలో ఖైదు మాత్రం విధించేవారు.
వాళ్ళు ప్రాణాలతో దొరకలేదని వీళ్ళనిప్పుడు
ఉరి తీయబోతున్నారు. దీనిని కక్ష
అనవచ్చునో ప్రతీకారం అనవచ్చునో
ఏమనవచ్చునోగానీ న్యాయం అని మాత్రం
అనలేము."

నళిని, మురుగన్, శంతన్, అరివుల రివ్యూ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టేయడంతో ఆ నలుగురి తుది ఘడియలు మరింత దగ్గరికొచ్చాయి. వీరు 'రాజీవ్‌గాంధీ హంతకులు' అని న్యాయస్థానాలు ప్రజలకు చెప్పాయి. అంతకంటే దగ్గరగా చూసి ఏ పాటి హంతకులు అన్న ప్రశ్న వేసుకునే ఓపిక ఎవరికీ లేదు. ఏపాటి హంతకులయినా వీరికి మరణం తప్ప వేరే శిక్ష సరిపోదా అన్న ప్రశ్న వేసుకునే ఓపిక అసలే లేదు. నిజానికి రాజీవ్‌గాంధీ హత్యకు ప్రత్యక్షంగా బాధ్యులయిన వాళ్లందరూ కేసు విచారణ ప్రారంభం కాకముందే చనిపోయారు. థాను రాజీవ్‌గాంధీతో పాటు చనిపోయింది. శుభ, శివరాసన్‌లతో సహా మొత్తం 12 మంది అరెస్టు, చిత్రహింసలు తప్పించుకోవడానికి ఆత్మహత్య చేసుకొని చనిపోయారు.

వీరికంటే ముఖ్యులు మరి ముగ్గురున్నారని ఆ కేసు పరిశోధన నిర్వహించిన కార్తికేయన్ భావించారు. వారు అసలు కుట్రదారులు. వారి పేర్లు ప్రభాకరన్, పొట్టు అమ్మన్, అఖిల. అయితే ఈ కుట్రదారులు మన పోలీసులకు దొరకలేదు. ఎందుకంటే వారుండేది ఈ దేశంలో కాదు. ప్రభాకరన్‌ను, అతని సహచరులను పట్టి అప్పగించవలసిందిగా శ్రీలంక ప్రభుత్వాన్ని కోరనున్నామన్న హాస్యాస్పదమైన ప్రకటనలు మన ప్రభుత్వం చాలాసార్లు చేసింది. వాళ్లను పట్టుకోగలిగితే శ్రీలంక ప్రభుత్వానికే చాలా సమస్యలు తీరుతాయి. కానీ ఎట్లా పట్టుకోవాలి?

ఈ ముగ్గురు ముఖ్యులు పోగా, వారి కుట్రను అమలులో పెట్టిన ప్రధాన పాత్రధారులలో థాను ఆనాడే చనిపోగా మిగిలిన పన్నెండు మంది భారతీయ పోలీసుల చేతికి చిక్కడం శ్రేయస్కరం కాదనుకొని సైనైడ్ గుళికలు మింగి చనిపోయారు. చావుకు చావే జవాబు అనుకున్నా అక్కడితో న్యాయం జరిగిపోయిందని మన వాళ్లంతా సంతృప్తి చెంది ఉండాలి. కానీ మన ప్రభుత్వంగానీ న్యాయస్థానాలుగానీ సంతృప్తి చెందలేదు. చావకుండా చేతికి చిక్కిన 26 మందిని కూడా కఠినంగా శిక్షించడానికి పూనుకున్నారు. వీళ్లలో ఏ ఒక్కరూ రాజీవ్‌గాంధీ హత్యలో ప్రత్యక్ష భాగస్వాములు కారు. నిజానికి నళిని ఒక్కతే ఆ రోజు హత్యాకాండ జరిగినచోట ఉంది. ఆమెకు కూడా జరగబోయే విషయం ఆ రోజు మధ్యాహ్నం దాకా తెలీదు. అప్పటిదాకా ఆమె ఒక ఎల్‌టిటిఇ అభిమానిగా శివరాసన్, శుభ, మురుగన్‌లతో ఉంది. మురుగన్‌ను ప్రేమించింది. ఆ రోజు మధ్యాహ్నమే శివరాసన్ ఆమెకు జరగబోయే సంగతి చెప్పి 'శ్రీపెరంబుదూర్ బయలుదేరమని' అన్నాడు. అమెకు అతను అప్పగించిన పాత్ర కూడా

స్వల్పమైనదే. శుభ, థాను శ్రీలంక తమిళులు కాబట్టి వారి యాసను బట్టి ఎవరికీ అనుమానం రాకుండా ఉండాలంటే ఒక మద్రాసీ స్త్రీ పక్కన ఉండాలి. ఆమె నిర్వహించిన పాత్ర అంతే. దానికి ఇప్పుడు ఆమె ఉరికంబం ఎక్కబోతున్నది. నిర్వహించిన పాత్ర ఎంత చిన్నదైనా ఆమె కూడా కుట్రలో భాగమేనని న్యాయమూర్తులన్నారు. ఆఖరి నిమిషంలో కుట్ర ఏమిటో తెలుసుకున్న నళిని తప్పించుకోవాలన్నా తప్పించుకోగలిగేది కాదనీ, శివరాసన్ చెప్పినట్టు వినకపోతే ఆమెకే అపాయం జరిగేదనీ ఆమె తరఫున వకీళ్ళు చేసిన వాదనను న్యాయస్థానాలు త్రోసిపుచ్చాయి. పోనీయండి, కుట్రలో ఆమె భాగస్వామే అయినా కుట్రదారులందరికీ ఒకే శిక్ష వేయాలని ఎక్కడా లేదు కదా?

ముఖ్యమైన కుట్రదారులు ఆత్మహత్య చేసుకొని ఉరికంబాన్ని తప్పించుకున్నారని చెప్పి స్వల్ప పాత్ర నిర్వహించిన వారిని పట్టుకొని ఉరికంబం ఎక్కించవలసిందేనా? నళిని కనీసం ఆ రాత్రి శ్రీపెరంబుదూర్‌లో ఉంది. మిగిలిన ముగ్గురూ ఆ మేరకు కూడా ప్రత్యక్ష పాత్రధారులు కారు. వారు రాజీవ్‌గాంధీని చంపే పథకంలో భాగమే కానీ ముఖ్యులు ఎంత మాత్రం కారు. మురుగన్ చేసిన పనులు – నళినిని శివరాసన్‌కు పరిచయం చేయడం, శుభ, థానులు రాసిన ఉత్తరాలు శ్రీలంకకు తీసుకుపోయి పొట్టు అమ్మన్‌కూ అఖిలకూ ఇచ్చిరావడం, ఫోటోగ్రాఫర్ హరిబాబును శివరాసన్ తదితరులతో పాటు ఆనాడు శ్రీపెరంబుదూర్‌కు పంపించడం, వగైరాలు.

దీనికి అతనిప్పుడు ఉరికంబం ఎక్కబోతున్నాడు.

శంతన్ మరొక కుట్రదారుడు. అతను నిర్వహించిన పాత్ర ఏమిటంటే ఎల్‌టిటిఇ వివిధ వ్యక్తుల ద్వారా శివరాసన్ కోసం పంపించిన డబ్బులు అందుకొని అతనికి అందజేయడం. అరివు ఇంకొక కుట్రదారుడు. ఇతని పాత్ర ఏమిటంటే 'మానవబాంబు' థాను ఉపయోగించిన బ్యాటరీలు కొనివ్వడం, ఫోటోగ్రాఫర్ హరిబాబు కెమెరాకు రోల్ కొనివ్వడం, శివరాసన్ శ్రీలంకలోని తన నాయకులతో మాట్లాడడానికి వైర్‌లెస్ పరికరాలు అమర్చడం.

వీళ్ళిద్దరూ కూడా ఇప్పుడు ఉరికంబం ఎక్కబోతున్నారు.

అసలయిన పాత్రధారులు, సూత్రధారులు ఆత్మహత్య చేసుకోకుండా ప్రాణాలతో దొరికి ఉంటే ఈ నలుగురిలో ఏ ఒక్కరికీ ఉరిశిక్ష పడేది కాదు. వారికి ఉరిశిక్ష వేసి వీరికి ఎంతో కొంత పరిమాణంలో ఖైదు మాత్రం విధించేవారు.

వాళ్ళు ప్రాణాలతో దొరకలేదని వీళ్లనిప్పుడు ఉరి తీయబోతున్నారు. దీనిని కక్ష అనవచ్చునో ప్రతీకారం అనవచ్చునో ఏమనవచ్చునోగానీ న్యాయం అని మాత్రం అనలేము.

ప్రతీ నేరానికీ ఒక సామాజిక నేపథ్యం ఉంటుందనీ, ఆ నేపథ్యంలో చూసినప్పుడే నేరానికి వ్యక్తి బాధ్యత ఎంత, పరిస్థితుల బాధ్యత ఎంత అనేది అర్థం అవుతుందనీ హక్కుల ఉద్యమకారులు ఎప్పటినుండో అంటున్నారు. నేరస్థునికి ఎంత శిక్ష వేయాలన్నది అప్పుడే తెలుస్తుంది. రాజీవ్ గాంధీ హత్యకు బలమైన రాజకీయ నేపథ్యం ఉంది. దానిని మొత్తంగా అర్థం చేసుకుంటే ఆ హత్యకు హంతకుల బాధ్యత ఎంత ఉందో హతుని బాధ్యత కూడా అంతే ఉందని అర్థం అవుతుంది.

ఈ రాజకీయ నేపథ్యాన్ని సుప్రీంకోర్టు బాగానే అర్థం చేసుకున్నది. నీళ్ళు నమలకుండా వివరించింది. అయితే శిక్ష ఎంత వేయాలో నిర్ణయించేటప్పుడు మాత్రం దానినసలు లెక్కలోకి తీసుకోలేదు. శ్రీలంకలో తమిళులు వివక్షకు గురయిన మాట వాస్తవం. ఈ వివక్షపట్ల నిరసన వ్యక్తం చేస్తూ తమిళుల హక్కులకు అండగా ముందుకొచ్చిన ఉద్యమమే 'తమిళ వేర్పాటు ఉద్యమం'గా పరిణామం చెందింది. 1987 దాకా ఈ శ్రీలంక తమిళ వేర్పాటు వాద సంస్థలకు భారతదేశంలో ఆశ్రయం మాత్రమే కాదు, చాలా ప్రోత్సాహం సహితం లభించింది. ప్రజల నుండి మాత్రమే కాదు, ప్రభుత్వం నుండి కూడా లభించింది. ఎల్‌టిటిఇకి సైనిక శిక్షణ భారత సైన్యమే ఇచ్చిందనేది బహిరంగ రహస్యం.

1987లో అప్పటి ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ ఈ విధానాన్ని మార్చేసాడు. 'తమిళ ఈలం'లో శాంతి నెలకొల్పడం ప్రధాన విషయంగా గల భారత-శ్రీలంక ఒడంబడిక జరిగింది. శాంతి ఒప్పందం పైన సంతకం చేయమని ఎల్‌టిటిఇ పైన రాజీవ్‌గాంధీ ప్రభుత్వం చాలా ఒత్తిడి పెట్టింది. ఈ శాంతిని కాపాడటానికి భారతసైన్యం 'శాంతి పరిరక్షక బలగం' (ఐపికెఎఫ్) పేరిట శ్రీలంక ప్రభుత్వానికి అండగా ఆ దేశానికి పోయింది. భారత్ పనిగట్టుకొని పెంచిన ఆశలను ఈ విధంగా ఒక్కసారిగా కూల్చివేయడం ఎల్‌టిటిఇ వంటి తమిళ జాతీయవాద సంస్థలకు చాలా కోపం తెప్పించింది. పైగా భారత సైన్యం శాంతి నెలకొల్పే పేరిట శ్రీలంకలోని తమిళులపైన అనేక అత్యాచారాలకు పాల్పడింది.

ఈ విషయాలన్నీ నిర్మొహమాటంగా చర్చించి ఈ కారణంగానే ఎల్‌టిటిఇ రాజీవ్‌గాంధీపైన ద్వేషం పెంచుకుందని విశ్లేషించడం ఈ కేసులో సుప్రీంకోర్టు

ఇచ్చిన తీర్పులో ఒక విశేషం. అయితే శిక్ష ఎంత వేయాలని నిర్ణయించేటప్పుడు ఈ నేపథ్యాన్ని అసలే లెక్కలోకి తీసుకోకుండా 'చంపారు కాబట్టి చావవలసిందే'నన్నట్టు వ్యాఖ్యానించడం ఇంకొక విశేషం.

ఈ వైరుధ్యాలను ఎత్తి చూపుతూ, పై నలుగురికీ ఉరి శిక్ష తప్పించి ఖైదు మాత్రమే వేయాలని రాష్ట్రపతికి విజ్ఞప్తి చేస్తూ, జస్టిస్ కృష్ణయ్యర్ వంటివారి నాయకత్వంలో ఒక ప్రయత్నం ప్రారంభమయింది. ఆ ప్రయత్నం ఫలిస్తుందని ఆశిద్దాం.

**నిగాహ్, ప్రజాతంత్ర వారపత్రిక**
**17 అక్టోబర్ 1999**

# డిసెంబర్ 13: దానికి ప్రతీకారం

"ప్రజాస్వామ్యంతో సమానంగా భావించబడే
పార్లమెంటు బిల్డింగుపైన దాడి చేసిన వారికి
సహకరించిన వారిని నిర్దాక్షిణ్యంగా ఉరికంబం
ఎక్కించడం కంటే, ఎట్టి పరిస్థితులలోనయినా సరే
భారత న్యాయవ్యవస్థ ఆవేశానికి లోను కాకుండ
ఒకేరకంగా న్యాయం చేస్తుందని రుజువు చేయడం
ద్వారా సెషన్స్ జడ్జి ఢింగ్రా గారు భారత
ప్రజాస్వామ్యానికి ఎక్కువ మేలు చేసి ఉందురు.
ప్రజాస్వామ్యం అంటే చట్టసభల బిల్డింగులు కాదు.
ప్రజాస్వామ్యం అంటే ప్రజాస్వామ్య వ్యవస్థలు. ఎంతగా
రెచ్చగొట్టినా అవి చెక్కు చెదరకుండ తమ విలువలకు
కట్టుబడి ఉంటాయని రుజువు చేయడం ఆ వ్యవస్థలలో
బాధ్యతలు నిర్వర్తించేవారు ప్రజాస్వామ్యానికి చేయగల
అత్యుత్తమ సేవ."

పార్లమెంటుపై దాడి భారత ప్రజాస్వామ్యంపైన దాడి అని ఒక సంవత్సరం కింద అన్నారు. ఆ దాడి చేసిన వారు ఆనాడే చనిపోగా, దానికి సహకరించిన వారిలో ముగ్గురికి ఉరిశిక్ష వేసిన పాటియాలా కోర్టు సెషన్స్ జడ్జి ఢింగ్రా ప్రజాస్వామ్యాన్ని కాపాడారని ఇప్పుడు అంటున్నారు.

ప్రజాస్వామ్యం అనేది పార్లమెంటు గోడలలో, గదులలో ఉందా? అన్న అనుమానం ఎవరికైనా రాగలదు. ప్రజస్వామ్యంతో సమానంగా భావించబడే పార్లమెంటు బిల్డింగుపైన దాడి చేసిన వారికి సహకరించిన వారిని నిర్దాక్షిణ్యంగా ఉరికంబం ఎక్కించడం కంటే, ఎట్టి పరిస్థితులలోనయినా సరే భారత న్యాయవ్యవస్థ ఆవేశానికి లోను కాకుండ ఒకేరకంగా న్యాయం చేస్తుందని రుజువు చేయడం ద్వారా సెషన్స్ జడ్జి ఢింగ్రా గారు భారత ప్రజాస్వామ్యానికి ఎక్కువ మేలు చేసి ఉందురు. ప్రజాస్వామ్యం అంటే చట్టసభల బిల్డింగులు కాదు. ప్రజాస్వామ్యం అంటే ప్రజాస్వామ్య వ్యవస్థలు. ఎంతగా రెచ్చగొట్టినా అవి చెక్కు చెదరకుండ తమ విలువలకు కట్టుబడి ఉంటాయని రుజువు చేయడం ఆ వ్యవస్థలలో బాధ్యతలు నిర్వర్తించేవారు ప్రజాస్వామ్యానికి చేయగల అత్యుత్తమ సేవ.

'అదిగో, దాడి చేసిన వాళ్లు ముస్లింలు కాబట్టి, టెర్రరిస్టులు కాబట్టి, ఈయన వెనకేసుకొస్తున్నాడు' అనబోతారు. నేను ఆ దాడి చేసిన వారిని వెనకేసుకు రావడం లేదు. వెనకేసుకు రావడానికి వారింకా ప్రాణంతో లేరు. ప్రత్యక్షంగా దాడిలో పాల్గొన్న వారందరూ ఆనాడే చనిపోయారు. 'ప్రతీకారం' అవసరం అనుకున్నట్లయితే అది ఆనాడే జరిగిపోయింది.

అయితే భారత ప్రజాస్వామ్యాన్ని కాపాడడానికి ఈ ప్రతీకారం కూడా అవసరం అని చాలామంది లాగా సెషన్స్ జడ్జి ఢింగ్రా గారు కూడా భావించారు. నేర విచారణ నడుస్తుండగా జరిగిన ఒక ఘటన దీనికి తార్కాణం. సాక్ష్యం చెప్తున్న ఒక పోలీస్ అధికారిని ముద్దాయిల తరఫున క్రాస్ ఎగ్జామిన్ చేస్తున్న న్యాయవాది హెచ్చరిస్తూ, 'బాగా ఆలోచించి జవాబు చెప్పండి, నాలుగు ప్రాణాలు మీ జవాబు మీద ఆధారపడి ఉన్నాయి' అనగా, జడ్జి ఢింగ్రాగారు జోక్యం చేసుకొని 'అవును బాగా ఆలోచించుకుని జవాబు చెప్పండి – భారత ప్రజాస్వామ్యం భవిష్యత్తు మీ జవాబు మీద ఆధారపడి ఉంది' అన్నారంట.

ఒక నేరాన్ని విచారించే జడ్జి తాను దేశాన్ని కాపాడే పోరాటంలో పాల్గొంటున్నానని అనుభూతి చెందుతూ ఆ పని చేస్తే, బోనులో నిలబడ్డ వ్యక్తికి న్యాయం చేస్తాడన్న భరోసా లేదు. ఆ నేరం జరిగిన సందర్భం భయానకమైనదే కావచ్చు. నేరం ఘోరమైనదే కావచ్చు. అయినప్పటికీ న్యాయమూర్తి చేయవలసింది ఆ ఘోరానికి జవాబు చెప్పడం కాదు, తన ఎదుట నిలబడ్డ వ్యక్తి పాత్ర ఏమిటో నిర్ధారించి సముచితంగా శిక్షించడం మాత్రమే. ఇదేదో టెక్నికల్ విషయం అనుకోవడం చాలా పొరబాటవుతుంది. న్యాయస్థానాలు ఈ దృష్టితో పని చేయకుంటే వ్యక్తి స్వేచ్ఛకూ ప్రాణానికీ భరోసా ఉండదు.

నలుగురు ముద్దాయిలలో ఒకరయిన అఫ్సాన్ గురుకు అయిదు సంవత్సరాల జైలు శిక్ష వేయడం సెషన్స్ జడ్జి ఢింగ్రా గారి వైఖరికి అద్దం పడుతుంది. తన భర్త షౌకత్ హుస్సేన్ గురుతో సహా ఇతర కుట్రదారులు కుట్ర చేస్తున్న సంగతి తెలిసి కూడ పోలీసులకు చెప్పనందుకు ఆమెకు అయిదేళ్ల కఠిన కారాగార శిక్ష విధించారు. టెర్రరిస్టుకు ఆశ్రయం ఇవ్వడం లేదా వారిని దాచి ఉంచడం నేరం అని 'పోటా'లోని సెక్షన్ 3(4) అంటుంది కానీ భార్యాభర్తలకు మినహాయింపు ఇస్తుంది. అంటే తన భర్త టెర్రరిస్టు అని తెలిసీ ఒక స్త్రీ అతనిని పోలీసుల నుండి కాపాడినా అది పోటా కింద నేరం కాదు. అటువంటప్పుడు తన భర్త కూడా భాగస్వామి అయిన కుట్రను పోలీసులకు తెలియజేయక పోవడం టెర్రరిజానికి సహకరించడంగా భావించి ఆమెకు శిక్ష విధించడం ఎట్లా న్యాయం అవుతుంది?

శిక్ష పడిన ఈ నలుగురూ 'అమాయకులా' అని చాలామంది మా బోటివాళ్లను ఆవేశంగా అడుగుతున్నారు. అమాయకులు అనే మాటకు ఈ సందర్భంలో రెండు అర్థాలు ఉండగలవు. వాళ్లు డిసెంబర్ 13 నాటి దాడికి పాల్పడిన వారితో గానీ, ఆ దాడితో గానీ ఏ సంబంధం లేని దారినపోయేవారు అనేది అర్థమయితే ఈ నలుగురూ (నాకు అర్థం అయినంతవరకు) అమాయకులు కారు. వాళ్లు ఆ దాడికి పాల్పడిన వారికి చిన్నా, చితకా సహాయాలు చేసి ఉండవచ్చును. కానీ ఆ దాడి జరుగుతుందని తెలిసి, దానికి సంబంధించిన పథకంలో భాగంగా సహాయం చేసారా అంటే ఒక్క మహమ్మద్ అఫ్జల్ తప్ప తక్కిన వారి విషయంలో అవునని అనడానికి ఆధారాలు లేవు. ఆ అర్థంలో తక్కిన ముగ్గురూ అమాయకులేననుకుంటాను.

మనకు పరిచయమున్న సందర్భాన్ని ఉదాహరణగా తీసుకుంటే విషయం సులభంగా అర్థం అవుతుంది. తెలంగాణలో ఒక ఊరిలో ఒకరినో ఇద్దరినో చంపే ఉద్దేశ్యంతోనో, పోలీస్ స్టేషన్‌పై దాడి చేసే ఉద్దేశ్యంతోనో 'అన్నలు' ప్రవేశిస్తారు. వారి కార్యక్రమం వివరాలు ఒకరిద్దరు మిలిటెంట్లకు తప్ప వేరే ఎవరికి తెలియకపోవచ్చును. అయితే వారు ఆ ఊరిలో చాలామంది సహాయం తీసుకుంటారు. ఆ వ్యక్తులు భయానికే కాదు భక్తితో కూడ సహాయం చేస్తారు. ఒకరి దగ్గర నాలుగు రోజులు ఉండి పోవడానికి గదో గొడ్ల చావడో తాత్కాలికంగా తీసుకుంటారు. ఒకరి ఇంట్లో అటక మీద బాంబులు వగైరా సామగ్రి నాలుగు రోజులు ఉంచమని కోరుతారు. ఒకరి స్కూటర్ నాలుగు రోజులు వాడుకుంటామంటారు. ఒకరిని రెండు పూటలు అన్నం వండి పెట్టమంటారు. వీరంతా 'అన్నల' మీద అభిమానంతోనే ఈ సహాయాలు చేసారనుకోండి. అయినప్పటికీ నాలుగో రోజు 'అన్నలు' ఒక హత్య చేసి వెళ్లిపోతే ఆ కేసులో వీరందరినీ కుట్రదారుల కింద చేర్చి ఉరిశిక్ష, జీవిత ఖైదు విధిస్తే 'అమాయకులను శిక్షించారు' అనమా? ఆ అర్థంలో గిలానీ, షౌకత్‌హుసేన్ గురు, అఫ్జల్ గురు అమాయకులే.

వాళ్లు కాశ్మీరీలు. కాశ్మీరీలకు మొదటినుండి భారత ప్రభుత్వం పట్ల ఉన్న అసంతృప్తికి తోడు ఈ పదేళ్లలో ఎంత లేదన్నా ఒక 30 వేల మంది కాశ్మీరీలు భారత సైన్యం చేతిలో చనిపోయారు. కాబట్టి భారత ప్రభుత్వం మీద పోరాటం చేసే వారెవరికైనా తమకు చేతనైన సహాయం చేయడానికి వారు సిద్ధపడడం సహజం. ఒక గది అద్దెకు ఇప్పించడం, ఒక కారు కొనుక్కోవడానికి సహకరించడం వారు చేసిన సహాయం. ఈ సహాయం పొందుతున్న వారు ఏం చేయబోతున్నారో వారికి నిర్దిష్టంగా తెలీదు. వారి పథకమేమిటో తెలీదు. అయినా వారిని తమ శత్రువుపైన పోరాటం చేసే పోరాటకారులుగా గుర్తించి వారు అడిగిన చిన్నా చితకా సహాయాలు చేసారు.

దానికి వారిని ఉరికంబం ఎక్కించడం న్యాయమా?

**నిగాహ్, ప్రజాతంత్ర వారపత్రిక**
**23 డిసెంబర్ 2002**

# చిలకలూరిపేట : కాషాయ వ్యాఖ్యానం

"వారికి ఉరిశిక్ష తప్పించడంలో క్రైస్తవ ఫాదరీలకు గానీ సంస్థలకు గానీ ఏ పాత్రా లేదు. మంచయినా చెడయినా ఆ ఘనత హక్కుల సంఘాలకూ, దళిత సంఘాలకు మాత్రమే చెందుతుంది. నిజానికి విజయవర్ధనరావు మొదటి నుంచి క్రైస్తవుడే. చలపతిరావు జైలులో మతం మార్చుకున్నాడు గానీ అది అతనిలో కలిగిన మానసిక క్షోభవల్లనే తప్ప కె.ఆర్. నారాయణన్ సానుభూతిని ఆకర్షించడానికి కాదు. వాళ్లు, మొదట క్షమాభిక్ష కోసం అర్జీ పెట్టుకున్నప్పుడు దేశ రాష్ట్రపతి నారాయణన్ కూడా కాదు, శంకర్‌దయాళ్ శర్మ."

నెలరోజుల కిందట ఒకరోజు వినుకొండ నుండి గుంటూరుకు బస్సులో పోతున్నాను. రద్దీగా ఉన్న బస్సులో నా ముందు సీట్లో ఇద్దరు యువకులు కూర్చొని ఉన్నారు. గట్టిగా ఏదో చర్చించుకుంటున్నారు. కొన్ని మాటలు చెవిన పడడంతో వినసాగాను.

మత మార్పిడుల వల్ల రాగల ప్రమాదాల గురించి ఒకతను రెండవ అతనికి సోదాహరణంగా వివరిస్తున్నాడు. అతను వాడుతున్న పరిభాషను బట్టి అతను ఖాకీ నిక్కరు బాపతు అని అర్థం అవుతూనే ఉంది. రెండవ అతను వాదనకు మొదటతని వాదనతో జవాబు చెప్పడం లేదుగానీ సంశయం వ్యక్తం చేస్తూ ఉన్నాడు.

'చిలకలూరిపేటలో ఏం జరిగిందో తెలుసా?' అని మొదటి అతను తన వ్యాఖ్యానం కొనసాగించాడు. 'బస్సులో దొంగతనం చేయడానికి వెళ్ళి బస్సును తగలబెట్టి అందరినీ చంపారు. వాళ్లిప్పుడు ఎక్కడ ఉన్నారనుకుంటున్నావు? హాయిగా బయట తిరుగుతున్నారు' అన్నాడు.

'ఛఛ.. అయి ఉండదులే' అన్నాడతని మిత్రుడు.

'నిజం. వాళ్లను రేపు ఉరి తీస్తారనగా ముందు రోజు ఒక ఫాదరీ జైలులోకి పోయి వాళ్లను మతం మార్చుకొమ్మన్నాడు. మతం మార్చుకుంటే క్రైస్తవుడయిన రాష్ట్రపతి కె.ఆర్.నారాయణన్ చేత క్షమాభిక్ష పెట్టిస్తానన్నాడు. ప్రాణం దక్కుతుందన్న ప్రలోభానికి లొంగి వాళ్ళిద్దరూ సరేనని క్రైస్తవం పుచ్చుకున్నారు. రాత్రికి రాత్రే ఢిల్లీకి కబురు పోయింది. కె.ఆర్. నారాయణన్ వాళ్లకు క్షమాభిక్ష పెట్టేసాడు. వాళ్లిప్పుడు హాయిగా బయట తిరుగుతున్నారు' అన్నాడు మొదటి అతను.

'ఛఛ.. అందువల్ల అయి ఉండదులే' అని అనంగీకారం తెలియజేస్తూనే ఉన్నాడు రెండవ వ్యక్తి. అతనికి విషయం తెలీదు గానీ ఖాకీ నిక్కరు సత్యాలను సులభంగా నమ్మకూడదన్న సత్సంశయం కలవాడిలాగా ఉన్నాడు.

వెనక సీట్లో ఉన్న నేను మాత్రం అవాక్కయ్యాను. మనం కళ్లారా చూసిన చరిత్ర, మనం పాల్గొన్న చరిత్ర, మన ఎదుటే ఎంతగా వక్రీకరించబడుతుందో అని ఆశ్చర్యపోయాను. చిలకలూరిపేట బస్సు దహనానికి పాల్పడిన చలపతిరావు, విజయవర్ధనరావులు 'హాయిగా బయట తిరగడం' లేదు. రాజమండ్రి సెంట్రల్

జైలులో జీవితఖైదు అనుభవిస్తున్నారు. బహుశా ఇంకొక దశాబ్ద కాలం బయటకు రారు.

వారికి ఉరిశిక్ష తప్పించడంలో క్రైస్తవ ఫాదరీలకు గానీ సంస్థలకు గానీ ఏ పాత్రా లేదు. మంచయినా చెడయినా ఆ ఘనత హక్కుల సంఘాలకూ, దళిత సంఘాలకు మాత్రమే చెందుతుంది. నిజానికి విజయవర్ధనరావు మొదటి నుంచి క్రైస్తవుడే. చలపతిరావు జైలులో మతం మార్చుకున్నాడు గానీ అది అతనిలో కలిగిన మానసిక క్షోభవల్లనే తప్ప కె.ఆర్. నారాయణన్ సానుభూతిని ఆకర్షించడానికి కాదు. వాళ్లు, మొదట క్షమాభిక్ష కోసం అర్జీ పెట్టుకున్నప్పుడు దేశ రాష్ట్రపతి నారాయణన్ కూడా కాదు, శంకర్‌దయాళ్ శర్మ.

వాళ్ల శిక్ష తగ్గింపు కోసం జరిగిన ఆందోళనలో వాళ్లు క్రైస్తవులు అన్న H.L. విషయాన్ని ఎవరూ ప్రస్తావించలేదు. ప్రస్తావించకూడదని కాదు, అసందర్భం కాబట్టి ప్రస్తావించలేదు. వాళ్ల కులాన్నీ, వర్గాన్నీ మాత్రమే ప్రస్తావించారు. వాళ్ళు దళితులు, నిరుద్యోగ శ్రామికులు అని చెప్పారు. వారిని ఆ నేరానికి నెట్టిన పరిస్థితులను విశదీకరించే యత్నంలో భాగంగా ఈ విషయాలు చెప్పారు.

కె.ఆర్.నారాయణన్ క్రైస్తవులైతే ఒక రకంగా, క్రైస్తవేతరులయితే ఇంకొక రకంగా స్పందించే వ్యక్తేనా అన్న ప్రశ్న పక్కన పెట్టినా ఒక ఖైదీకి క్షమాభిక్ష పెట్టే విషయంలో తుది నిర్ణయం రాష్ట్రపతిది కాదు, ప్రభుత్వానిదే. అంటే మంత్రిమండలిదే. రాష్ట్రపతి మంత్రిమండలి అభిప్రాయాలను ప్రభావితం చేయగలడంతే.

మానవతావాది అయిన కె.ఆర్. నారాయణన్ వీరిద్దరి ఉరిశిక్షను తప్పించాలన్న నిర్ణయానికి వచ్చే ఉంటాడని మా విశ్వాసం. అయితే దానికి కేంద్ర హోంమంత్రిత్వశాఖ సమ్మతి తెల్పకపోయినట్టయితే ఆ నిర్ణయం అమలయ్యేది కాదు. అప్పటి కేంద్ర హోంమంత్రి అయిన సిపిఐ నాయకుడు ఇంద్రజిత్ గుప్తా మొదట్లో హక్కుల సంఘాల విజ్ఞప్తికి సానుభూతితో స్పందించలేదు. వాళ్లు దళితులు, పేదవాళ్లు అన్న కారణాలు చెప్పగానే అగ్గిమీద గుగ్గిలమయ్యాడు. 'దళితులా? దళితులయితే ఏమైనా చేసేయవచ్చా? గొంతులు కోసి దళితులం అని చెప్పుకుంటే సరిపోతుందా?' అంటూ మా మీద ఎగిరాడు. కానీ వారి పార్టీ అగ్రనాయకులలో ఒకరయిన ఎ.బి.బర్దన్ హక్కుల సంఘాల వైఖరిని సమర్థించడంతో ఇంద్రజిత్ గుప్తా కూడా తన అభిప్రాయాన్ని మార్చుకున్నాడు. మరొక విషయం ఏమిటంటే, నిర్ణయం జరిగింది యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వంలోనే

అయినా అది వెలువడింది భారతీయ జనతా పార్టీ పాలన తొలిదినాలలో. అప్పటికే జరిగిపోయిన నిర్ణయాన్ని తిరగదోడడం ఇష్టం లేక వారు జరగనిచ్చినట్టున్నారు.

ఈ చరిత్ర అంతా పక్కకుపోయి 'మతం మార్చుకున్నందుకు ఉరిశిక్ష తప్పింది' అని సంఘ్‌పరివార్ శక్తులు మా తరం ఇంకా బతికి ఉండగానే ప్రచారం ప్రారంభించాయన్నమాట.

ఇది ఆనాటి బస్సు ప్రయాణికుడి తలలో పుట్టిన అబద్ధం కాదనుకోవడానికి కారణం నెలరోజుల తరువాత పత్రికలలో చూసిన ఒక వార్త. ఖమ్మంలో కాబోలు ఒక సభలో మాట్లాడుతూ, త్రిదండి శ్రీమన్నారాయణ చినజియ్యర్‌స్వామి మత మార్పిడుల వల్ల జరగగల అనర్థాలకు ఒక దృష్టాంతంగా చిలకలూరిపేట ఘటనను ప్రస్తావించినట్టు ఒక దినపత్రిక రాసింది. ఇతను హైందవ మతాన్ని అనర్గళంగా వ్యాఖ్యానించే వక్తగా మొదలయి విశ్వ హిందూ పరిషత్ నాయకుడయ్యాడు. విద్వేష విషం కక్కడంలో ఆరితేరిన ప్రవీణ్‌తొగాడియా సరసన ఈ మధ్య మీటింగ్‌లలో పాల్గొన్నాడు. బస్సును తగలబెట్టి ఘోరమైన హత్యాకాండకు పాల్పడిన వారిని క్షమాభిక్ష ఎరగా చూపించి మతం మార్చారనీ, క్రైస్తవుడయిన రాష్ట్రపతి ఈ ఎత్తుగడకు సహకరించి మత మార్పిడికి దోహదం చేసాడనీ అతని వ్యాఖ్య.

చిలకలూరిపేట ఇక సంఘ్‌పరివార్ అబద్ధాల పంచాంగంలో చేరినట్టేనని భావించవచ్చు. అబద్ధాన్ని ఒక శక్తివంతమైన సాధనంగా ప్రయోగించడంలో వారికి గల నేర్పు ఖ్యాతి తెలిసిందే. చరిత్రను గురించి, వర్తమాన సమాజాన్ని గురించి పచ్చి అబద్ధాలు పనిగట్టుకుని ఒకటికి వందసార్లు ప్రచారం చేసి వీళ్లు మనుషుల మెదళ్లను ఎంతగా విషపూరితం చేయగలరనడానికి గుజరాత్ అతిఘోరమైన ఉదాహరణ.

సోమనాథ్ దేవాలయంపైన దాడి జరిగినప్పుడు ఎంత మంది బ్రాహ్మణులను చంపారన్న దగ్గర మొదలుపెట్టి ఒక దీర్ఘమైన అబద్ధాల చిట్టాను తయారు చేసి గుజరాతీల మెదళ్లలో దట్టించారు.

'గుజరాత్ ప్రయోగాన్ని దేశమంతటా అమలు చేస్తామని ప్రవీణ్ తొగాడియాయే కాక అద్వానీలూ వెంకయ్యనాయుళ్లూ కూడ ప్రకటించిన తరువాత తొగాడియాను తీసుకొచ్చి మన రాష్ట్రంలోనూ మీటింగ్‌లు పెట్టారు. అప్పుడు అతని

సరసన వేదిక ఎక్కిన చినజియ్యర్ స్వామి నోట చిలకలూరిపేట అబద్ధం వింటున్నారంటే అర్థం ఇక్కడి చిట్టా కూడ తయారవుతున్నదనీ, అందులో ఈ ఘటనకు ప్రాముఖ్యం ఉండబోతున్నదనీ. సంఘ్ పరివార్ వ్యవహారశైలితో పరిచయం ఉన్న వాళ్ళెవరూ దీనిని చిన్న విషయంగా తీసి పారేయరు.

**నిగాహ్, ప్రజాతంత్ర వారపత్రిక**
**11 జూలై 2004**

# ఉరిశిక్ష : భారత్ జనజీవన స్రవంతిలోకి రావాలి

"బాధితుల కోరికలే ప్రామాణికమైతే చాలా ఇబ్బందికరమైన పరిస్థితులు ఎదురవుతాయి. నా గడ్డివాము తగలబెట్టిన వాడి గడ్డివామును కోర్టువారు తగలబెట్టడమే సరయిన శిక్ష అని నేను భావిస్తాను. నా చేయి విరగ్గొట్టిన వాడి చేయి కోర్టు వారు విరగ్గొట్టాలని కోరుకుంటాను. అయితే ఇప్పుడున్న న్యాయవ్యవస్థ అటువంటి శిక్షలు వేయదు. అటువంటి శిక్షలు వేయాలని ఎవరూ ప్రతిపాదించడమూ లేదు. బాధితుని కక్ష వేరే, న్యాయం వేరేనని ఇటువంటి నేరాల విషయంలో అందరూ గుర్తిస్తున్నారు. ఒక్క హత్య విషయంలో మాత్రమే నువ్వు చంపావు కాబట్టి నువ్వు కూడా చావవలసిందేనంటున్నారు. ఆ ఒక్క నేరానికున్న ప్రత్యేకత ఏమిటి?"

ఒక మైనర్ అమ్మాయిని రేప్ చేసి చంపిన ధనుంజయ్ చటర్జీకి ఉరిశిక్ష తప్పించడానికి రాష్ట్రపతి నిరాకరించడం దేశంలో చాలామందికి సంతోషం కలిగించే ఉంటుంది. ఈ దేశంలో ఇంకా న్యాయం బతికే వుందని అనిపించి ఉంటుంది.

కాని రాష్ట్రపతి నిర్ణయం దురదృష్టకరమైనదని అంటే రేపిస్టులు వర్ధిల్లాలనీ, బలహీనులను హతమార్చడం నేరం కాదనీ అర్థం కాదు. బాధితులు (వారు చనిపోయి వుంటే వారి బంధుమిత్రులు) నేరస్తులను తప్పనిసరిగా క్షమించాలని కూడ ఎవరూ అనడం లేదు. ధనుంజయ్ ఛటర్జీ చేతిలో చనిపోయిన అమ్మాయి తోబుట్టువులు అతనిపైన కక్షగట్టి ప్రతీకారం తీర్చుకోవడం న్యాయమా అన్యాయమా అన్న ప్రశ్నకూ, అతనికి చట్టం ఉరిశిక్ష వేయడం సబబా అన్న ప్రశ్నకు సంబంధం లేదు. ఇవి రెండూ ఒకటేననుకోవడం వల్ల ఉరిశిక్ష రద్దు గురించి మాట్లాడేవాళ్లు బాధితుల న్యాయమైన ఆగ్రహాన్ని తృణీకరించే వారిగా భావించబడుతున్నారు.

మనుషులకు కక్షలుంటాయి, కోపతాపాలుంటాయి. కష్టం కలిగిస్తే ప్రతీకారం కోరుకుంటారు, నష్టం చేసిన వారికి తిరిగి నష్టం చేయాలనుకుంటారు. అందరూ గ్లాడిస్ స్టెయిన్స్ కాలేరు. అయితే సంతోషిస్తామేమో గానీ అయి తీరాలని అనలేము.

ప్రశ్న అది కాదు, న్యాయవ్యవస్థ తనను తాను అదే నమూనాలో భావించుకోవచ్చునా అనేది ప్రశ్న. నేరాల బాధితుల తరపున అధికారికంగా ప్రతీకారం తీర్చుకునే యంత్రాంగమా న్యాయవ్యవస్థ అనేది ప్రశ్న. వ్యక్తి తన కోసం నేరం చేస్తాడు. తన అవసరాల కోసమో కోరిక మేరకో ఆవేశం వల్లనో నేరం చేస్తాడు. న్యాయవ్యవస్థ సమాజం తరఫున స్పందిస్తుంది. నేరం జరగడం వల్ల చెదిరిన సామాజిక భద్రతను తిరిగి నిలబెడుతుంది. ఇది నా వ్యాఖ్యానం కాదు. ప్రస్తుతం అధికారికంగా ఆమోదం పొందిన న్యాయశాస్త్రం చెప్పే వ్యాఖ్య ఇది. మరి అటువంటి న్యాయవ్యవస్థ తనను తాను బాధితుల స్థానంలో నిలబెట్టుకొని వారి తరఫున ప్రతీకారం తీర్చుకోవడం తగునా?

బాధితుల కోరికలే ప్రామాణికమైతే చాలా ఇబ్బందికరమైన పరిస్థితులు ఎదురవుతాయి. నా గడ్డివాము తగలబెట్టిన వాడి గడ్డివామును కోర్టువారు తగలబెట్టడమే సరయిన శిక్ష అని నేను భావిస్తాను. నా చేయి విరగ్గొట్టిన వాడి

చేయి కోర్టు వారు విరగ్గొట్టాలని కోరుకుంటాను. అయితే ఇప్పుడున్న న్యాయవ్యవస్థ అటువంటి శిక్షలు వేయదు. అటువంటి శిక్షలు వేయాలని ఎవరూ ప్రతిపాదించడమూ లేదు. బాధితుని కక్ష వేరే, న్యాయం వేరేనని ఇటువంటి నేరాల విషయంలో అందరూ గుర్తిస్తున్నారు. ఒక్క హత్య విషయంలో మాత్రమే నువ్వు చంపావు కాబట్టి నువ్వు కూడా చావవలసిందేనంటున్నారు. ఆ ఒక్క నేరానికున్న ప్రత్యేకత ఏమిటి?

మన ప్రభుత్వాలు ఎవరెవరినో 'జన జీవన స్రవంతి'లో కలవమంటుంటాయి. అంటే అర్థం మెజారిటీ ప్రజలు బతికినట్టు బతకమని. ఉరిశిక్ష విషయంలో భారత్ కూడా జన జీవన స్రవంతిలో కలవవలసి ఉంది. ప్రపంచంలో మెజారిటీ దేశాలు ఈ రోజు మరణదండన విధించడం మానేసాయి. కొన్ని దేశాలు చట్టం నుండే ఈ శిక్షను తొలగించగా, కొన్ని దేశాలు ఉరిశిక్ష విధింపు మీద మారటోరియమ్ విధించాయి. మరణదండన విషయంలో చాలా మూర్ఖంగా వ్యవహరిస్తున్న మూడు పెద్ద దేశాలలో భారత్ ఒకటి (అమెరికా, చైనా తక్కిన రెండు).

దీనికి ఏం జవాబు చెప్పబోతారో ఊహించగలము. మరణదండన రద్దుకు పట్టుబడుతున్నది నార్వే, స్వీడన్ వంటి సంపన్నమైన యూరోపియన్ దేశాలనీ, అనేక రూపాలలో హింసను ఎదుర్కొంటున్న భారత్ వంటి పేదదేశానికి అది ఆచరణయోగ్యంకాని ఆదర్శమనీ అనబోతారు. అయితే ఐక్యరాజ్య సమితిలో మరణదండనను నిషేధించే విషయంలో ముందు నిలబడ్డది సంపన్నమైన యూరోపియన్ దేశాలు కావు. ఉరుగ్వే, కొలంబియా వంటి మన తోటి పేదదేశాలే మొదటి నుంచి ఈ విషయంలో చురుకయిన పాత్ర పోషిస్తున్నాయి. ఈ దేశాలు మనం ఎదుర్కొంటున్న అన్ని సమస్యలూ ఎదుర్కొంటున్నాయి. పేదరికం, అల్లర్లు, అలజడి, టెర్రరిజం అన్నీ ఎదుర్కొంటున్నాయి. కానీ వాటిని తిప్పికొట్టడానికి మరణదండన అక్కరలేదని దృఢంగా విశ్వసిస్తున్నాయి.

ధనుంజయ్ ఛటర్జీ చేసిన నేరం పట్ల ఎవరికీ సానుభూతి ఉండే అవకాశం లేదు కాబట్టి అతనికి క్షమాభిక్ష పెట్టడానికి రాష్ట్రపతి నిరాకరించడం ఆందోళనకు దారి తీయలేదు. అయితే వేరే కొన్ని కేసులు గురించి మనం త్వరలో వినబోతాం. జార్ఖండ్ రాష్ట్రానికి సంబంధించిన ఒక కేసులో పీపుల్స్‌వార్‌తో సంబంధమున్న కొందరు ముద్దాయిల ఉరిశిక్ష అన్ని స్థాయిల్లోనూ ధృవీకరించబడి ఇప్పుడు క్షమాభిక్ష కోసం రాష్ట్రపతి ముందుకొచ్చింది. రాజీవ్‌గాంధీ హత్యకేసు

ముద్దాయిలయిన నలుగురు ఎల్‌టిటిఇ కార్యకర్తల కేసు కూడా అంతే. డిసెంబర్ 13 పార్లమెంటు దాడి కేసులో కాశ్మీరీ యువకులకు పడిన ఉరిశిక్ష ఇప్పుడు సుప్రీంకోర్టులో అప్పీల్‌లో ఉంది. అక్కడ డిస్మిస్ అయినట్టయితే క్షమాభిక్ష పిటిషన్ రాష్ట్రపతి ముందుకొస్తుంది. మైసూరు లూటీకేసులో ముద్దాయిలైన వీరప్పన్ అనుచరుల కేసు మరీ చిత్రమైనది. సెషన్స్ కోర్టు వారికి జీవిత ఖైదు మాత్రమే విధించగా, సుప్రీంకోర్టు దానిని మరణదండనగా మార్చింది. ఇప్పుడు వారి క్షమాభిక్ష అర్జీ కూడా రాష్ట్రపతి ముందుంది.

ఈ కేసుల విషయం చర్చకొచ్చినప్పుడు ఆ ఘటనల సామాజిక రాజకీయ పూర్వాపరాలను పరామర్శించకుండా ఉండటం సాధ్యం కాదు. ధనుంజయ్ ఛటర్జీ విషయంలో సహితం సామాజిక సంస్కృతిని విస్మరించి తప్పంతా వ్యక్తి మీదే పెట్టడం సరయినది కాకపోయినా అతను చేసిన నేరం ఘోరమైనది కావడం వల్ల దబాయించి నోరు మూయించవచ్చు. కానీ తక్కిన కేసుల విషయంలో అది సాధ్యం కాదు. ఒక వ్యక్తి చేసే నేరానికి పరిస్థితుల బాధ్యత ఎంత, సమాజం బాధ్యత ఎంత, అతని బాధ్యత ఎంత అనే ప్రశ్న వేసుకోవాలి. శిక్ష యావత్తు నేరం చేసిన వ్యక్తే ఎందుకు మోయాలి అన్న ప్రశ్న కూడా వేసుకోవాలి.

**నిగాహ్, ప్రజాతంత్ర వారపత్రిక**

**8 ఆగస్టు 2004**

# ఉరిశిక్షలు ఇంకా విధించవలసిందేనా?

"న్యాయవ్యవస్థ వ్యక్తి కాదు. అది సమాజానికి ప్రతిరూపం. తన కట్టుబాట్లను, తన నియమాలను అతిక్రమించిన తన సభ్యులను చక్కబెట్టడానికి సమాజం ధరించే రూపం న్యాయవ్యవస్థ. అది క్రూరమైన నేరాలు చేసిన వారిపట్ల సహితం క్రూరంగా వ్యవహరించడానికి వీలులేదు. క్రూరత్వం ఏ సమాజమూ ఆమోదించే విలువ కాదు కాబట్టి సామాజిక విలువలను, ప్రమాణాలను నిలబెట్టే లక్ష్యం గల న్యాయస్థానాలు క్రూరంగా నడుచుకోజాలవు."

మరణదండన ఉచితానుచితాల గురించి ఇంకొకసారి మాట్లాడుకునే సందర్భం వచ్చింది.

డిసెంబర్ 13, 2001 నాడు పార్లమెంటుపైన జరిగిన దాడి కేసులో ఉరిశిక్ష పడిన మహమ్మద్ అఫ్జల్‌ను అక్టోబర్ 20వ తేదీన ఉరితీయబోతున్నట్లు అధికారులు ప్రకటించారు. అతను రాష్ట్రపతిని క్షమాభిక్ష కోరబోనని చెప్పినా, అతని భార్య, ఇతర కుటుంబ సభ్యులు కోరారు. హక్కుల సంఘాలూ అతని శిక్షను జీవిత ఖైదుగా మార్చమని రాష్ట్రపతిని కోరాయి. కాశ్మీర్ లోయలో ప్రజాందోళన చెలరేగగా, దానికి స్పందిస్తూ ఆ రాష్ట్రాన్ని పరిపాలిస్తున్న కూటమిలోని రెండు పార్టీల ప్రముఖులు కూడా రాష్ట్రపతికి ఉరిశిక్ష తప్పించమని విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రపతికి ఈ విజ్ఞప్తులు అందాయో లేదో గానీ దేశభక్తి మీద శాశ్వత లీజు ఉన్న భారతీయ జనతా పార్టీ నాయకులు దాని మీద విరుచుకుపడ్డారు. ఈ ప్రయత్నమే దేశద్రోహం అన్నారు. వాళ్ళలాగే ఆలోచించే వాళ్ళు దినపత్రికలకు పుంఖాను పుంఖాలుగా ఉత్తరాలు రాస్తున్నారు. దేశ పార్లమెంటుపైననే దాడిచేసి పార్లమెంటు సభ్యులందరినీ హతమార్చ పూనుకున్న దుర్మార్గులకు మరణదండన కాక ఏం దండన వేయాలని ఆవేశంతో ఊగిపోతున్నారు.

భారతీయ జనతా పార్టీ గురించి ఇప్పుడెక్కువ మాట్లాడనక్కరలేదు. వారి మిత్రుడు దారాసింగ్‌కు గ్రహం స్టెయిన్స్‌ను, అతని కొడుకులిద్దరినీ అతిక్రూరంగా తగలబెట్టి చంపిన కేసులో సెషన్స్ కోర్టు ఉరిశిక్ష విధించి ఉంది. ఆ కేసు అప్పీల్‌లో నలుగుతున్నట్టుంది. సుప్రీంకోర్టు సహితం ఆ శిక్షను ధృవీకరించి దారాసింగ్‌ను ఉరితీయటానికి ఒక తేదీ ప్రకటించిన నాడు రాజ్‌నాథ్‌సింగ్‌గారు ఇవే మాటలు మాట్లాడుతారేమో చూద్దాం. హక్కుల సంఘాలు మాత్రం ఈ రోజు చేస్తున్న విజ్ఞప్తే ఆ రోజూ చేస్తాయి. దారాసింగ్ కుటుంబసభ్యులు ఈ రోజు మహమ్మద్ అఫ్జల్ కుటుంబసభ్యులు చేస్తున్న విజ్ఞప్తే ఆ రోజూ చేయబోతారు. మరి ఈ రోజు గులాంనబీ ఆజాద్ నిర్వహిస్తున్న పాత్ర ఆ రోజు నరేంద్రమోడి తన మీద వేసుకోబోడా? అతను ఏ కారణంగా ఊరుకున్నా ప్రవీణ్‌తొగాడియాలు, గిరిరాజ్ కిషోర్‌లు, అశోక్‌సింఘాల్‌లు ఊరుకోరు. వాళ్ళతో ఆ రోజు మాట్లాడుదాం. పార్లమెంటులోని సభ్యులందరినీ చంపడం కంటే కుష్టురోగులకు సేవ చేస్తూ బతికిన గ్రహం స్టెయిన్స్‌ను చంపడం ఎక్కువ ఘోరం అనంటే ఏమంటారో, ముక్కుపచ్చలారని ఇద్దరు చిన్నపిల్లలను కేవలం అతని సంతానం అయినందుకు హతమార్చడం ఇంకా ఘోరమనీ అంటే ఏమంటారో, చూద్దాం.

హక్కుల ఉద్యమానికి సంబంధించినంత వరకు, మరణదండన అనుచితం అన్న అభిప్రాయానికి ఆ వ్యక్తి చేసిన నేరంతో నిమిత్తం లేదు. ఒక వ్యక్తి మరొక వ్యక్తి ప్రాణం తీయడానికి న్యాయమైన కారణాలుంటాయి, అన్యాయమైన కారణాలుంటాయి. తాగుబోతులు చేసే హత్యలు లాగ నిష్కారణమైనవీ ఉంటాయి. అయితే న్యాయవ్యవస్థ వ్యక్తి కాదు. అది సమాజానికి ప్రతిరూపం. తన కట్టుబాట్లను, తన నియమాలను అతిక్రమించిన తన సభ్యులను చక్కబెట్టడానికి సమాజం ధరించే రూపం న్యాయవ్యవస్థ. అది క్రూరమైన నేరాలు చేసిన వారిపట్ల సహితం క్రూరంగా వ్యవహరించడానికి వీలులేదు. క్రూరత్వం ఏ సమాజమూ ఆమోదించే విలువ కాదు కాబట్టి సామాజిక విలువలను, ప్రమాణాలను నిలబెట్టే లక్ష్యం గల న్యాయస్థానాలు క్రూరంగా నడుచుకోజాలవు.

ప్రాచీన కాలం నుండీ కూడ తత్వవేత్తలు అడపాదడపా ఈ రకమైన అభిప్రాయాలు వ్యక్తం చేసినప్పటికీ, 19వ శతాబ్దపు యూరప్‌లో మాత్రమే ఇదొక రాజకీయ చర్చ అయింది. 20వ శతాబ్దంలో మరణదండన రద్దు అనేది అంతర్జాతీయ స్థాయిలో ఉద్యమ రూపం తీసుకుంది. 1950 తరువాత ఒక్కొక్క దేశమూ మరణదండనను రద్దు చేయడం మొదలయింది. ఆర్థిక అభివృద్ధితో తళతళ మెరిసిపోయే అమెరికాలాంటి దేశాలు, తమది అత్యంత ప్రాచీన నాగరికత అని మురిసిపోయే భారత్‌లాంటి దేశాలు కాక, మామూలుగా వెనుకబాటుతనాన్ని గురించి, సామాజిక అశాంతి గురించి చర్చ వచ్చినప్పుడే ప్రస్తావనకు వచ్చే లాటిన్ అమెరికా దేశాలే ఈ ఒరవడిలో ముందున్నాయి. 20వ శతాబ్దం చివరి కొచ్చేసరికి ప్రపంచదేశాలలో 118 దేశాలు మరణదండన విధించడం మానేసాయి. 76 దేశాలు మాత్రం ఇంకా విధిస్తున్నాయి. (ఇటీవలే విడుదలైన ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ నివేదిక ప్రకారం) మానేసిన దేశాలలో కొన్ని దానిని చట్టం నుండి పూర్తిగా తొలగించేసాయి. కొన్ని యుద్ధ నేరాలకు మాత్రం పరిమితం చేసాయి. కొన్ని చట్టంలో ఉన్నప్పటికీ ఆచరణలో మరణ దండనను నిలిపేశాయి. ఉరిశిక్ష విధిస్తున్న దేశాలలో చైనా, అమెరికా అగ్రభాగాన ఉండగా, భారత్‌లో ఈ మధ్యనే ఉరిశిక్షల అమలు పెరిగింది. 'అరుదయిన వాటిలోకీ అరుదయిన కేసులలో మాత్రమే ఉరిశిక్ష వేయాలి' అని భారత సుప్రీంకోర్టు సూత్రీకరించినందువల్ల కొన్నేళ్ళ కిందటి వరకు మరణదండన అమలు చాలా అరుదుగా ఉండేది. ఒకవేళ సెషన్స్ కోర్టు మరణదండన విధించినా, పై కోర్టులు సామాజిక, మానసిక కారణాలను లెక్కలోకి తీసుకొని జీవిత ఖైదుగా మార్చేవి. అయితే ఈ మధ్య కాలంలో సుప్రీంకోర్టు నేరస్తులపట్ల కఠినంగా వ్యవహరించాలి అనే 'మూడ్'లోకి

వచ్చిన కారణంగా, కింది కోర్టులు పోనీలే అనుకున్న ఘటనలలో కూడా పై కోర్టులు ఉరిశిక్ష విధిస్తున్న కేసులు చూస్తున్నాం.

మహమ్మద్ అఫ్జల్‌కు 'పార్లమెంటుపైన దాడి' కేసులో శిక్ష పడిందని పత్రికలలో రాస్తున్నందువల్ల అతను ప్రత్యక్షంగా ఆ దాడిలో పాల్గొన్నాడని చాలామంది అనుకుంటుండవచ్చు. ప్రత్యక్షంగా పాల్గొన్న అయిదుగురు అక్కడికక్కడే ఎన్‌కౌంటర్‌లో చనిపోయారు. కోర్టులో బోనెక్కిన వారంతా ఆ అయిదుగురికీ ఆ నేరానికి పాల్పడడానికి సహాయ సహకారాలందించారన్న అభియోగం ఉన్నవారే. నేరానికి సహాయ సహకారాలందించడమూ నేరమే గానీ దానికి సహితం మరణదండన విధించడం 'అరుదైన వాటిలోకీ అరుదయిన ఘటనలకు మాత్రమే మరణదండన పరిమితం కావాలి' అన్న ప్రమాణం ప్రకారం తగునా? తగునని సుప్రీంకోర్టు భావించింది గానీ అది తగునో కాదో సమాజం ఆలోచించవలసిందే.

అఫ్జల్ విషయంలో కాశ్మీర్‌లో జరుగుతున్న ఆందోళనను విపరీత చర్యగా భావించే ముందు వారి కళ్లతో విషయాన్ని చూడాలి. గడచిన 16 సంవత్సరాలలో వేలాదిగా కాశ్మీరీలు భారత సైన్యం, పారా మిలిటరీల చేతిలో చనిపోయారు. తుపాకులు పట్టుకున్న మిలిటెంట్లే కాదు, నిరాయుధులైన పౌరులూ చాలామంది చనిపోయారు. ఊరేగింపుల మీద జరిగిన కాల్పులలో అయిదుగురు, పదిమంది చొప్పున చనిపోయిన ఘటనలనేకం దేశంలోని ఇతర ప్రాంతాలలోను జరిగాయి గానీ, 40 మంది, 60 మంది చనిపోయిన ఘటనలు కాశ్మీర్‌లో మాత్రమే జరిగాయి. ఈ విపరీత ప్రాణనష్టానికి ఏ సైనిక అధికారిపైనా, ఏ పోలీసు అధికారిపైనా ఎటువంటి విచారణా జరపలేదు, ఎవరినీ శిక్షించలేదు. అటువంటప్పుడు పార్లమెంటుపైన దాడికి సహకరించిన పాపానికి అఫ్జల్‌కు మరణదండన విధించడం ఏం న్యాయం అన్న ప్రశ్నకు భారత్ దగ్గర ఏం జవాబు ఉంది?

నిజానికి అఫ్జల్ మొదటి నుండీ తన పాత్రను కాదనలేదు. భారత్ మీద దాడిచేసే వాళ్ళకు సహాయం చేసాను, చేస్తాను, అందులో తప్పేమీ లేదన్నట్టు మాట్లాడాడు. తన తోటి ముద్దాయిలయిన గిలానీ, షౌకత్, అఫ్సాన్ గురుల పాత్ర ఏమీ లేదనీ, పార్లమెంటుపైన దాడిచేసిన మిలిటెంట్లకు సహాయపడింది తానేననీ అన్నాడు. దాడి చేసిన మిలిటెంట్లందరూ పాకిస్తానీలన్న ఢిల్లీ పోలీసుల అభిప్రాయం ఎంత నిజమోగానీ వారికి సహాయం చేసినందుకు విచారణ

ఎదుర్కొన్న వారంతా కాశ్మీరీలేననేది సత్యం. భారత పాలనా వ్యవస్థపైన ఎవరు దాడిచేసినా, ఏ నష్టం తలపెట్టినా వారికి సహాయపడడంలో తప్పులేదనే వైఖరి కాశ్మీరీలలో నెలకొనడం వెనుక సుదీర్ఘమైన చరిత్ర ఉంది. ఆ చరిత్రను ఏమాత్రం నిష్పాక్షికంగా సమీక్షించినా అందులో భారత్ తప్పిదం చాలా ఉందని అర్థం అవుతుంది. ఆ చరిత్రను తలచుకోవడానికీ సమీక్షించడానికీ భారతీయులు సిద్ధంగా లేకపోవచ్చును గానీ కాశ్మీరీలు దానిని మరచిపోలేరు. ఇవ్వాళ వాళ్ళు అనుభవిస్తున్న వేదన ఆ చరిత్ర పర్యవసానమే అయినప్పుడు ఎట్లా మరచిపోగలరు? గులాంనబీ ఆజాద్ సగటు కాంగ్రెస్‌వాది కంటే గొప్ప విలువలు గలవాడు కాకపోయినా ఆ చరిత్ర అతనికీ తెలుసును. దాని గురించి ప్రజలలో ఉన్న అభిప్రాయమూ, అది రగిల్చే ఆవేదనా విస్మరించదగ్గవి కాదన్న కనీస రాజకీయ స్పృహ అతనిలో కొరవడడం సాధ్యం కాదు. దీనిని వోటుబ్యాంకు రాజకీయం అనగల భారతీయ జనతాపార్టీ నాయకుల విజ్ఞత గురించి ఆందోళన చెందనవసరం లేదు గానీ సగటు భారతీయులు ఆ స్థాయిని దాటి ఆలోచించలేకపోతే ఆందోళన చెందవలసిందే. అయితే కాశ్మీరీల మనోభావాల గురించి ఆ లోయ వెలుపలి ప్రజానీకంలో ఏ మాత్రం అవగాహన లేకపోవడం 'కాశ్మీర్ సమస్య' అని పిలవబడే సంక్షోభం పరిష్కారం కాకపోవడానికొక ముఖ్య కారణం అన్న విషయాన్ని ఈ ఉదంతం మరొకసారి రుజువు చేసిందని సరిపెట్టుకోవాలేమో.

**నిగాహ్, ప్రజాతంత్ర వారపత్రిక**
**1 అక్టోబర్ 2006**

# ఎవరికి సంకేతాలు పంపడానికి అఫ్జల్‌ను ఉరితీయాలి?

"ఇటువంటి కేసులలో ఎక్కడో రాజకీయం ప్రవేశిస్తుంది. న్యాయస్థానాలు న్యాయనిర్ణయం చేయడం ఆపేసి ఏవో రాజకీయ కర్తవ్యాలు మీద వేసుకుంటాయి. 'భారత ప్రజల మనోభావాలు' అన్నారు గానీ న్యాయస్థానాలు స్పందించింది దానికి కూడ కాదు. పాకిస్తాన్‌కు, ఇస్లాం పేరు మీద హింస చేసే సంస్థలకు ఏదో సందేశం పంపడం అవసరం అని భావించారు. 'భారతదేశం ప్రజాస్వామ్యమని కదా మీకంతా ఇంత చులకన? ఇక్కడేం చేసినా సాగుతుందని కదా మీ అభిప్రాయం? ఆ ప్రజాస్వామ్య చిహ్నమైన పార్లమెంట్‌పైనే దాడిచేసి భారత్‌ను వెక్కిరిద్దామనుకున్నారా? మీ వాడిని ఉరితీస్తాం చూడండి. మేము చేతకాని వాళ్ళం కామని రుజువు చేస్తాం చూడండి'. ఇదీ న్యాయస్థానాలతో సహా అన్నీ తెలిసిన, తెలిసి ఉండవలసిన భారతీయుల వైఖరి."

ఇష్టమొచ్చిన పని చేసేసి, 'ప్రజలు కోరుకుంటున్నారు కాబట్టి చేశాను' అనడం తెలిసిందే. ఈ మధ్య న్యాయస్థానాలు కూడా కఠినమైన శిక్షలు వేసి 'ప్రజలు కోరుకుంటున్నారు' అనడం మొదలుపెట్టాయి. గాయపడ్డ భారత ప్రజల మానసిక ఆవేదనకు ఉపశమనం లభించాలంటే మహమ్మద్ అఫ్జల్‌ను ఉరితీయవలసిందేనని సుప్రీంకోర్టు ప్రకటించి అఫ్జల్‌కు కింది కోర్టు విధించిన మరణశిక్షను ధృవీకరించింది.

ఇది అర్థంలేని వాదన. భారత ప్రజల మనోభావాలు సుప్రీంకోర్టుకు ఎట్లా తెలుసన్న ప్రశ్నను పక్కన పెడదాం. అసలు అఫ్జల్ మీద ఉన్న నేరారోపణ ఏమిటో, దానికి మద్దతుగా ఏపాటి సాక్ష్యాలు పోలీసులు సేకరించారో భారత ప్రజానీకానికి తెలుసా? తెలియనప్పుడు అతనికి ఏ శిక్ష వేయాలన్న చర్చకు 'భారత ప్రజల' మనోభావాలతో ఏం సంబంధం ఉండగలదు? సగటు భారత పౌరులు మహమ్మద్ అఫ్జల్ ప్రత్యక్షంగా పార్లమెంట్‌పైన జరిగిన దాడిలో పాల్గొన్నాడనో, లేదా తానే వెనకుండి కుట్రపన్ని నడిపించాడనో అనుకుంటుండవచ్చు. కాని ఇది నిజం కాదని సుప్రీంకోర్టుకు తెలుసును.

13 డిసెంబర్ 2001 నాడు పార్లమెంట్‌పైన జరిగిన దాడిలో పాల్గొన్న వారందరూ అక్కడికక్కడే ఎదురుకాల్పులలో మరణించారు. ఆ తరువాత నేర విచారణ ఎదుర్కొన్న మహమ్మద్ అఫ్జల్, షౌకత్ హుస్సేన్ గురు, ఎస్.ఏ.ఆర్. గిలానీ, అఫ్సాన్ గురులు దాడి జరిగిన సమయంలో అక్కడ ఉండి పాల్గొన్నారన్నది కాదు పోలీసుల అభియోగం – చనిపోయిన ఐదుగురు, ఈ నలుగురు, పాకిస్తాన్‌లో ఉన్న ఘాజీబాబా, మౌలానా మసూద్ అజర్, అబు జిహాదీ, తారిక్ అహమ్మద్ అనే వాళ్ళంతా ఈ నేరానికి కుట్ర చేశారనీ, ఆ కుట్ర ఫలితమే చనిపోయిన ఐదుగురు చేసిన దాడి అనీ వాళ్ల అభియోగం. వీరందరూ పాకిస్తాన్ కేంద్రంగా గల జైష్–ఇ–మహమ్మద్ అనే సాయుధ మతవాద సంస్థ సభ్యులనేది పోలీసు కథనం.

పార్లమెంట్‌పైన దాడి జైష్–ఇ–మహమ్మద్ పనేనని ఆరోపించడమే కాక, ప్రసార మాధ్యమాలలో విస్తృతంగా ప్రచారం చేశారు. అయితే కేసు విచారణ సమయంలో దీనికి ఆధారంగా ఏ ఒక్క సాక్ష్యం చూపించలేదు. విశ్వసనీయ సాక్ష్యం కాదు, ఎటువంటి సాక్ష్యమైనా ఆవగింజంత కూడ చూపించలేదు. పోనీ

పాకిస్తాన్‌కు చెందిన జైష్-ఇ-మహమ్మద్ నాయకులు ఘాజీబాబా, మౌలానా మసూద్ అజర్‌లతో నేర విచారణ ఎదుర్కొన్న నలుగురికీ సంబంధాలు ఉన్నాయన్న సాక్ష్యమేమైనా ప్రవేశపెట్టారా అంటే అదీ లేదు. ఉన్న సాక్ష్యమంతా ఏమిటంటే చనిపోయిన అయిదుగురి వద్దా, మహమ్మద్ అఫ్జల్ వద్దా స్వాధీనం చేసుకున్నట్లు చెప్తున్న సెల్‌ఫోన్‌ల ద్వారా పాకిస్తాన్‌కు, సౌదీ అరేబియాకు చాలాసార్లు ఫోన్లు చేసినట్టు చూపించే ఆధారాలు. ఆ ఫోన్‌లు ఆ దేశాలలో ఎవరికి చేశారన్న ఆధారాలు ఏమీ లేవు. పాకిస్తాన్‌లో జైష్-ఇ-మహమ్మద్ కార్యకర్తలే కాక కొన్ని కోట్ల మంది వేరే ప్రజలున్నారు. భారతదేశవాసులకూ వారికీ సంబంధ బాంధవ్యాలున్నాయి. కాబట్టి ఎవరినైనా పట్టుకొని నీ సెల్‌ఫోన్ ద్వారా నువ్వు డజన్‌సార్లు పాకిస్తాన్‌లో ఎవరితోనో మాట్లాడావంటే దానితో రుజువయ్యేదేమీ లేదు.

పోనీ దాడిచేసి చనిపోయిన అయిదుగురూ జైష్-ఇ-మహమ్మద్ కార్యకర్తలన్న ఆధారాలేవయినా ఉన్నాయా అంటే వారి ఊరూ పేరూ కూడా తెలియదు. వారి పొడిపేర్లు మాత్రమే తెలుసు. ఒకరిపేరు మహమ్మద్ అంట. ప్రపంచంలో ప్రతీ రెండవ ముస్లిం పురుషుడి పేరూ మహమ్మదే. మరిద్దరు రాజా, రాణా అవి ముస్లింల పేర్లే కానక్కరలేదు. మిగిలిన ఇద్దరూ హంజు, హైదర్. ముందు పేరూ వెనక పేరూ ఊరి పేరూ తెలీదు. ఏ సంస్థకు చెందినవారో తెలీదు. ఏ దేశస్తులో తెలీదు.

కాబట్టి పార్లమెంట్‌పైన దాడి జైష్-ఇ-మహమ్మద్ పని అనడానికి ఆవగింజంత సాక్ష్యం కూడా లేదు. విశ్వసనీయమైన సాక్ష్యం కాదు, ఏ సాక్ష్యమూ లేదు.

ఇక మిగిలింది కుట్ర. అఫ్జల్ తదితరులు చనిపోయిన అయిదుగురు అనామకులతో కలిసి పార్లమెంట్‌పైన దాడి చేయడానికి కుట్ర చేశారనడానికి ఏం ఆధారాలు చూపించారు? కుట్ర అంటే అర్థం - ఉద్దేశ్యం, అంగీకారం అని న్యాయ సిద్ధాంతం అంటుంది. కుట్రదారులందరికీ ఫలానా (నిర్దిష్టమైన) లక్ష్యం సాధించాలన్న ఉద్దేశ్యం ఉండాలి. దాని సాధన కోసం పనిచేయాలన్న అంగీకారం ఉండాలి.

అఫ్జల్ తదితరులకు పార్లమెంట్‌పైన దాడి జరపాలన్న లక్ష్యం ఉన్నట్టుగానీ, చనిపోయిన అయిదుగురికి అటువంటి లక్ష్యం ఉండిందన్న విషయం తెలిసినట్టు

గానీ ఏ సాక్ష్యమూ లేదు. విశ్వసనీయమైన సాక్ష్యం లేదనడం లేదని మళ్లీ చెప్పాలి. అసలు ఏ సాక్ష్యమూ లేదు.

ఉన్న సాక్ష్యమేమిటి? పోలీసులు అఫ్జల్ అద్దెకు తీసుకుని నివసిస్తున్న గది మీద దాడి చేసినప్పుడు అక్కడ పేలుడు పదార్థాలు దొరికాయని సాక్ష్యం ప్రవేశపెట్టారు. పేలుడు పదార్థాలను అనుమతి లేకుండా కలిగి ఉండటం నేరమేగాని, వాటిని పార్లమెంట్‌పైన దాడి చేయడానికి కుట్రలో భాగంగా అఫ్జల్ తెచ్చిపెట్టుకున్నాడని నమ్మడానికి ఆధారమేమీ లేదు. దాడిలో చనిపోయిన మహమ్మద్ అని పేరు పెట్టబడ్డ అనామకుడు దాడికి కొద్ది సమయం ముందు తన సెల్‌ఫోన్ ద్వారా అఫ్జల్‌తో సంభాషించాడనీ, అతని దగ్గర దొరికిన ఒక కాగితం మీద అఫ్జల్ సెల్‌ఫోన్ నెంబర్ ఉందనీ ఆధారాలు చూపించారు. అఫ్జల్ కొందరు వ్యక్తులతో తిరుగుతుండగా చూశామనీ, ఆ వ్యక్తులు పార్లమెంట్‌పైన దాడి చేసినవారనీ, వారి శవాల ఫోటోలను బట్టి గుర్తుపట్టామనీ కొందరు సాక్షులు చెప్పారు. అయితే ఈ రకమైన ఫోటో గుర్తింపు విశ్వసనీయమైనది కాదని కర్తార్‌సింగ్ కేసులో సుప్రీంకోర్టు ప్రకటించింది. శవం ఫోటో సంగతి పక్కన పెట్టండి. బతికున్నప్పటి ఫోటో ద్వారా మనిషిని గుర్తుపట్టే సాక్ష్యం సహితం విశ్వసనీయం కాదని సుప్రీంకోర్టు అన్నది. ఫోటో గుర్తింపును సాక్ష్యంగా పరిగణించడాన్ని అనుమతించే 'టాడా' చట్టంలోని సెక్షన్ 22 చెల్లదని సుప్రీంకోర్టే కొట్టేసింది.

పోనీ సాక్ష్యమంతా నమ్మినా తేలేది ఏమిటంటే పార్లమెంట్‌పైన దాడి చేసిన వ్యక్తులతో అఫ్జల్‌కు సంబంధం ఉండింది; వాళ్ళు అతని సహాయం తీసుకున్నారు; అతను వారికి సహాయం చేశాడు. అంతమాత్రం చేత వారి నిర్దిష్ట లక్ష్యం (పార్లమెంట్‌పైన దాడి చేసి పార్లమెంట్ సభ్యులను, కేంద్ర మంత్రివర్గ సభ్యులను హతమార్చాలన్న లక్ష్యం) అతనికి తెలుసనీ, అతను దానికోసం పనిచేశాడనీ నిర్ధారించగలమా? కామన్‌సెన్స్ ప్రకారం చూసినా అటువంటి లక్ష్యంగలవాళ్ళు తమకు సహాయం అందిచ్చిన వారందరికీ తమ కార్యక్రమమంతా చెప్పరు. వారికి ఎంత తెలియాలో అంతే చెప్తారు. రహస్య సంస్థల పనితీరే అంత.

తన రాజకీయ లక్ష్యంలో భాగంగా ఒకరిని చంపడానికి పూనుకున్న ఒక రాజకీయ కార్యకర్తకు ఆ పని చేయడానికి మోటార్ సైకిల్ అవసరమయిందనుకోండి. ఒక గంట కోసం మోటార్ సైకిల్ ఇప్పించమని తన

రాజకీయాల పట్ల సానుభూతి గల వ్యక్తిని అడిగాడనుకోండి, అతను ఇప్పిస్తాడు. ఇతను దాని మీద పోయి హత్యచేసి బండి వాపస్ ఇచ్చేస్తాడు. బండి ఇప్పించిన వ్యక్తి ఆ హత్యకు కుట్రదారుడంటే సాధారణ ఆలోచనారీతీ ఒప్పుకోదు, చట్టమూ ఒప్పుకోదు. అఫ్జల్‌కు వ్యతిరేకంగా పోలీసులు ప్రవేశపెట్టిన సాక్ష్యమంతా నమ్మినా అతని పాత్ర ఇంతకంటే ఎక్కువని నిర్ధారించడానికి ఏ ఆధారమూ లేదు. అతనికి శిక్ష అంటూ వేస్తే అనుమతి లేకుండా పేలుడు పదార్థాలు కలిగి ఉన్నందున శిక్ష వేయాలి. దానికి పేలుడు పదార్థాల చట్టం కింద ఐదు సంవత్సరాల నుండి జీవిత ఖైదు దాకా ఉండగలదు. ఆ నేరానికి జీవితఖైదు సాధారణంగా వేయరు. మరణదండన వేసే అవకాశం అసలే లేదు.

వాళ్ళ లక్ష్యాలు తెలియకుండా అఫ్జల్ వాళ్ళకు సహాయం ఎందుకు చేస్తాడు? అన్న సందేహం రావచ్చు. కాశ్మీరీల గురించి ఏమాత్రం తెలిసినా అటువంటి సందేహం రావడానికి ఆస్కారం లేదు. కాశ్మీర్ కోసం భారత్ పదిహేడు సంవత్సరాలుగా చేస్తున్న యుద్ధంలో అరవైవేలకు పైగా ప్రాణాలు పోయాయి. వీటిలో భారత సైనిక జవాన్ల ప్రాణాలు కొన్ని, కాశ్మీర్ పండిట్ల ప్రాణాలు కొన్ని కాగా అత్యధిక భాగం అఫ్జల్, షౌకత్, గిలానీ, అఫ్సాన్‌ల వంటి సాధారణ కాశ్మీరీల ప్రాణాలే పోయాయి. చంపింది భారత ప్రశాసనమైనా, మిలిటెంట్లయినా చనిపోయింది కాశ్మీరీలే.

విధ్వంసమూ చాలా జరిగింది. అఫ్జల్ బారాముల్లాలోని సొపోర్‌కు చెందినవాడు. అది ఆపిల్ వ్యాపారానికి కేంద్రం. వాణిజ్య కేంద్రమైన సొపోర్ చాలా అందమైన ఊరు. కానీ అది మిలిటెన్సీకి కూడ కేంద్రం. భారత సైన్యం ఆ ఊరిని మూడుసార్లు దాదాపు సంపూర్ణంగా అగ్నికి ఆహుతి చేసింది. సొపోర్‌నే కాదు, కాశ్మీర్ లోయలో అనేక గ్రామాలను, పట్టణాలను తగలబెట్టడం, నివాస స్థలాలను పేల్చివేయడం గత పదిహేడు సంవత్సరాలుగా జరుగుతూనే ఉంది. అటు మిలిటెంట్లు కూడా క్రమేపీ మరింత క్రూరంగా ప్రవర్తిస్తున్నారు. భారత ప్రభుత్వం పైన తాము చేస్తున్న పోరాటంలో సాధారణ పౌరుల ప్రాణాలు తీయడానికి సైతం వాళ్లు ఇవాళ వెనకాడటం లేదు.

తప్పెవరిది ఉన్నా, ఎందరిది ఉన్నా ఈ స్థితికి ప్రాథమిక బాధ్యత భారత ప్రభుత్వానిదే అన్న సగటు కాశ్మీరీల అభిప్రాయాన్ని తప్పుపట్టడం కష్టం. ఇక అఫ్జల్ మాటకొస్తే అతను కొంతకాలం మిలిటెంట్‌గా ఉండి ఆ తరువాత లొంగిపోయి, కొంతకాలం సరెండర్డ్ మిలిటెంట్‌గా ఉండి స్పెషల్ టాస్క్‌ఫోర్స్‌తో పనిచేసి,

ఆద్యంతం విపరీతంగా హింస అనుభవించాడు. అటువంటి వాళ్ళ దగ్గరికి ఎవరైనా వచ్చి భారత ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడుతున్నాం అని చెప్తే, వివరాలు కూడా అడగకుండ వారు ఏ సహాయం అడిగితే ఆ సహాయం ఇవ్వడం ఆశ్చర్యం కలిగించవలసిన విషయం కాదు.

ఈ సామాజిక, చారిత్రక విషయాలు కాకున్నా, చట్టపరమైన విషయాలు న్యాయమూర్తులకు అర్థం కాకపోలేదు. వాళ్ళకు న్యాయ సిద్ధాంత పరిజ్ఞానం లేదని అనడం లేదు. ఆ పరిధిలో వివేచించినంత వరకు సహేతుకంగానే వ్యవహరించారు. ఇది 'పోటా' కింద పెట్టిన కేసు కాబట్టి ముద్దాయిలు పోలీసులకిచ్చిన ఒప్పుకోలును వాళ్ళు సాక్ష్యంగా స్వీకరించి ఉండవచ్చును. ట్రిబ్యునల్ కోర్టు అలానే చేసింది. కాని హైకోర్టు, సుప్రీంకోర్టు ఆ ఒప్పుకోళ్ళను తిరస్కరించాయి. 'పోలీసులు ఒప్పుకోళ్ళు ఏ విధంగా తీసుకుంటారో మాకు తెలియక పోలేదులే' అని సుప్రీంకోర్టు చిన్న చురక కూడా వేసింది.

కానీ ఇటువంటి కేసులలో ఎక్కడో రాజకీయం ప్రవేశిస్తుంది. న్యాయస్థానాలు న్యాయనిర్ణయం చేయడం ఆపేసి ఏవో రాజకీయ కర్తవ్యాలు మీద వేసుకుంటాయి. 'భారత ప్రజల మనోభావాలు' అన్నారు గానీ న్యాయస్థానాలు స్పందించింది దానికి కూడ కాదు. పాకిస్తాన్‌కు, ఇస్లాం పేరు మీద హింస చేసే సంస్థలకు ఏదో సందేశం పంపడం అవసరం అని భావించారు. 'భారతదేశం ప్రజాస్వామ్యమని కదా మీకంతా ఇంత చులకన? ఇక్కడేం చేసినా సాగుతుందని కదా మీ అభిప్రాయం? ఆ ప్రజాస్వామ్య చిహ్నమైన పార్లమెంట్‌పైనే దాడిచేసి భారత్‌ను వెక్కిరిద్దామనుకున్నారా? మీ వాడిని ఉరితీస్తాం చూడండి. మేము చేతకాని వాళ్ళం కామని రుజువు చేస్తాం చూడండి'.

ఇదీ న్యాయస్థానాలతో సహా అన్నీ తెలిసిన, తెలిసి ఉండవలసిన భారతీయుల వైఖరి. దానికి ఏ పాపం ఎరుగని వాడు కాకున్నా, మరీ అంత పాపం ఎరుగని అఫ్జల్ బలి కావలసిందేనా అన్నది మనం వేసుకోవలసిన ప్రశ్న. ఇంకొంచెం ముందుకుపోయి ఆ కొంచెం పాపం కూడ అతనిదా లేక అతనిని బోనెక్కించిన భారత సర్కార్‌దా అన్న ప్రశ్న కూడ మనం వేసుకోవలసిందే. కానీ దీనికి భారత్‌లో ఎంతమంది సిద్ధంగా ఉన్నారు?

(కేసులో సాక్ష్యాధారాలు ఏమున్నాయో, ఏం లేవో నేనెట్లా చెప్పగలుగుతున్నానని నా అభిప్రాయాలతో విభేదించే వారెవరైనా ప్రశ్నించగలరు.

సుప్రీంకోర్టు తీర్పు ఎక్కడయినా దొరుకుతుంది. దానిని ఎవరైనా చదవవచ్చు. కానీ నేను దాని మీద మాత్రమే ఆధారపడలేదు. షౌకత్ హుస్సేన్ గురుకు ట్రయల్ కోర్టులో న్యాయవాదిగా ఉన్న నిత్యారామకృష్ణన్ సీనియర్ న్యాయవాదిగా సహాయం చేయమని కన్నబిరాన్ గారిని కోరారు. కన్నబిరాన్ గారు కేసు కాగితాలన్నీ నాకిచ్చి షౌకత్ తరపున వాదనలు తయారు చేయమని అడిగారు. ఆ విధంగా సాక్ష్యాలు మొత్తం చూసే అవకాశం నాకు కలిగింది.)

**వీక్షణం మాసపత్రిక**

**సెప్టెంబర్ 2006**

# సరబ్‌జిత్: సూత్రబద్ధ వైఖరి

"పాకిస్తాన్‌లో ప్రజలు ఎన్నుకొన్న ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ముషారఫ్ మంత్రివర్గంలోనే ఒక మానవ హక్కుల మంత్రి ఉన్నాడు. ఆయన ప్రభుత్వంలో మంత్రిలాగ కాక మానవహక్కుల కార్యకర్తలా నడుచుకున్నాడు. శత్రుదేశంగా భావించబడే ఇండియా పురమాయింపు మీద తన దేశంలో బాంబు దాడులకు పాల్పడి అనేక మంది ప్రాణాలు తీసినట్టు అభియోగం రుజువయిన వ్యక్తి ప్రాణాన్ని కూడా కాపాడడానికి కంకణం కట్టుకున్నాడు. సరిహద్దుదాటి అతని గ్రామానికి పోయి అతని కుటుంబాన్ని కలిసి తన సానుభూతి తెలియజేశాడు. ఎట్లాగయినా ఉరి తప్పిస్తానని హామీ ఇచ్చాడు. పాకిస్తాన్ బదులు ఇండియాను, సరబ్‌జిత్ సింగ్ బదులు దావూద్ ఇబ్రహీంను ఊహించుకోండి. మన ప్రజాతంత్ర ప్రభుత్వంలో మానవహక్కుల మంత్రి లేదు సరే. ఒకవేళ దేశ మానవహక్కుల కమిషన్ ఛైర్మన్ ఈ రకంగా నడుచుకుంటే ఈ దేశం క్షమించేదా?"

ద్వంద్వ ప్రమాణాలు మనకెంతగా అలవాటయిపోయాయంటే ఇంకొక్క ఉదంతాన్ని పేర్కొంటే ఎవ్వరికీ వినాలన్న ఆసక్తి కలగకపోవచ్చు. పాకిస్తాన్ జైలులో ఉన్న సరబ్‌జిత్ సింగ్‌కు విధించిన మరణదండనను ఖైదుగా మార్చమని మన దేశ ప్రభుత్వమూ, ప్రతిపక్షాలూ, మీడియా అన్నీ ఆ దేశ పాలకులపైన ఒత్తిడి పెడుతున్న తీరు చూస్తే మనది మరణదండన ఎరుగని దేశమేమో, ఇక్కడెవరూ ఉరిశిక్ష కోసం ఎదురు చూస్తున్న ఖైదీలు లేరేమో అనుకోవాలి. రాజీవ్‌గాంధీ హత్య కేసులో ఒక్క నళినికి మాత్రం ఉరి నుంచి విముక్తి లభించగా శంతన్, మురుగన్, పెరారివలన్/(అరివు) అనే ముగ్గురు 16 సంవత్సరాలుగా మరణదండన అమలవుతుందో లేదో తెలియకుండా జైలులో ఉన్నారు. పార్లమెంటు దాడి కేసులో ప్రధాన నిందితుడయిన మహమ్మద్ అఫ్జల్ 7 సంవత్సరాలుగా ఉరి కోసం ఎదురు చూస్తున్నాడు. రాజకీయేతర నేరాలలో మరణదండన పడ్డవారు ఇంకెంత మంది ఉన్నారో తెలియదు. సరబ్‌జిత్ సింగ్‌కు ఉరిశిక్ష తప్పించమని మన ప్రభుత్వం పాకిస్తాన్‌ను కోరడం చాలా సహజమైన విషయంగానూ, ఉదాత్తమైన నడవడికగానూ ఈ దేశంలో అందరూ భావిస్తున్నారు గానీ ముషార్రఫ్ ధైర్యం చేసి అఫ్జల్‌కు ఉరి తప్పించమని మన ప్రభుత్వాన్ని కోరితే మన కందరికీ ఎంత కోపం వస్తుందో?

సరబ్‌జిత్ సింగ్‌పై ఉన్న అభియోగం చిన్నదేమీ కాదు. చాలామంది ప్రాణాలు తీసిన బాంబుదాడి కేసులో అతనిని దోషిగా పాకిస్తాన్ కోర్టులు తేల్చాయి. తీర్పు తప్పని ఇక్కడెవరూ అనడం లేదు. అనడం కష్టం కూడా. ఈ రెండు దేశాల మధ్యనున్న అనేక సామాన్య విషయాలలో నేర విచారణ వ్యవస్థ ఒకటి. ఇద్దరమూ మెకాలే పీనల్‌కోడ్‌నే అనుసరిస్తున్నాము. దానికి అనుబంధంగా రూపొందిన నేర విచారణ వ్యవస్థనే అమలు చేస్తున్నాం. అది న్యాయం చేస్తుందో అన్యాయం చేస్తుందో గాని రెండు దేశాలలోను ఒకే రకంగా చేస్తుంది. పాకిస్తాన్‌లో ప్రజలు ఎన్నుకొన్న ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ముషార్రఫ్ మంత్రివర్గంలోనే ఒక మానవ హక్కుల మంత్రి ఉన్నాడు. ఆయన ప్రభుత్వంలో మంత్రిలాగ కాక మానవహక్కుల కార్యకర్తలా నడుచుకున్నాడు. శత్రుదేశంగా భావించబడే ఇండియా పురమాయింపు మీద తన దేశంలో బాంబు దాడులకు పాల్పడి అనేక మంది ప్రాణాలు తీసినట్టు అభియోగం రుజువయిన వ్యక్తి ప్రాణాన్ని కూడా కాపాడడానికి కంకణం కట్టుకున్నాడు. సరిహద్దుదాటి అతని గ్రామానికి పోయి అతని కుటుంబాన్ని కలిసి తన సానుభూతి తెలియజేశాడు. ఎట్లాగయినా ఉరి

తప్పిస్తానని హామీ ఇచ్చాడు. పాకిస్తాన్ బదులు ఇండియాను, సరబ్‌జిత్ సింగ్ బదులు దావూద్ ఇబ్రహీంను ఊహించుకోండి. మన ప్రజాతంత్ర ప్రభుత్వంలో మానవహక్కుల మంత్రి లేదు సరే. ఒకవేళ దేశ మానవహక్కుల కమిషన్ ఛైర్మన్ ఈ రకంగా నడుచుకుంటే ఈ దేశం క్షమించేదా? అసలు అట్లా నడుచుకోవాలని మానవహక్కుల కమిషన్ ఛైర్మన్‌కు తోచేదా?

పాకిస్తాన్ ధైర్యం చేయటం లేదు. గానీ, ఒకవేళ వాళ్ళు మీరు అఫ్జల్‌కు ఉరి తప్పిస్తే మేము సరబ్‌జిత్ సింగ్‌కు తప్పిస్తామని బేరం పెట్టారనుకోండి. ఇప్పుడు సరబ్‌జిత్ సింగ్ ప్రాణం కాపాడడానికి ఆరాటపడుతున్నవారిలో ఎంతమంది దానికి అంగీకరించమని ప్రభుత్వాన్ని కోరుతారు? ఒకవేళ ప్రభుత్వం అంగీకరిస్తే ఎంతమంది ప్రభుత్వాన్ని క్షమిస్తారు? ఆ బేరం పెడితే అఫ్జల్ తమ పురమాయింపు మీద పనిచేశాడని భారత్ చేస్తున్న ఆరోపణ రుజువయినట్టవుతుందని పాకిస్తాన్ వెనుకాడుతున్నది. నిజానికి పార్లమెంటు దాడి కేసులో పాకిస్తాన్ ప్రమేయం ఉందన్న ఆధారమేదీ భారత్ దగ్గర లేదు. దాడికి పాల్పడి అప్పటికప్పుడు ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన అయిదుగురూ పాకిస్తాన్ కేంద్రంగా గల లష్కర్-ఇ-తోయిబా, జైష్-ఇ-మహమ్మద్ సంస్థల సభ్యులని దాడి జరిగిన తెల్లవారే ఢిల్లీ పోలీసులు ప్రకటించారు గానీ, కేసు దర్యాప్తు పూర్తి చేసిన పిదప దాఖలు చేసిన చార్జిషీటులో అదేమీ లేదు. వారి పేర్లు తెలీవు, ఊర్లు తెలియవు. భారతీయులో, పాకిస్థానీయులో కూడా తెలియదు. అఫ్జల్ అయితే భారత్ అధీనంలోని కాశ్మీర్‌కు చెందినవాడే. అయినప్పటికీ అతనిపైన మీరు కరుణ చూపిస్తే సరబ్‌జిత్‌కు మేము చూపిస్తాం అనడానికి పాకిస్తాన్ బిడియపడుతున్నది. మనకు ఏ మాత్రం బిడియం లేకుండా వ్యవహరిస్తున్నాం. సరబ్‌జిత్ సింగ్ భారతదేశస్థుడే. భారత గూఢచారి వ్యవస్థ పురమాయింపు మీదనే అతను పాకిస్తాన్‌లో బాంబు దాడులకు పాల్పడ్డాడని అతనిపైన అభియోగం. అయినప్పటికీ మనం అతనికి క్షమాభిక్ష పొందడం మన హక్కయినట్టు పాకిస్తాన్‌పై ఒత్తిడి పెడుతున్నాం! దావూద్ ఇబ్రహీం గురించి, మహమ్మద్ అఫ్జల్ గురించి మాట్లాడితే కోపాలు వస్తాయి కాబట్టి పెరారివలన్ గురించి మాట్లాడుకుందాం. 16 సంవత్సరాలుగా 'డెత్‌రో'లో ఉన్న ఇతని కోసం ఇతని ముసలి తల్లిదండ్రులు క్షమాభిక్ష కోసం ఎక్కని గడప లేదు, అభ్యర్థించని అధికారి లేదు. అతనిని ఇప్పటిదాకా ఉరితీయలేదు కాబట్టి ఇంక ఉరితీయరన్న ధీమాతో వారు ఉన్నారు గానీ దానికి కూడా భరోసా లేదు. మక్బూల్ భట్ అనే కాశ్మీరీ మిలిటెంట్

ఉండేవాడు. అతనికి 1976లో ఉరిశిక్ష పడింది గానీ 8 సంవత్సరాలు అమలు కాలేదు. ఆ శిక్ష సంగతి ప్రభుత్వం మరచిపోయినట్టేనని అందరూ భావించారు. అయితే 1984లో కాశ్మీర్ మిలిటెంట్లు బర్మింగ్‌హాంలో భారత అసిస్టెంట్ హైకమిషనర్ రవీంద్ర మాత్రేని చంపగానే మక్బూల్ భట్ ఫైలు బయటకు తీసి దుమ్ము దులిపి అతనిని ఉరితీశారు. కాబట్టి రేపు ఎల్‌టిటిఇవారు ఏ భారత దేశ నాయకుడిపైనో దాడిచేసినట్టయితే పెరారివలన్‌కూ శంతన్‌కూ మురుగన్‌కూ ఇన్నాళ్ళుగా వాయిదా పడిన ఉరిశిక్ష అమలయ్యే ప్రమాదం లేకపోలేదు.

చెప్పొచ్చేది సరబ్‌జిత్ సింగ్ ప్రాణం కాపాడడానికి కృషి చేయొద్దని కాదు. మరణదండన విషయంలో సూత్రబద్ధమైన వైఖరి ఉండాలని. భారత్‌కు అదే లేదు. మరణదండనను రద్దుచేసే దిశగా ఐక్యరాజ్యసమితి చాలా కాలంగా చేస్తున్న యత్నాల పట్ల అత్యంత అనాసక్తిగా ఉన్న దేశాలలో ఇండియా ఒకటి. ఎందుకని ప్రశ్నించినప్పుడు సంపన్నదేశాలు కఠిన శిక్షలు వేయకుండ బతకగలవు గానీ పేదరికం, అలజడి, సంక్షోభాలు నిత్య జీవిత వాస్తవాలయిన మనబోటి దేశాలకది అసాధ్యమని వాదించటం మన పాలకుల అలవాటు. కానీ ఐక్యరాజ్యసమితిలో మరణదండన రద్దు విషయంలో బాగా పట్టుబడుతున్న దేశాలు సంపన్న దేశాలు కావు. నిజానికి అత్యంత సంపన్న దేశమైన అమెరికా మరణదండన రద్దుకు బద్ధవ్యతిరేకి. చాలా పట్టుదలగా మరణదండనను వ్యతిరేకిస్తున్నవీ, దానిని ప్రపంచవాప్తంగా రద్దు చేయడానికి కృషి చేస్తున్నవీ, మనతో అన్ని రకాలుగా పోల్చదగ్గ లాటిన్ అమెరికా దేశాలు. ఉరుగ్వే, కొలంబియా ఈ ఉద్యమంలో అగ్రభాగాన నిలిచాయి. ఆ దేశాలలోనూ పేదరికం పుష్కలంగా ఉంది, అలజడులూ, అల్లర్లూ తరచుగా జరుగుతుంటాయి, మిలిటెంట్ పోరాటాలూ నడుస్తున్నాయి. వాళ్ళకు సాధ్యమైనది మనకు సాధ్యం కాకపోవడానికి సహేతుకమైన కారణమేదీ లేదు.

మనం అమెరికా లాగ ఉరిశిక్ష మానవ హక్కులకు సంబంధించిన విషయం కాదనీ, ఆయా దేశాల నేర శిక్షా స్మృతులకు సంబంధించిన విషయమనీ అంటున్నాం. ఐక్యరాజ్య సమితిలో మరణదండనకు సంబంధించిన తీర్మానాలపైన వోటింగ్ జరిగితే గైరుహాజర్ అయి తప్పించుకుంటున్నాం. 1989 డిసెంబర్ 29 నాడు ఐక్యరాజ్యసమితి రెండవ ఆప్షనల్ ప్రోటోకాల్ పేరిట సభ్యదేశాల సంతకం కోసం ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టింది. సంతకం చేసిన దేశం మరణదండన అమలుపైన నిషేధం పెడుతున్నట్టు, కాలక్రమంలో దానిని పూర్తిగా రద్దు చేసే

దిశగా చర్యలు చేపట్టబోతున్నట్టు ఆ తీర్మానం చెబుతుంది. ఆ తీర్మానం ప్రవేశపెట్టడాన్నే వ్యతిరేకించిన దేశాలలో ఇండియా ఒకటి. దానిపైన వోటింగ్ జరిగినప్పుడు ఇండియా ఎప్పటిలాగే గైర్‌హాజర్ అయింది. వోటు వేసిన దేశాలలో మెజారిటీ అనుకూలంగా వేయబట్టి ఆప్షనల్ ప్రోటోకాల్ కార్యరూపం తీసుకుంది. అయితే దానిపైన సంతకం చేసిన దేశానికి మాత్రమే అది వర్తిస్తుంది. భారత్ సంతకం చేయలేదని వేరే చెప్పనవసరం లేదు. పాకిస్తాన్ కూడా చేయలేదు. ఐక్యరాజ్యసమితి సభ్య దేశాలలో మెజారిటీ సంతకం చేశాయి. ఎట్లాగూ సరబ్‌జిత్ సింగ్ కుటుంబసభ్యులతో కలిసి అందరమూ కన్నీళ్లు పెడుతున్నాము కాబట్టి ఇప్పుడయినా భారత్ 1989 నాటి ఆప్షనల్ ప్రోటోకాల్‌పైన తాను సంతకం చేసి పాకిస్తాన్‌ను కూడ సంతకం చేయమని ఆహ్వానిస్తే ఎంత బాగుంటుంది! సరబ్‌జిత్ ప్రాణంతో పాటు భారతదేశపు జైళ్లలో ఉరిశిక్ష కోసం ఎదురు చూస్తున్న చాలామంది ప్రాణాలూ దక్కుతాయి. మానవ హక్కుల విషయంలో రెండు దేశాలూ ఒకడుగు సూత్రబద్ధంగా ముందుకేసినట్టూ అవుతుంది.

**ఆంధ్రజ్యోతి దినపత్రిక**
**2 మే 2008**

*"హంతకుడంటే మనిషి ప్లస్ హత్య, హత్యను శిక్షించి, మనిషిని మిగిలిస్తేనే నిజమైన న్యాయం జరుగుతుంది"*

**– వి.ఆర్. కృష్ణయ్యర్,** సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి

*ఉరికంబం మనిషిని చంపే యంత్రం మాత్రమే కాదు. భయోత్పాతానికి, క్రూరత్వానికి, జీవితాన్ని అవమానపర్చడానికి అది ప్రతీక. ఆదిమ రాక్షసత్వానికి, మధ్యయుగ మౌఢ్యానికి, ఆధునిక నిరంకుశత్వానికి అది ఒక సామాన్య లక్షణం.*

**– ఆర్థర్ కోస్లర్**

*శిక్ష వేసినప్పటి నుంచి అది అమలుపరిచే వరకూ ఖైదీలు కంటిముందు మృత్యువు మెదులుతుంటే కండెమ్డ్ సెల్స్‌లో ఉంటూ ఒంటరిగా మానసిక క్షోభతో ఎంతగానో కృశించిపోతారు. ఆ బాధలో ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నిస్తారు. వాళ్ళంతకు ముందు నేరాన్ని చేశారో లేదో వేరే విషయంగానీ జైలులో మా ముందుకు వచ్చినప్పటినుంచి కృంగిపోతూ క్షమాబిక్ష కోసం ఎదురుచూస్తూ దీనంగా కనిపిస్తుంటారు. అటువంటి వాళ్లని నిర్దాక్షిణ్యంగా ఉరితీయడానికి మాకూ ఎంతగానో బాధగా ఉంటుంది... ఉరితీత తర్వాత రెండు మూడు రోజులు కండెమ్డ్ సెల్స్‌వేపు కూడా వెళ్ళేవాణ్ణి కాను. అక్కడ వాళ్లు నిల్చుని 'సార్ నాకు క్షమాబిక్ష దొరికిందా' అని కన్నీళ్ళతో పదేపదే అడుగుతున్నట్లనిపించేది...*

**– ఖురుదుకర్**

(సికింద్రాబాద్ జైలు సూపరింటెండెంట్‌గా పనిచేసి ఎనిమిది ఉరిశిక్షలను అమలుపరచిన అధికారి)

*ఆఖరి ఘడియల్లో వారిని చూస్తున్నప్పుడు నాకు అర్థమయ్యేది నేను చేస్తున్న పనివల్ల ఒక్కటంటే ఒక్క హత్య కూడా ఆగలేదని.*

**– అల్బర్ట్ పియిర్‌పాయింట్**

(బ్రిటన్‌లో పాతికేళ్లపాటు నిపుణుడైన తలారిగా అనేకమందిని ఉరితీసిన వ్యక్తి)

# ఆ శిక్షే ఒక నేరం

## కె. బాలగోపాల్



చిలకలూరిపేట ఘటన చాలా ఘోరమైన నేరమే. కాని ఇక్కడ చర్చ నేరాల గురించి కాదు. శిక్షల గురించి. నేరాలు ఘోరంగా ఉన్నాయని శిక్షలు ఘోరంగా ఉండాలా? కాలు నరికిన వాడికి కాలు నరకడమే శిక్ష అని ఎవ్వరూ అనరు. జైలుశిక్షే దానికి తగిన శిక్ష అని ఒప్పుకుంటారు. కాని హత్యానేరం విషయంలో చంపిన మనిషికి చావే శిక్ష అంటారు. కంటికి కన్ను, పంటికి పన్ను అనే శిక్షా విధానం ఆదిమ ప్రతీకార నీతికి ఆఖరి అవశేషం. తప్పు చేసిన వ్యక్తిని సంస్కరించి సమాజానికి ఉపయోగపడే వ్యక్తిగా తయారుచేసి బయటకు పంపే శిక్షాస్మృతే నిజంగా నైతికమైంది.

.......................................................................

నేరాలు జరగడానికి గల కారణాలు సమాజంలోనూ మానవ జీవితంలోనూ అనేకం ఉంటాయి. నేరాలను అదుపు చేయడానికి ఆయా రంగాలలో కృషి చేయవలసి ఉంటుంది. దాన్ని విడిచిపెట్టి శిక్షల కాఠిన్యాన్ని గురించి మాత్రమే చర్చ పెట్టడం ఈ కర్తవ్యాన్ని తప్పించుకోవడానికి తప్ప ఇంకెందుకూ పనికిరాదు. దానివల్ల శిక్షాస్మృతి మరింత క్రూరంగా అనాగరికంగా తయారవుతుందే తప్ప ఏ సమస్యా పరిష్కారం కాదు.

A Human Rights Publication